ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ప్రకాశం 3
జిల్లా వార్తలు
బుధవారం 14, ఫిబ్రవరి 2024

ఆ చాక్లెట్లు చాలా ప్రమాదకరం

గంజాయి మిశ్రమంతో తయారు చేసే చాక్‌లెట్లు చాలా ప్రమాదకరమని నిపుణులు చెబుతున్నారు. వాటిని నమలడం వలన శరీరంలోని అనేక అవయవాలు త్వరగా దెబ్బతినే ప్రమాదం ఉంది. ఐదు గ్రాములు ఉన్న ఆ చాక్‌లెట్‌లో 15శాతం గంజాయి ఉన్నట్లు గుర్తించారు. గంజాయి కారకాలు నేరుగా అవయవాలపై ప్రభావం చూపుతాయి. ఎక్కువగా ఇలాంటివి తిన్నవారికి కేన్సర్ వచ్చే అవకాశం ఉంది. చాక్‌లెట్లు కొంతమంది నమిలి మింగుతారు. మరికొందరు ఎకువ సేపు బుగ్గన పెట్టుకొంటుంటారు. ఒక్క చాక్లెట్ రెండు గంటలపాటు మత్తుని ఇస్తుందని వినియోగించిన వారు చెబుతున్నారు. ఇవి విద్యార్థులకు చేరువైతే పరిస్థితి ఆందోళనకరంగా మారే అవకాశం ఉంది.



గంజాయి ముఠాలు రూటు మార్చాయి. మత్తులో చిత్తవుతున్న యువతకు మరింత చేరువయ్యేందుకు కొత్త ఎత్తుగడ వేశాయి. చాక్‌లెట్ రూపంలో కార్మికులు, విద్యార్థులు, యువతకు వల విసురుతున్నాయి. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్, బాపట్ల జిల్లా పర్చూరులో ఈ వ్యవహారం బయటకు రాగా తాజాగా జిల్లాలో కూడా వెలుగుచూసింది. ఉత్తరాది ప్రాంత కార్మికులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో గంజాయి చాక్‌లెట్‌ల విక్రయాలు జోరందుకున్నాయి. ఉమాంగ్, చార్మినార్, శ్రీమహాకాల్ అనే పేర్లతో ఈ చాక్‌లెట్లు మార్కెట్లో దొరుకుతున్నాయి. వీటిని బడ్డీకొట్లలో యథేచ్ఛగా విక్రయిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇవేకనుక విద్యార్థులకు చేరువైతే పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం ఉంది.

గంజాయి చాక్లెట్

- గెలాక్సీపురిలో గ్రానైట్ కార్మికులకు జోరుగా విక్రయాలు
- కళాశాలలకు చేరువయ్యే అవకాశం
- ఒడిశా, బిహార్ నుంచి దిగుమతి
- అప్రమత్తమైన ఎస్‌ఈబీ



రూటుమార్చిన స్మగ్లర్లు

ఒంగోలు (క్రైం) ఫిబ్రవరి 13 : గంజాయి విక్రయ ముఠాలు రెచ్చిపోతున్నాయి. విద్యార్థులు, యువతే లక్ష్యంగా చేసుకుని వారికి అందుబాటులో సరుకు ఉండేలా ఎత్తులు వేస్తున్నాయి. ఎస్‌ఈబీ, పోలీసులకు అనుమానం రాకుండా రకరకాల మార్గాల్లో విక్రయాలు చేపడుతూ భారీగా దండుకుంటున్నాయి. కొందరైతే ఏకంగా బడ్డీకొట్లు, టీస్టాళ్లను అడ్డాగా చేసుకుంటున్నారు. తాజాగా చాక్లెట్ల రూపంలో అమ్మడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇటీవల మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు గంజాయికి బానిసలైనట్లు బయటపడింది. ఆక్రమంలో దాడులకు పాల్పడిన ఘటనలూ చోటుచేసుకొని రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. కళాశాలల విద్యార్థులు ఆ మత్తుకు బానిసలుగా మారుతున్నారని తెలిసి జిల్లా పోలీసు యంత్రాంగం అప్పట్లో గంజాయి విక్రయాల కట్టడిపై దృష్టి సారించింది. బాధిత విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పోలీసు, ఎస్‌ఈబీ అధికారులు సంయుక్తంగా అవగాహన కార్యక్రయాలు నిర్వహించారు. అయినప్పటికీ పరిస్థితి అదుపులోకి రాలేదు. మూలాలు ఎక్కువగా కళాశాలల్లోనే ఉండటమే అందుకు కారణం. అదే విధంగా గంజాయి విక్రయదారులపై కేసులు నమోదు చేసి కట్టడి చేసే క్రమంలో గంజాయి చాక్‌లెట్ల విక్రయం బయటపడింది. చీమకుర్తి మండలం బూదవాడలోని యల్లయ్యనగర్‌లో బడ్డీకొట్లో వీటిని విక్రయిస్తున్నట్లు గుర్తించిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు మంగళవారం వలపన్ని పట్టుకున్నారు. గతంలో ఇదేవిధంగా పర్చూరులో

ఒడిశా, బిహార్ నుంచి దిగుమతి

గంజాయి చాక్‌లెట్లు బిహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, మధ్యప్రదేశ్‌లలో తయారవుతున్నట్లు ఎస్‌ఈబీ అధికారుల విచారణలో వెల్లడైంది. రెండు నెలల క్రితం పర్చూరులో గంజాయి చాక్‌లెట్లు విక్రయిస్తున్న ఒడిశా యువకుడిని అధికారులు పట్టుకున్నారు. తాజాగా చీమకుర్తి మండలం యల్లయ్యనగర్‌లో పట్టుబడ్డాయి. బిహార్‌కు చెందిన నరేష్ సహనీ 2013 నుంచి యల్లయనగర్‌లో నివాసముంటూ గ్రానైట్ పరిశ్రమలలో పనిచేస్తున్నాడు. అతను అక్కడే ఓ బడ్డీకొట్టు నిర్వహిస్తున్నాడు. పక్కా సమాచారం మేరకు కొట్టులో సుమారు 3.5 కిలోల గంజాయి చాక్‌లెట్లను ఎస్‌ఈబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఉమాంగ్, శ్రీమహాకాల్, చార్మినార్ బ్రాండ్‌లతో చాక్లెట్లు ఉన్నాయి. ఒక్కో చాక్‌లెట్ పది నుంచి ఇరవై రూపాయిల వరకు అమ్ముతున్నారు. బిహార్‌లోని సమస్తపూర్ నుంచి గంజాయి చాక్‌లెట్లు తెచ్చి విక్రయిస్తున్నారు.



గంజాయి చాక్‌లెట్లు విక్రయిస్తున్న వారిని ఎస్‌ఈబీ అధికారులు పట్టుకున్నారు. చాక్‌లెట్ల రూపంలో జిల్లాలోకి గంజాయి రావడం ప్రమాదకర పరిస్థితికి అద్దం పడుతుంది.

నిఘా పెంచిన ఎస్‌ఈబీ

గంజాయి చాక్‌లెట్ల విక్రయాలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అప్రమత్తమయ్యారు. చీమకుర్తి మండలం బూదవాడ యల్లయ్యనగర్‌లో గంజాయి చాక్‌లెట్లు విక్రయిస్తున్న నరేష్ సహనీపై కేసు నమోదు చేసిన అధికారులు జిల్లాలో ఇంకా ఎక్కడైనా విక్రయిస్తున్నారా? అన్న దానిపై దృష్టిసారించారు. బడ్డీకొట్లలో గంజాయి విక్రయాలు ఆందోళన కలిగించే అంశం కావడంతో పోలీసు యంత్రాంగం జిల్లా అంతటా అప్రమత్తమై నిఘా పెంచింది.

ఇదేం పంచాయతీ

నిధులున్నా వాడుకునే అవకాశం లేదు

- సమస్యలతో ఇబ్బందిపడుతున్న ప్రజలు
- ఆర్థిక సంఘం నిధులతో జీతాలు, కరెంటు బిల్లులు చెల్లించేందుకు ప్రయత్నాలు
- అల్లాడుతున్న పంచాయతీల పాలకవర్గాలు



ఒంగోలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 13 : ఆర్థిక సంక్షోభంలో ఉన్న గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆర్థికసంఘం నిధులను కూడా అత్యవసర సమయంలో వాడుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. దీనిపై పాలకవర్గాలు మండిపడుతున్నాయి. అనేక పంచాయతీల్లో పాత బిల్లులతోపాటు తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చుతుండగా, మరికొన్నిచోట్ల సమస్యలు చుట్టుముట్టాయి. వచ్చిన కొద్దిపాటి నిధులతో ఏదైనా చేద్దామని ఆశించిన సర్పంచ్‌లకు ప్రభుత్వం నుంచి ఆశించిన మేర సహకారం కరువైంది. గత నెలాఖరులో కేంద్ర ప్రభుత్వం ఆర్థికసంఘం నిధుల ద్వారా రూ.38కోట్లకుపైగా నిధులు వచ్చాయి. వాటిని ఏదో ఒక మంచిపని కోసం వినియోగించుకోవాలనుకున్న పాలకవర్గాలకు ప్రభుత్వ పెద్దల ఆదేశాలు తలనొప్పిగా మారాయి. గత రెండేళ్ల నుంచి ఆర్థిక సంఘం నిధులను విద్యుత్ బిల్లులు, పారిశుధ్య కార్మికుల జీతాల పేరుతో స్వాహా చేసిన ప్రభుత్వం.. ఇప్పుడు కొత్త పంథాలో ఆ నిధులను దారిమళ్లించే ప్రయత్నాలకు శ్రీకారం చుట్టిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వేసవిలో చిన్నచిన్న పనులు చేసుకోకుండా నిధుల విడుదలపై ఆంక్షలు విధించింది. ఇప్పుడు తాజాగా విద్యుత్ బిల్లుల బకాయిలతోపాటు పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలని పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి పెంచింది. ఇప్పటికే అనేక గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు, కార్యదర్శుల మధ్య నిధుల విషయంపై మనస్పర్థలు వచ్చి ఇబ్బంది పడుతున్నారు. ఇదేసమయంలో ప్రభుత్వ ఆంక్షలతో కార్యదర్శులు మరింత ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడింది. అనేక గ్రామాల్లో అత్యవసర సమయంలో చేసిన పనులకు లక్షల్లో బిల్లులు పేరుకుపోయాయి. పంచాయతీలకు మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు వచ్చిన సమయంలో వివిధ పనులతోపాటు సభల ఏర్పాటుకు అప్పులు తెచ్చి పెట్టారు. ఇప్పుడు వచ్చిన నిధులతో ఆ అప్పులు తీరుద్దామంటే ఆంక్షలు అడ్డొచ్చాయి. ఇప్పటికే ట్రెజరీల్లో అనేక బిల్లులపై ఆంక్షలు విధించగా, మార్చిలో ఆర్థిక సంవత్సరం ముగింపు కావడం, సార్వత్రిక ఎన్నికల సమయం సమీపిస్తుండటం, ఇంకోవైపు పాలకవర్గాలు నిధుల వినియోగంపై కార్యదర్శులపై ఒత్తిడి పెంచుతుండటంతో ఏంచేయాలో తెలియక వారు కొట్టుమిట్టాడుతున్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

- రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు 8 ప్రాజెక్టులు ఎంపిక

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 13 : నగరంలోని ఆగ్జిలియం ఇంగ్లీషు మీడియం స్కూలులో మంగళవారం నిర్వహించిన ఇన్‌స్పైర్ 2022-23 వైజ్ఞానిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ప్రదర్శనను జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర ప్రారంభించి ఎగ్జిబిట్‌లను తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్ పట్ల అభిలాషను పెంచాలన్నారు. సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. మొత్తం 79 ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. వీటిలో ఎనిమిది ఉత్తమ ఎగ్జిబిట్స్‌ను చిత్తూరులో జరగనున్న రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక చేశారు.



రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ప్రాజెక్టులు ఎంపికైన విద్యార్థులతో డీఈవో సుభద్ర, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు

మెప్మా స్కాంపై కదలిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- అక్రమాలపై విచారణకు కలెక్టర్ ఆదేశం
- ముగ్గురు జిల్లా అధికారుల నియామకం
- ఇప్పటికే పలువురిపై చర్యలకు సిద్ధం?




ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 13 : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో కోట్ల రూపాయల కుంభకోణంపై అధికారులు అప్రమత్తమయ్యారు. సమగ్ర విచారణ చేయించి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడంపై కలెక్టర్ దృష్టి సారించారు. అవినీతి వ్యవహారంలో వైసీపీకి చెందిన పలువురు ద్వితీయశ్రేణి నాయకులతోపాటు, మెప్మా ఉద్యోగుల పాత్ర ఉందని అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు తెలిసింది. బోగస్ గ్రూపులను సృష్టించి, పలు ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల్లో కోట్ల రూపాయల రుణ దోపిడీకి పాల్పడిన వ్యవహారాన్ని ఆంధ్రజ్యోతి వరుస కథనాలతో వెలుగులోకి తీసుకొచ్చింది. ఇదే విషయమై తెలుగుదేశం పార్టీ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదుచేయడంతోపాటు, అక్రమాలు నిగ్గుతేల్చాలని డిమాండ్ చేశారు. రుణదోపిడీకి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఎమ్మెల్యే బాలినేని కూడా ఇదే విషయమై సీరియస్ అయ్యారు. సంబంధిత అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి మండిపడినట్లు సమాచారం. మెప్మాలో జరిగిన స్కాంపై విచారణ చేసి, భాగస్వాములైన వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ ఆ దిశగా విచారణను వేగవంతం చేశారు. అందులోభాగంగా డీఆర్‌డీఏ పీడీ, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజరు, సివిల్ సప్లయిస్ అధికారులను విచారణకు ఆదేశించారు. వారు మంగళవారం ఒంగోలులోని మెప్మా కార్యాలయంలో సీఎంఎం, సీవోలు, ఐబీ స్పెషలిస్ట్, ఇతర ఉద్యోగులను నాలుగు గంటలపాటు విచారించారు. అయితే పొదుపు గ్రూపుల ఏర్పాటు ఎలా చేశారు? గ్రూపు సభ్యులు ఎన్ని బ్యాంకుల్లో రుణాలు తీసుకోవచ్చు? ఏ విధమైన రుణాలు మంజూరయ్యే అవకాశం ఉంది? అక్రమంగా రుణాలు తీసుకునేందుకు ఏవిధమైన అడ్డదారులు తొక్కారు? అనే అంశాలపై అంతర్గతంగా విచారణ చేపట్టారు. అందిన సమాచారం మేరకు మొదటి రోజు విచారణలో ఐదుగురు సీవోలు, ముగ్గురు ఆర్పీలను గుర్తించి వారికి చార్జ్‌మెమోలు జారీ చేసినట్లు తెలిసింది. వీరితోపాటు ఆర్పీలు, మెప్మా అధికారులు, పలువురు ఉద్యోగుల పాత్ర కూడా ఉన్నట్లు సమాచారం. అయితే విచారణ ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో వివరాలను వెల్లడించేందుకు అధికారులు అంగీకరించ లేదు. పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిసింది.

సిద్ధంగా ఉండండి

అతి ధీమా వద్దు.. అప్రమత్తతతో ముందుకు సాగండి

- అందరినీ కలుపుకుపోండి
- ఎవరినీ విస్మరించొద్దు
- మాజీ ఎమ్మెల్యేలు దామచర్ల, ఉగ్ర, కందులకు బాబు సూచన



(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

రానున్న ఎన్నికల సమరానికి సిద్ధమైన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పోటీచేసే పార్టీ అభ్యర్థులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఆ మేరకు ఆయా నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జిలను పిలిపించుకుని అక్కడి లోటుపాట్లను వారి దృష్టికి తెచ్చి సవరించుకోవాలని కూడా సూచిస్తున్నారు. అప్రమత్తంగా ఉండండి, అందరినీ కలుపుకుపోండని చెప్తున్నారు. మంగళవారం రాత్రి జిల్లాలోని ఒంగోలు, కనిగిరి, మార్కాపురం నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జిలు దామచర్ల జనార్దన్, డాక్టరు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డిలతో చంద్రబాబు భేటీ అయ్యారు. ఆయా నియోజకవర్గాల్లో ఉన్న తాజా పరిస్థితులను, నాయకుల లోటుపాట్లపై తన వద్ద ఉన్న సమాచారాన్ని వివరంగా చెప్పినట్లు తెలిసింది. విజయంపై అతి ధీమా కాదు ఆత్మవిశ్వాసంతో, సరైన ప్రణాళికతో ముందుకుపోవాలని సూచించారు. జనసేన వారిని ఎలా కలుపుకొని పోవాలి అనే విషయాన్ని సవివరంగా చెప్పారు. ఇంకా పార్టీశ్రేణుల్లో ఏదో ఒక విషయంలో అలకతో ఉన్నవారిని పిలిచి మాట్లాడాలని సూచించినట్లు తెలిసింది. ఒంగోలు నియోజకవర్గంలో పరిస్థితులను ఆయన వివరిస్తూ 'పార్టీలో కొందరు నాయకులు దూరంగా ఉన్నారు, వారందరినీ పిలిచి మాట్లాడుకోండి. ఏ ఒక్క చిన్న అవకాశాన్నీ వదల వద్దు' అని సూచించినట్లు తెలిసింది. కనిగిరి విషయంపై మాట్లాడుతూ ఎదుటి అభ్యర్థి బలహీనుడనే నమ్మకంతో ముందుకు సాగకుండా పోటీలో ఎవరు ఉన్నా మన గెలుపే ముఖ్యం అన్నట్లుగా ముందుకు వెళ్లాలని సూచించారు. మార్కాపురం నియోజకవర్గంలో మారుతున్న రాజకీయ పరిస్థితులను వివరిస్తూ తదనుగుణంగా ఆయా ప్రాంతాల వారీ తీసుకోవాల్సిన చర్యలను వివరించినట్లు తెలిసింది. ఈ ముగ్గురు నాయకులతో విడివిడిగా తొలుత భేటీ అయిన ఆయన ఎన్నికల సన్నాహం గురించి ముందుగా తెలుసుకున్నట్లు సమాచారం. పార్టీకి అనుకూలమైన వాతావరణం ఉంది, దానిని సద్వినియోగం చేసుకుని ముందుకు సాగితేనే ఆశించిన ఆధిక్యత లభిస్తుందని చెప్పారు. ఇంకా చురుగ్గా పనిచేయని టీడీపీ నాయకుల గురించి ప్రస్తావిస్తూ వారితోపాటు ఆయా సామాజిక వర్గాలకు సంబంధించి తటస్థంగా ఉన్న నాయకులను కలుపుకొని పోవాల్సిన అవసరాన్ని కూడా తెలియజేసినట్లు తెలుస్తోంది.

లోక్‌సభకు దీటైన అభ్యర్థి

ఒంగోలు లోక్‌సభ అభ్యర్థి విషయాన్ని చంద్రబాబు ప్రస్తావిస్తూ 'దీటైన అభ్యర్థినే రంగంలోకి పంపుతాం. ఆయన ద్వారా మీమీ ప్రాంతాల్లో ఎలాంటి అవకాశాలు కలిసొస్తాయో తెలుసుకుని తదనుగుణంగా ముందడుగు వేయాలి. అధికార పార్టీ నేతల ఆగడాలను, వారి వ్యవహారశైలిని, ఎన్నికల ఎత్తుగడలను ఎప్పటికప్పుడు గుర్తించి గట్టి సమాధానం ఇస్తూ ముందుకు సాగాలి. ఎన్నికలు మార్చిలో అనుకున్నాం. ఏప్రిల్‌కు పోయే అవకాశం ఉంది. ఈ సమయంలో మరికొన్ని మార్పులూ జరగవచ్చు. భవిష్యత్తులో మీతోపాటు కిందిస్థాయి వరకు పార్టీకోసం పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు అండగా మనం నిలుస్తాం. పాలనాపరమైన వ్యవహారాల్లోనూ వారికి చేదోడుగా ఉంటాం. ఆ విషయంలో ఎలాంటి అనుమానాలు పెట్టుకోకుండా ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తల్లో మనోధైర్యాన్ని కల్పించి ముందుకు తీసుకెళ్లాలి' అని చెప్పినట్లు తెలుస్తోంది. ఎప్పటికప్పుడు నియోజకవర్గాల్లో పరిస్థితిని సమీక్షించి రాష్ట్ర పార్టీ నుంచి అవసరమైన సూచనలు ఇస్తామని, వాటిని పాటించాలని స్పష్టంగా చెప్పినట్లు సమాచారం. జిల్లాలో జనసేనతో ఉండే రాజకీయ సంబంధాలపై కూడా ఒక స్పష్టతనిస్తూ ధైర్యంగా ముందుకు సాగండని కూడా చెప్పినట్లు తెలుస్తోంది.

అధికార అండతో
అక్రమ లేఅవుట్లు



- ఓడా నుంచి నేరుగా అనుమతులు
- పంచాయతీకి ఇవ్వాల్సిన పదిశాతం భూమిని కూడా కేటాయించని పరిస్థితి
- ఎన్‌వోసీ లేకుండానే నేరుగా దరఖాస్తు
- జిల్లావ్యాప్తంగా 922 లేఅవుట్లలో 670 అనధికారికమే
- నిబంధనలకు విరుద్ధంగా 252 చోట్ల అనుమతి
- కలెక్టర్ సీరియస్‌తో ఒక్కొక్కటిగా వెలుగులోకి..

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 13 : జిల్లాలో అధికారపార్టీ నాయకుల అండదండలతో విచ్చలవిడిగా అనధికారికంగా లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఒక ప్రాంతంలో లేఅవుట్ వేయాలంటే ముందుగా పంచాయతీ లేదా మునిసిపాలిటీల నుంచి ఎన్‌వోసీ తీసుకోవాలి. కానీ జిల్లాలో అందుకు భిన్నంగా లేఅవుట్లకు అనుమతి ఇస్తున్నారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఓడా)ని ఏర్పాటు చేసిన ప్రభుత్వం దానికి కొన్ని నిబంధనలు విధించింది. అయితే అవేమీ ప్రస్తుతం అమలు కావడం లేదు. పంచాయతీల ప్రమేయం లేకుండా నేరుగా అక్కడి నుంచే అనుమతులు ఇస్తున్నారు. జిల్లాలోని 38 మండలాల పరిధిలో 922 లేఅవుట్లు ఉండగా అందులో 252 ఓడా నుంచి అనుమతులు తీసుకోగా, 670 లేఅవుట్లలో అనధికారికంగానే ప్లాట్ల విక్రయాలు జరుగుతున్నాయి. సుమారు 2,824 ఎకరాల్లో 56,740 ప్లాట్లు అమ్మకాలకు పెట్టినట్లు పంచాయతీ కార్యదర్శులు గుర్తించారు. అయితే ఓడా నుంచి అనుమతులు తీసుకున్న లేఅవుట్లకు కూడా గ్రామ పంచాయతీకి చెల్లించాల్సిన సెస్‌కానీ, 10శాతం ల్యాండ్‌ను కానీ కేటాయించిన పరిస్థితి లేకుండా పోయింది. ఆ భూమి వద్దకు పంచాయతీ కార్యదర్శి వెళ్లిన కొద్ది నిమిషాల్లోనే అధికార పార్టీ లేదా ఓడాలో కీలకంగా ఉండే ఒక అధికారి నుంచి ఫోన్ చేసి వెనక్కు రమ్మని చెప్తున్నారు.

నిబంధనలకు నీళ్లు

సాధారణంగా మునిసిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో లేఅవుట్లు వేస్తున్నట్లు రియల్ ఎస్టేట్ వ్యాపారి దరఖాస్తు చేసుకోవాలి. అక్కడి నుంచి ఎన్‌వోసీ తీసుకున్న తర్వాత అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. కానీ అందుకుభిన్నంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు (అధికారపార్టీ నేతలు) నేరుగా ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి లేఅవుట్ అప్రూవల్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారు. అది నిబంధనలకు అనుగుణంగా ఉందా? లేదా? అని పరిశీలించిన తర్వాత అనుమతి ఇవ్వాల్సి ఉంది. కానీ అవేమీ పరిశీలించకుండానే ఓడా కార్యాలయంలో పనిచేసే ఒక మహిళా అధికారి అన్నీ తానై చకచకా అనుమతులు ఇస్తూ వెళ్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే అప్రూవల్ అయిన లేఅవుట్లలో పంచాయతీకి కేటాయించాల్సినవి పట్టించుకోవడం లేదు.

చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశం

అక్రమ లేఅవుట్ల వ్యవహారం కలెక్టర్ దినేష్‌కుమర్ దృష్టికి రావడంతో ఇటీవల నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మండల విస్తరణాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంతనూతలపాడు, సింగరాయకొండ, పామూరులలో అనధికార లేఅవుట్లపై సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈనేపథ్యంలో జిల్లాలో ప్రధానమైన మండలాలు, పట్టణాల్లో అనధికారిక లేఅవుట్లపై సంబంధిత అధికారులు దృష్టి సారించారు. అందిన సమాచారం మేరకు ఒక్క సంతనూతలపాడు మండలంలోనే 25 అక్రమ లేఅవుట్లు ఉండగా అందులో మంగమూరు గ్రామ సమీపంలోనే పది ఉన్నట్లు తెలిసింది. వీటికి ఆయా పంచాయతీల నుంచి అనుమతులు కూడా లేనట్లు సమాచారం.

బ్యారన్లు ఖాళీ లేక..!

వర్జీనియా పొగాకును ఎండబెడుతున్న రైతులు

ఎండిన పొగాకు క్వింటా రూ.15వేలు



పొలాల్లో ఎండబెట్టిన పొగాకు

కొండపి, ఫిబ్రవరి 13 : పొగాకు చేలల్లోనే ఎండిపోతోంది. బ్యారన్‌లు ఖాళీ లేకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో కొట్టుకి రూ.50వేల అద్దె చెల్లించేందుకు సిద్ధపడినా బ్యారన్‌లు దొరకని పరిస్థితి నెలకొంది. దీంతో పొలాల్లోని పొగాకును రైతులు దూసి ఖాళీ ప్రదేశాల్లో ఎండబెడుతున్నారు. ఎండిపోయిన పొగాకుకు కూడా క్వింటా రూ.15 వేల ధర పలుకుతుండటంతో ఈవిధంగా చేస్తున్నారు. ఈపరిస్థితి కొండపి ప్రాంతంలోని అన్ని గ్రామాల్లో కనిపిస్తోంది. సహజంగా బర్లీ పొగాకును ఎండబెడతారు. వర్జీనియా పొగాకును బ్యారన్‌లలో క్యూరింగ్ చేస్తారు. బ్యారన్‌లు దొరక్క వర్జీనియా పొగాకును ఒక్కొక్కరం ఐదు నుంచి పది క్వింటాళ్ల వరకూ ఎండబెట్టుకుంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి ఉపాధి పనులపై తనిఖీ



మాట్లాడుతున్న ఏపీడీ వెంకటస్వామి

టంగుటూరు, ఫిబ్రవరి 13 : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై బుధవారం నుంచి సామాజిక తనిఖీ జరగనుంది. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకూ చేసిన వాటితోపాటు అనుసంధానంగా జరిగిన ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, సమగ్ర శిక్ష శాఖల్లో పనులు, సామాజిక పెన్షన్లను కూడా తనిఖీ చేస్తారు. సామాజిక తనిఖీ బృందం వారు అందులో భాగస్వామ్యమైన వివిధ శాఖల సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. డ్వామా జిల్లా అధికారి కె.ఝాన్సీరాణి, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.వెంకటస్వామి, సామాజిక తనిఖీ ఎస్‌ఆర్‌పీ సుబ్బారావు పాల్గొని పలు సూచనలు ఇచ్చారు. సమావేశం అనంతరం సామాజిక తనిఖీ సిబ్బంది వారికి కేటాయించిన గ్రామాలకు రికార్డులతో సహా తరలివెళ్లారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ కిశోర్

సింగరాయకొండ, ఫిబ్రవరి 13 : ఒంగోలు డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కిషోర్ మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై టి.శ్రీరామ్‌ను అడిగి తెలుసుకున్నారు. నేరాల కట్టడికి తీసుకోవాల్సిన చర్యలు గురించి పలు సూచనలు చేశారు. రౌడీషీటర్లపై అనునిత్యం నిఘా ఉంచాలన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీసరస్వతి విద్యార్థుల ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ రమణారెడ్డి

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 13 : జేఈఈ మెయిన్ ఫలితాల్లో ఒంగోలులోని శ్రీసరస్వతి విద్యా సంస్థల విద్యార్థులు జాతీయస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించారు. టాప్ పర్సంటైల్స్‌తో జిల్లా స్థాయిలో మొదటి ఐదు స్థానాలను కైవసం చేసుకున్నారు. దీంతో జాతీయస్థాయిలో జిల్లాకు, శ్రీసరస్వతి విద్యాసంస్థలకు మంచి గుర్తింపు తెచ్చిందని విద్యాసంస్థల చైర్మన్ ఏవీ.రమణారెడ్డి తెలిపారు. స్థానిక సరస్వతి కళాశాలలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కె.సాకేత్‌సాయిరాం98.24 పర్సంటైల్ సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. అలాగే ఆర్.చంద్రనిహారిక 97.57, కె.సాయికిరణ్ 97.45, కె.గోపీచంద్ 97.40, ఎస్.ఇంద్రసేనారెడ్డి 95.32 పర్సంట్‌లతో తర్వాత స్థానాల్లో నిలిచారు. కళాశాలలో 14 మంది విద్యార్థులు 90కిపైగా, 46 మంది 80నుంచి 90 వరకు, 123 మంది విద్యార్థులు 70నుంచి 80 వరకు పర్సంటైల్ సాధించారు. 132 మంది జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, అందుకు కృషి చేసిన అధ్యాపకులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు ఎ.గణేష్‌రెడ్డి, ఎ.గంగాశంకరరెడ్డి, సీఈవో సురేష్, డీన్స్, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సత్తా చాటిన శ్రీప్రతిభ విద్యార్థులు



విద్యార్థులతో కలిసి అభివాదం చేస్తున్న చైర్మన్ వెంకటేశ్వర్లు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 13: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఒంగోలులోని శ్రీ ప్రతిభ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. పుట్లూరి గోవర్ధన్ 96.47 పర్సంటైల్, రావి మహేష్‌చౌదరి 95.739, గట్టుమనేని మోహితాసాయి 95.50, తోట వెంకటఅవినాష్‌నాయుడు 92.75, గుండారెడ్డి ప్రియాంక 92.27, నందికంటి వెంకటతరుణ్ కృష్ణ 92.27 పర్సంటైల్ సాధించారు. అత్యధిక పర్సంటైల్ సాధించిన విద్యార్థులను మంగళవారం స్థానిక కళాశాలలో శ్రీ ప్రతిభ విద్యా సంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్‌చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈవో నల్లూరి జయప్రకాష్ నారాయణ్ అభినందించారు.

డీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 13 : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన టీచర్ పోస్టుల ఉద్యోగాలకు సంబంధించి ఒంగోలు నగరంలోని లాజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ పాలపర్తి విజయ్‌భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రైల్వే రీజియన్‌లలో కో పైలెట్ పోస్టులకు శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీ పరీక్షలకు హాజరయ్యే నిరుద్యోగులు ఈనెల 15వ తేదీలోపు ఒంగోలులోని అంజయ్యరోడ్‌లోని లాజిక్ అకాడమీలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్: 7207012758 ద్వారా సంప్రదించాలని ఆయన కోరారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

● పార్టీ నగర అధ్యక్షుడు కొరారి



సమావేశంలో మాట్లాడుతున్న కొరారి నాగేశ్వరరావు

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 13 : రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పార్టీ నగర అధ్యక్షులు కొరారి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఒంగోలు నగర కమిటీ సమావేశం మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్లుగా వైసీపీ పాలనలో అనేక ఇబ్బందులకు గురైన పార్టీ శ్రేణులు ఇక నుంచి కష్టపడి పనిచేయాలన్నారు. ఎన్నికలు అతి సమీపంలోనే ఉన్నందున ఆయా డివిజన్‌లలో టీడీపీ చేసిన సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్ళాలని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, ఒంగోలు ఎమ్మెల్యేగా దామచర్ల జనార్ధన్ గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సూచించారు. జగన్ పాలనలో పడిన కష్టాలను ప్రజలకు గుర్తు చేయడంతోపాటు, వైసీపీ అసమర్థ పాలన వైఫల్యాలను జనంలోకి తీసుకెళ్ళాలన్నారు. అదేవిధంగా డివిజన్లలో వైసీపీ నాయకులు అధిక సంఖ్యలో దొంగ ఓట్లు చేర్పించిన క్రమంలో వాటిని గుర్తించి తొలగించే విధంగా దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి బొల్లినేని వాసుకృష్ణ, నడిపినేని భాస్కర్, బొడపాటి హరిబాబు, వెంకట్, ఉండవల్లి రాము, నండూరి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

16న బంద్‌ను విజయవంతం చేయాలి

● మద్దతు పలికిన వామపక్ష నాయకులు



మాట్లాడుతున్న నారాయణ

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 13: సంయుక్త కిసాన్‌మోర్చా, భారత్ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 16వతేదీన జరిగే గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెకు వామపక్ష పార్టీలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీల నాయకులు ప్రకటించారు. ఒంగోలులోని సీపీఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్‌హనీఫ్ మాట్లాడుతూ ఐదువందల రైతు సంఘాలు, కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా ఈ బంద్‌లో పాల్గొంటున్నాయని తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలోనూ కేంద్రంప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. కార్పొరేట్ శక్తులను బలోపేతం చేస్తూ దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతుందని ఆరోపించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ మాట్లాడుతూ రైతుల సమస్యలపై 13 నెలల పాటు సుదీర్ఘపోరాటం తర్వాత మూడు నల్లచట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన కేంద్రప్రభుత్వం రెండేళ్ళు గడిచినా ఇచ్చిన హామీలు అమలు చేయలేదని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తుందనానరు. న్యూడెమోక్రసి నాయకుడు చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలోని కార్మికులు, రైతులు బంద్‌లో పాల్గొనాలని కోరారు.

ఈ కార్యక్రమంలో నాయకులు డీ వీఎస్.స్వామి, కంకణాల ఆంజనేయులు, పీవీఆర్. చౌదరి, ఆర్.వెంకట్రావు, కొత్తకోట వెంకటేశ్వర్లు, ఎంఎస్.సాయి తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలు, ప్రచారం



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

కేంద్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ ఈనెల 16వతేదీన జరగనున్న దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం ఒంగోలులో రైతు కూలీసంఘం, ఏఐఎఫ్‌టీయూ(న్యూ) ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కత్తి పేరయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి డీవీఎస్.స్వామి, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.లలితకుమారి మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న రైతుల ఆత్మహత్యలకు పూర్తిగా బాధ్యత కేంద్రం వహించాలని డిమాండ్ చేశారు, కార్యక్రమంలో ఐ.విజయసారథి, ఎంఎస్.సాయి, సుల్తాన్‌బాషా, జయబాబు, వి.శ్రీరాములు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

- ఈనెల 16న దేశ వ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయా లని కోరుతూ ప్రజాసంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. నగరంలోని లారీ ఆఫీసుతో పాటు పలు ప్రాంతాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో వై.సత్యవతి, ఈదర అన్నపూర్ణ, ఐ.రాఘవమ్మ, పి కల్పన, గురునాథం, కల్పన, ఎస్.రాహేలమ్మ, రాజ్యలక్ష్మి, ఎం.గంగాధర, మహేష్, జి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

‘యువగళం’తో యువత భవిష్యత్తుకు గ్యారెంటీ

● టీడీపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 13 : తెలుగుదేశం పార్టీ అమలు చేయనున్న యువగళం పథకంతో యువత భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ యువతే దేశానికి బలమన్నారు. వారు తలచుకుంటే ఏదైనా సాధ్యపడుతుందని, అలాంటి యువతను ప్రోత్సహించేందుకు టీడీపీ యువగళం పథకం చేపట్టబోతుందన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడంతోపాటు, అంధకారంలో ఉన్న ఆంధ్ర యువతకు అండగా ఉండేందుకు టీడీపీ ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. వారి ఉన్నత చదువులు, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో యువత టీడీపీకి అండగా నిలవాలని కోరారు. గడిచిన నాలుగున్నరేళ్ళలో జగన్‌రెడ్డి ఉత్తిత్తి హామీలతో మోసం చేశారన్నారు. ఏటా విడుదల చేస్తానన్నా జాబ్‌క్యాలెండర్‌ను ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మెగా డీఎస్సీ అంటూ దగా డీఎస్సీ విడుదల చేశారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి రాగానే యువతకు అన్నీ రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు అవసరమైన చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. సమావేశంలో తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్ల వెంకటరత్నం, కార్యనిర్వాహక కార్యదర్శి నాళం నరసమ్మ, జిల్లా మహిళ ప్రధాన కార్యదర్శి బీరం అరుణ, బోను దుర్గ, ముత్తన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రింటింగ్ రంగ కార్మికుల సంక్షేమానికి కృషి

● ఎమ్మెల్యే బాలినేని



అసోసియేషన్ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 13: ప్రింటింగ్ రంగ కార్మికుల సంక్షేమానికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈనెల 24వ తేదీన ప్రింటర్స్‌డే పురస్కరించుకుని జిల్లా ప్రింటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్‌ను మంగళవారం బాలినేని ఒంగోలులోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రింటింగ్ కార్మికులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ సమస్యలపైన తనను ఎప్పుడైనా కలవచ్చని చెప్పారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.నెల్సన్‌రాజు మాట్లాడుతూ జగనన్న ఇళ్ళపట్టాల పంపిణీలో అర్హులైన ప్రింటర్స్‌కు స్థలాలు మంజూరు చేయాలని విన్నవించగా, అర్హులైన లబ్ధిదారులకు తప్పకుండా అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ కె.శ్రీధర్, భగవాన్ పిచ్చయ్య, యామిని కృష్ణ, శ్రీకాంత్ తదితరు=లు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

ఒంగోలు(కలెక్టరేట్): రానున్న ఎన్నికల్లో సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సూచించారు. ఒంగోలు నగరం లాయర్‌పేటలోని తన నివాసంలో మంగళవారం నగరంలోని వైసీపీ డివిజన్ల అధ్యక్షులతో ప్రత్యేకంగా ఆయన సమావేశమయ్యారు. ఒక్కొక్క డివిజన్ అధ్యక్షుడితో 15 నిమిషాల పాటు చర్చించినట్లు సమాచారం. పార్టీ నేతల మధ్య ఉన్న విభేదాలతోపాటు కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు మధ్య సఖ్యత, వారి సమస్యలపై సమీక్షించారు. డివిజన్లలో ఐదారు మంది ముఖ్యనాయకులు ఉంటే అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని సూచించినట్లు తెలుస్తున్నది. వ్యక్తిగత పీఏలతో పాటు గన్‌మెన్లను కూడా బయటనే ఉంచి పూర్తిస్థాయిలో డివిజన్ అధ్యక్షులతో ఎమ్మెల్యే బాలినేని భేటీ కావడంతో విస్తృత చర్చకు దారితీసింది. సుమారు 30 మంది డివిజన్ అధ్యక్షులుతో సమావేశమైన బాలినేని మిగిలిన డివిజన్ల అధ్యక్షులతో బుధవారం, అనంతరం కార్పొరేటర్లతో సమావేశం కానున్నట్లు తెలిసింది.

ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం




చీరలను అందజేస్తున్న శ్రీదేవి, సరోజనీదేవికి నివాళులర్పిస్తున్న పాఠశాల సిబ్బంది

ఒంగోలు(కల్చరల్),ఫిబ్రవరి 13: స్వాతంత్ర్య సమరయోధురాలు సరోజినీనాయుడు జయంతి సందర్భంగా మంగళవారం పలు సంస్థల ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఒంగోలులోని శర్మా కళాశాల క్రికెట్ మైదానంలో తెలుగు మహిళ ఒంగోలు పార్లమెంట్ నాయకురాలు మండవ లావణ్య సహకారంతో మహిళలకు చీరలను పంపిణీ జరిగింది. రెడ్‌క్రాస్ సొసైటీ మహిళా అధ్యక్షురాలు కోసూరి శ్రీదేవి, రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జైభీమ్ ఫౌండేషన్ యూత్ ఆర్గనైజర్ చిక్కాల కిరణ్‌కుమార్, నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

స్థానిక సీతారాంపురం డిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ బెజవాడ దుర్గాదేవి ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులు సరోజినీదేవి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కరస్పాండెంట్ బెజవాడ పవన్‌కుమార్ మాట్లాడుతూ సరోజినీనాయుడును ఆదర్శంగా తీసుకుని ప్రతి విద్యార్థినీ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాల్గొన్నారు.

జైజవాన్ జైకిసాన్ జోడో యాత్ర

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 13 : భారతీయ జవాన్ కిసాన్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని జైజవాన్, జై కిసాన్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వరికూటి ఆంజనేయులు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో దేశవ్యాప్తంగా అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో పార్టీ పోటీ చేస్తుందని తెలిపారు. రైతులు, యువతతోపాటు జవాన్లు, విశ్రాంత జవాన్ల భద్రత, సంక్షేమమే ధ్యేయంగా తమ పార్టీ పనిచేస్తుందని స్పష్టంచేశారు. తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ అంకుష్, కేఎన్.నాయక్, సురేష్ కుమార్, మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు జయంతి, వై.రాజు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

అవీ..ఇవీ..

15మద్యం బాటిళ్లు స్వాధీనం

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి13: చెన్నై టూ ఒంగోలు మద్యం అక్రమ రవాణా చేస్తున్న ముఠా గుట్టు చేశారు రైల్వే పోలీసులు. మంగళవారం ఒంగోలు రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు కోరమండల్ ఎక్స్‌ప్రెస్ నుంచి దిగిన ఇరువురు యువకుల వద్ద 15 ఫుల్‌బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. కారు డ్రైవర్లుగా పనిచేసే స్థానిక కొత్తపట్నం బస్టాండ్‌లో నివాసం ఉండే సాయి, అన్నవరప్పాడుకాలనీ రెండోలైన్‌లోనివాసం ఉండే హరికృష్ణ చెన్నై వెళ్ళి అక్రమంగా మద్యం తీసుకొచ్చి అధికధరలకు విక్రయిస్తుంటారని రైల్వే సీఐ ఎస్.శ్రీకాంత్ బాబు తెలిపారు. ఇరువురి వద్ద స్వాధీనం చేసుకున్న మద్యం సుమారు రూ.1.50లక్షలు ఉంటుందని అంచనా వేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు సతీష్, హుస్సేన్ పాల్గొన్నారు.

పేస్‌లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



మాత్రలను అందజేస్తున్న వైద్యసిబ్బంది

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 13: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది మంగళవారం విద్యార్థులకు మందులను పంపిణీ చేసి ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, సీహెచ్.కోటిరెడ్డి, ఎం.రవీంద్ర, వీరాంజనేయులు, ఆరోగ్య సిబ్బంది ముత్తయ్య శ్రీనివాసులు, అరుణ, ఝాన్సీలక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

స్కూలు కాంప్లెక్స్ సమావేశాలను పర్యవేక్షించాలి

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 13: మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలోని స్కూలు కాంప్లెక్స్ సమావేశాలను కచ్చితంగా పర్యవేక్షించాలని డిప్యూటీ డీఈవో అనితారోజ్‌రాణి ఆదేశించారు. ఒంగోలులోని పీవీఆర్ బాలికల హైస్కూలులో జరుగుతున్న ఒంగోలు, సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గాల ఎంఈవోలు, స్కూలు కాంప్లెక్స్ హెచ్‌ఎంల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆమె పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు కిషోర్‌బాబు, పి.సరస్వతి, ఏఎంవో రమేష్ పాల్గొన్నారు.

బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా ఖాదర్‌వలి



ఖాదర్‌వలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 13 : భారతీయ జనతా పార్టీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా షేక్ ఖాదర్ వలిషఫీని నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి మంగళవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంతో పాటు పార్టీ అభ్యర్థుల విజయానికి పాటుపడాలని సూచించారు. కాగా జిల్లా అధ్యక్షుడుగా నియమితులైన ఖాదర్‌వలిషఫీని పలువురు ఆ పార్టీ నాయకులు అభినందించారు. తనను మైనార్టీ మోర్చా అధ్యక్షులుగా నియమించేందుకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ, జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి, నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

డైరీ ఆవిష్కరణ

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 13: ఏపీ టీచర్స్ గిల్డ్ ప్రచురించిన నూతన సంవత్సర డైరీని జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర ఒంగోలులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గిల్డ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకట్రావు, సీహెచ్.ప్రభాకర్‌రెడ్డిలు ఎయిడెడ్ టీచర్ల సమస్యలను డీఈవో దృష్టికి తీసుకెళ్ళారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై మహిళ మృతదేహం

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 13: రైలు పట్టాలపై మహిళ మృతదేహం వెలుగుచూసింది. ఈ సంఘటన ఒంగోలు అగ్రహారం గేటు సమీపంలో మంగళవారం జరిగింది. సుమారు 50 ఏళ్ళ వయస్సు గల మహిళ గులాబీరంగు చీర, జాకెట్ ధరించి ఆంది. ఆమె మెడలో పసుపు తాడు ఉంది. అయితే ఆమె రైలులో నుంచి జారి పడిందా లేక రైలు కింద పడి మృతి చెందిదా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రైల్వే పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. వివరాలు తెలిసినవారు 94409904870, 7013915467 సెల్ నంబర్లకు ఫోన్ చేయాలని సీఐ శ్రీకాంత్‌బాబు కోరారు.

నిత్యావసర సరుకుల అందజేత



సరుకులను అందజేస్తున్న కార్యవర్గ సభ్యులు

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 13: ఒంగోలులోని ఉమా మనో వికాసకేంద్రానికి బ్రాహ్మణ సేవా సంక్షేమ ట్రస్ట్ నిత్యావసర వస్తువులను అందజేసింది. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రామరాజు మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో సభ్యులు బియ్యం, కందిపప్పు, నూనె, చక్కెర, స్టీలు గ్లాసులు, వాటర్ బబుల్స్, చింతపండు, టవల్స్ వంటి పలు వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించటానికి ప్రణాళిక రూపొందించామన్నారు. కార్యక్రమంలో శివదేవుని మురళీధర్‌శర్మ, శంకరమంచి శ్రీధర్‌శర్మ, లంకా ప్రసన్నకుమార్‌శర్మ, చిలకపాటి రామారావు, పేర్నమిట్ట నరసింహారావు, భారతుల సత్యనారాయణ, దోసపాటి ఫణి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో జగన్ చెలగాటం

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 13 : నిరుద్యోగుల జీవితాలతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెలగాటం ఆడుతున్నారని విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్ ఆరోపించారు. ఒంగోలులోని విద్యార్థి జేఏసీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు మెగా డీఎస్సీ నిర్వహిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పుడు కేవలం 6100 పోస్టులకు మాత్రమే పరిమితం చేయడం వల్ల నిరుద్యోగులు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పోస్టులను తక్కువగా చూపడం దారుణంగా ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులకు 46 సంవత్సరాలకు వయోపరిమితిని పెంచితే మన రాష్ట్రంలో మాత్రం పెంచకపోవడం తగదని చెప్పారు. ఇప్పటికే లక్షల రూపాయలు ఖర్చు పెట్టిన కోచింగ్ తీసుకుంటున్న నిరుద్యోగులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం వెంటనే వయోపరిమితిని పెంచడంతో పాటు మెగా డీఎస్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కార్తీక్, పిడతల కరుణాకర్, శ్రీకృష్ణ, సూర్యప్రకాష్, దుడ్డు మార్క్, లోకేష్, రాజీవ్, అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉన్నతస్థాయికి ఎదగాలి



బాలలతతో విద్యార్థినులు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి 13: ప్రతి విద్యార్థి ఐఏఎస్ స్థాయి ఉద్యోగులుగా ఎదగాలని, ఇందుకోసం కష్టపడి చదవాలని హైదరాబాద్‌కు చెందిన సీఎస్‌బీ ఏఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత పేర్కొన్నారు. ఒంగోలు మండలం ఉలిచి జడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా బాలలత మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదవాలన్నారు పదో తరగతిలో నూరు శాతం మార్కులు సాధించటానికి ప్రయత్నించాలని చెప్పారు. స్కూలు అభివృద్ధికి తన సహకారం ఉంటుందన్నారు. అనంతరం బాలలతను విద్యార్థులు, ఉపాధ్యాయులు సత్కరించారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ అంజమ్మ

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), ఫిబ్రవరి13: నాగులుప్పలపాడు మండల కార్యాలయం వద్ద మంగళవారంచెత్త సంపద కేంద్రానికి ఎంపీపీ నలమలపు అంజమ్మ, ఎంపీడీవో మహాలక్ష్మి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ చెత్త సంపదకేంద్రం నిర్మాణం త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో 13 చెత్త సంపద కేంద్రాల షెడ్ల నిర్మాణం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు నలమపు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సభను విజయవంతం చేయండి : బీఎన్


నాయకులతో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

సంతనూతలపాడు, ఫిబ్రవరి 13: బాపట్ల జిల్లా ఇంకొల్లులో ఈనెల 17న చంద్రబాబు పాల్గొనబోతున్న రా..కదలిరా సభను టీడీపీ శ్రేణులు విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్.విజయ్‌కుమార్ కోరారు. ఒంగోలులోని తన నివాసంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో బీఎన్, నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో సమావేశమయ్యారు. చంద్రసభకు భారీగా తరలివెళ్లేలా చర్యలు తీసుకోవాలని నాయకులకు బీఎన్ సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చౌట శ్రీనివాసులు, రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, నాయకులు వైవీ.సుబ్బారావు, మంత్రి శ్రీనివాసరావు, పి.వెంకటరామయ్య, కె.నాగేశ్వరరావు, జి.రాఘవరావు, ఎం.హరిబాబు, జి.సుబ్బారావు, ఎం.జయంత్‌బాబు, టి.మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

లేగ దూడలను సంరక్షించుకోవాలి


పాడి రైతులకు క్యాన్లను బహుమతిగా అందజేస్తున్న డాక్టర్ బేబీరాణి

సంతనూతలపాడు, ఫిబ్రవరి 13: లేగదూడలను సంరక్షించడం ద్వారా రైతులు ఆర్థికంగా వృద్ధి చెందుతారని పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ బేబీరాణి పేర్కొన్నారు. మట్టిపాడు గ్రామంలో మంగళవారం మేలు జాతి లేగదూడల ప్రదర్శన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లేగదూడలకు చిన్నవయస్సులోనే సరిపడినంత పాలను అందజేస్తే మరణాల శాతం తగ్గించవచ్చాన్నారు. సహాయసంచాలకులు డాక్టర్ కాలేషా మాట్లాడుతూ కృత్రిమ గర్భధారణ ద్వారా కేవలం ఆడదూడలు మాత్రమే పడతాయని, రైతులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం లేగదూడలకు నట్టనివారణ మందును తాగించి మందులను అందజేశారు. మొదటి మూడు అందమైన లేగదూడల రైతులకు పాలక్యాన్లను బహుమతిగా అందించారు. కార్యక్రమంలో పశువైద్యులు కృపారావు, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్‌కార్డుల పంపిణీ

సంతనూతలపాడు, ఫిబ్రవరి 13: మైనంపాడు గ్రామ పంచాయతీని ఎంపీడీవో శ్రీహరి మంగళవారం పరిశీలించి ప్రజలకు ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీకార్డులను పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో మాట్లాడారు. ఆయా కార్డుల పంపిణీని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దారా వెంకట్రావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంజయ్‌గాంధీనగర్‌లో డ్రైనేజ్ అధ్వానం


కరపత్రాలను అందజేస్తున్న జనసేన నాయకులు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి13: సంజయ్‌గాంధీనగర్‌లో డ్రైనేజ్ లేకపోవటంతో మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోతోందని, దీంతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు వాపోయారు. మంగళవారం నగరంలోని సంజయ్‌గాంధీనగర్‌లో జనసేన పార్టీ నాయకులు ఇంటింటిప్రచారం నిర్వహిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ సాయంత్రం ఆరు గంటలు దాటితే దోమలతో రోడ్డుపై ఉండే పరిస్థితి ఉండదన్నారు. డ్రైనేజీ వ్యవస్థను పునురుద్ధరించాలని వారు కోరారు. అనంతరం జనసేన నాయకులు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కొత్తప్రభుత్వంలో కాలనీలోని సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కల్యాణ్, పల్ల ప్రమీల, ఆకుపాటి ఉష, గోవింద్ కోమలి, మాదాసు సాయి, సుధీర్, నరసింహారావు, మర్రిపూడి ఉదయ్, నరేష్ చెన్ను, అనూష, మాధవి, అనూష, అవినాష్‌నాయుడు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి : కలెక్టర్

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి13: సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గంలోని అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ కార్యాలయంలో సంతనూతలపాడు నియోజకవర్గంలోని అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి మేరుగ నాగార్జునతో కలిసి ఆయన సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో సైడుకాలువలు, రోడ్లు, భవనాల పనులు పూర్తి చేయించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

భర్త నుంచి రక్షణ కల్పించాలని నిరసన

కనిగిరి, ఫిబ్రవరి 13 : భర్త నుంచి మహిళకు రక్షణ కల్పించాలని కోరుతూ ఐద్వా సంఘం ఆధ్వర్యంలో సోమవారం పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన ధర్నా నిర్వహించారు. వివరాలలోకి వెళితే... కనిగిరి సమీపంలోని మాచవరం గ్రామంలో నివాసం ఉంటున్న దాసరి పొట్టమ్మ అనే గిరిజన మహిళ న్యాయం చేయాలని కోరుతూ ఐద్వా మహిళలతో కలసి నిరసనకు దిగింది. మూడు రోజుల నుంచి పోలీస్‌స్టేషన్ ఎదుట న్యాయం చేయాలని కోరుతున్నా పట్టించుకోలేదని వాపోయారు. విషయం తెలుసుకున్న సీఐ దాసరి వెంకటేశ్వరరావు ఐద్వా మహిళలతో మాట్లాడి మహిళకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వటంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పీసీ.కేశవరావు, వెంకటమ్మ, ప్రసన్న, ప్రమీల, రమీజావి, విజయలక్ష్మీ, నారాయణమ్మ, తిరుపతమ్మ, రత్తమ్మ, చిన్నక్క, శాంతకుమారి, ఎలేషమ్మ పాల్గొన్నారు.

కూలీల ఆటో బోల్తా.. ఒకరు మృతి

- ఎనిమిది మందికి గాయాలు

ముండ్లమూరు, ఫిబ్రవరి 13 : మండలంలోని పూరిమెట్ల సమీపంలో మిరపకాయల కూలీల ఆటో బోల్తా పడటంతో ఉయ్యాల ఏసురాజు(22) తీవ్ర గాయాలై ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మిగతా ఎనిమిది మంది కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... మండలంలోని సింగనపాలెం ఎస్టీ కాలనీకి చెందిన ఉయ్యాల ఏసురాజు, వెంకటేశ్వరమ్మ, కొండమ్మ, బుల్లెమ్మ, రామకృష్ణ, దుర్గ మరి కొందరు కూలీలను సింగనపాలెం నుంచి పూరిమెట్లకు చెందిన చొప్పవరపు గోపీ తన ఆటోలో ఎక్కించుకొని స్వగ్రామానికి తీసుకెళ్లాడు. రైతులకు చెందిన మిరపకాయలు కోసేందుకు కూలీలు రోజూ వెళ్తుంటారు. ఆ క్రమంలో మంగళవారం కూడా వెళ్లారు. ఆటో బోల్తా పడడంతో కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. వినుకొండ మండలం నడిగడ్డ గ్రామానికి చెందిన ఉయ్యాల ఏసురాజు కొంతకాలం నుంచి సింగనపాలెం ఎస్టీ కాలనీలో ఉంటూ మిరప కాయల కోతకు వెళుతున్నాడు. తీవ్రంగా గాయపడిన ఏసురాజుతోపాటు బాధితులను అద్దంకి, ఒంగోలు ఆస్పత్రులకు తరలించారు. ఈ విషయం తెలియడంతో సింగనపాలెంలోని వారి బంధువులు ఒక్కసారిగా ఆందోళన చెందారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

టీడీపీ నాయకునికి జనసేన నేత పరామర్శ

దర్శి, ఫిబ్రవరి 13 : తూర్పువీరాయపాలెం టీడీపీ అధ్యక్షుడు మందాడి మల్లికార్జునరావును నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్ మంగళవారం పరామర్శించారు. ఒంగోలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మల్లికార్జునరావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వెంకట్ పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.


మల్లికార్జునరావును పరామర్శిస్తున్న వెంకట్

కట్టడికి కుట్ర

ఇంకొల్లులో బాబు సభకు ఏర్పాట్లలో ఉన్న రోజే ఏలూరికి పోలీసు నోటీసులు

రా కదలిరా కార్యక్రమానికి భూమి పూజ నేడు

కార్యక్రమ నిర్వహణకు భూములిచ్చేందుకు పోటీపడిన ప్రజలు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

పర్చూరు నియోజకవర్గంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఎన్నికల శంఖారావం పూరించేందుకు సిద్ధమైన దశలో అధికార వైసీపీ నేతలు.. ఎలాగైనా ఆ పార్టీ నేతలను కట్టడి చేసే కుట్రకు తెరలేపారు. నియోజకవర్గంలో జరిగే బాబు సభ ఏర్పాట్లు కోసం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రంగంలోకి దిగిన తొలిరోజే పోలీసులు ఆయనకు 41ఏ నోటీసులు అందజేశారు. తద్వారా తస్మాత్ జాగ్రత్త అంటూ అధికారపార్టీ పరోక్షంగా హెచ్చరిక జారీ చేసినట్లైంది. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి బలమైన లోక్‌సభ స్థానాలలో బాపట్ల ఒకటి. అందులోనూ పర్చూరు అసెంబ్లీ స్థానం ఇటీవల మరింతగా టీడీపీకి అనుకూలంగా మారిపోయింది. గత ఎన్నికల్లోనూ లోక్‌సభ స్థానం పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాలలో నాలుగింట టీడీపీ అభ్యర్థులు గెలుపొందారు. అలాంటి బాపట్ల లోక్‌సభ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడిగా పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్రియాశీలకపాత్ర పోషిస్తున్నారు. ఆయనతో పాటు అద్దంకి, రేపల్లె ఎమ్మెల్యేలు రవికుమార్, సత్యప్రసాద్, వేమూరు నియోజకవర్గానికి చెందిన మాజీమంత్రి నక్కా ఆనంద్‌బాబు తదితరులు టీడీపీ కార్యక్రమాల నిర్వహణలో ఉద్దండులుగా ఉండటమే గాక చంద్రబాబుకు అంతరంగికులుగా మారారు. మిగిలిన సంతనూతలపాడు, బాపట్ల, చీరాల పార్టీ ఇన్‌చార్జిలు విజయ్‌కుమార్, వర్మ, కొండయ్యలు ఆయా నియోజకవర్గాలలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. దీంతో శనివారం పర్చూరు నియోజకవర్గంలో రా.. కదలిరా పేరుతో ఎన్నికల శంఖారావం పూరించే సభ నిర్వహణకు టీడీపీ సిద్ధమైంది. తొలుత చీరాలలో జరపాలనుకున్నప్పటికీ ఇటీవలికాలంలో పర్చూరు నియోజకవర్గంలో జరిగిన కొన్ని పరిణామాలను దృష్టిలో ఉంచుకుని సభను ఇంకొల్లుకు మార్పుచేశారు. నియోజకవర్గంలోని ఇంకొల్లులో సభ నిర్వహణకు రంగం సిద్ధం చేస్తున్నారు. మంగళవారం ఉదయానికి మార్టూరు కార్యాలయానికి వచ్చి అక్కడి నుంచి ఇంకొల్లు వచ్చి బహిరంగ సభా ప్రాంగణాన్ని ఖరారు చేసుకుని మార్టూరులోని క్యాంపు ఆఫీసుకు వెళ్లిన ఏలూరి వద్ద క్షణంలో పోలీసులు ప్రత్యక్షమయ్యారు. సోమవారం రాత్రికే ఏలూరి వస్తారని తెలిసి ఉదయాన్నే పోలీసులు క్యాంపు ఆఫీసుకు వెళ్లగా ఏలూరి రాలేదని వెల్లడైంది. హైదరాబాద్ నుంచి నేరుగా ఏలూరి ఇంకొల్లు వచ్చారని తెలుసుకుని పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆయన ఇంకొల్లు నుంచి మార్టూరులోని తన క్యాంపు ఆఫీసుకు వచ్చే వరకు వేచి ఉండి వెంటనే అప్రమత్తమయ్యారు. ఆయనకు 41ఏ నోటీసులు జారీచేశారు. ఈనెల 22న సీఐ ఎదుట విచారణకు హాజరుకావాలని అందులో పేర్కొన్నారు.



ఇటీవల మార్టూరు ప్రాంతంలో టీడీపీకి చెందిన గ్రానైట్ వ్యాపారులపై మైనింగ్ అధికారులు ప్రైవేటు వ్యక్తులతో వచ్చి దాడులు చేయటం, ఆ సందర్భంగా వ్యాపారులకు మద్దతుగా ఏలూరి వెళ్లి మాట్లాడటం తెలిసిందే. ఆ సంఘటనకు సంబంధించి విధి నిర్వహణకు వచ్చిన అధికారులను ఏలూరి, మరికొందరు అడ్డుకున్నారని పోలీసులు కేసు నమోదుచేశారు. మారణాయుధాలతో వచ్చిన ప్రైవేటు వ్యక్తులపై వ్యాపారులు ఇచ్చిన ఫిర్యాదును మాత్రం పక్కనపడేశారు. ఆ కేసులో ఆరోజుకారోజు ఆరుగురిని అరెస్టు చేయటం, తర్వాత వారు బెయిల్‌పై బయటకు రావటం జరిగింది. ఏలూరి హైకోర్టుకు వెళ్లటంతో పోలీసులకు చీవాట్లు పెట్టిన న్యాయస్థానం అరెస్టు చేయకుండా 41ఏ నోటీసులు ఇవ్వాలని ఆదేశించింది. ఈ ఆదేశాలు వచ్చి ఐదారు రోజులు అవుతున్నప్పటికీ పట్టీపట్టనట్లు ఉన్న పోలీసులు చంద్రబాబు సభ ఖరారుకావటం, ఆ ఏర్పాట్లలో ఏలూరి నిమగ్నమైన రోజే పోలీసులు నోటీసులివ్వడం గమనార్హం. స్థానిక పోలీసులు సంయమనంతో ఉన్నప్పటికీ ఉన్నతస్థాయి నుంచి వచ్చిన ఒత్తిడితో ఆగమేఘాలపై రంగంలోకి వచ్చారని చెబుతున్నారు. అంతేగాక ఆ కేసులో మరో 20 మంది అని పేర్కొన్న అంశం ఆధారంగా ఈ సభకు గ్రానైట్ వ్యాపారులు సహకరించకుండా మరికొందరిపై ఒత్తిడిపెంచే అవకాశం ఉన్నట్లు సమాచారం. దీంతో సభను జయప్రదం కాకుండా చేసేందుకు ప్రభుత్వం మరెన్ని అడ్డంకులు కల్పిస్తుందోనన్న ఆందోళన టీడీపీ శ్రేణుల్లో కనిపిస్తోంది.

నేడు సమీక్షా సమావేశం

రా..కదలిరా సభను జయప్రదం చేసేందుకు బుధవారం మార్టూరులోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు ఆఫీసులో సమీక్షా సమావేశం ఏర్పాటుచేశారు. ఉదయం తొమ్మిదిన్నరకు సభానిర్వహణ ప్రాంగణంలో ఎమ్మెల్యే ఏలూరి ఏర్పాట్లు కోసం భూమి పూజ చేస్తారు. పదకొండున్నరకు పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు పార్టీ పరిశీలకులుగా పర్చూరుకు డాక్టరు ఉగ్రనరసింహారెడ్డిని అలాగే ఇతర నియోజకవర్గాలకు మరికొందరు నాయకులను రాష్ట్ర పార్టీ పరిశీలకులుగా నియమించింది. వారితో పాటు ఎమ్మెల్యేలు రవికుమార్, సత్యప్రసాద్, మాజీమంత్రి ఆనంద్‌బాబు, ఇతర ఇన్‌చార్జులు వర్మ, విజయ్‌కుమార్, కొండయ్య, ఇతర టీడీపీ దాని అనుబంధ సంఘాల ముఖ్య నాయకులు సమీక్షా సమావేశంలో పాల్గొననున్నారు.

మేమున్నామంటూ ముందుకు..

అనువైన స్థలం దొరికితే ఇంకొల్లులో సభ పెట్టేందుకు వచ్చిన ఏలూరికి ఇంకొల్లు, సమీప గ్రామాల రైతులు ఇతరత్రా స్థలాల యజమానులు ముందుకొచ్చి మేమున్నామంటూ మద్దతివ్వటం విశేషం. ఎవరికి వారు మా భూములున్న ప్రాంతంలో సభ పెట్టుకోండి, మాకు అభ్యంతరం లేదని ముందుకొచ్చారు. పలు స్థలాలు, పొలాల పరిశీలన అనంతరం ఇంకొల్లుతో కలిసిఉండేలా ఓ కాలనీ పక్కన 20 ఎకరాల వ్యవసాయ భూమిలో సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఆ విస్తీర్ణంలోని రైతులు, ఇతర స్థలాల యజమానులు పార్టీ, కులమతాలకు అతీతంగా సభ ఏర్పాటుకు అంగీకారపత్రాలు రాసివ్వటం విశేషం.


ప్రాజెక్టులను చూస్తున్న విద్యార్థులు




ప్రదర్శనలో ఉంచిన ప్రాజెక్టుల గురించి విద్యార్థులకు వివరిస్తున్న రూపకర్తలు

రాష్ట్ర స్థాయిప్రదర్శనకు 8 ప్రాజెక్టుల ఎంపిక



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఈవో సుభద్ర


తన నమూనా గురించి వివరిస్తున్న విద్యార్థి

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 13 : ఒంగోలులో మంగళవారం జరిగిన జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల ప్రదర్శనలో ఎనిమిది ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక చేశారు. బేస్తవారపేట కేజీబీవీ విద్యార్థి కె.బుజ్జి ప్రదర్శించిన ఈకో ఫ్రెండ్లీ బయోడిగ్రీడబుల్ షార్ప్ ఫర్ ప్లాంట్స్, బేస్తవారపేట జడ్పీ బాలికల హైస్కూలు విద్యార్థి జి.శ్రీనివాసులు ప్రదర్శించిన ఫార్మర్ ఫ్రెండ్లీ ఫీల్డ్ కవర్, తిప్పాయపాలెం హైస్కూలు విద్యార్థి యశ్వంత్‌రెడ్డి ప్రదర్శించిన ఇన్‌క్లైడ్ ఇన్సులేషన్ ఆఫ్ వాటర్ టాప్స్ ఎట్ పబ్లిక్ ప్లేసెస్, మాచవరం హైస్కూలు విద్యార్థి కందుకూరి సుమశ్రీ ప్రదర్శించిన రెయిన్ ప్రొటెక్షన్ షర్ అగ్రికల్చర్ ఫీల్డ్స్ ప్రాజెక్టును ఎంపిక చేశారు. ఇక నలంద విద్యార్థి బేగ్‌మహీన్ ప్రదర్శించిన ఫార్మింగ్ విత్‌వుట్ సాయిల్, మంగమూరు హైస్కూలు విద్యార్థి కె.బ్రహ్మాంజనేయులు ప్రదర్శించిన బగ్ కిల్లింగ్ స్ట్రీట్‌లైట్, కృష్ణవేణి హైస్కూలు విద్యార్థి పలుకూరి వినయ్ ప్రదర్శించిన హ్యాండ్ టాక్ సిస్టమ్ బై యూజింగ్ మెమ్స్ టెక్నాలజీ ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయి. ఈ కార్యక్రమంలో డీఈవో సుభద్ర, ఉప విద్యాధికారి అనితారోజ్‌రాణి, ఒంగోలు ఎంఈవో కిషోర్‌బాబు, డీసీఈబీ కార్యదర్శి వై.వెంకట్రావు, జిల్లా సైన్స్ అధికారి టి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.


బగ్ కిల్లింగ్ స్ట్రీట్‌లైట్ గురించి వివరిస్తున్న బేగ్‌మహీన్


గ్యాస్ లీకేజి గుర్తించే యంత్రం గురించి వివరిస్తున్న విద్యార్థి


ప్రాజెక్టులను పరిశీలిస్తున్న టీచర్లు



ఇళ్ల స్థలాల పేరుతో వైసీపీ నేతల ఆటలు

- పేదలకు పట్టాలు ఇచ్చిన చోట ఖాళీ చేయించి జగనన్న కాలనీ లేఅవుట్
- అక్కడ ఇవ్వకుండా.. స్కూల్ కోసం ప్రతిపాదనలు పంపిన చోట చదును
- ఓట్లకు గాలం వేసేందుకు తంటాలు


అద్దంకి కొండపై ఇళ్ళ స్థలాల కోసం చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్

అద్దంకి, ఫిబ్రవరి13: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికారపార్టీ నేతలు ఓట్లకు గాలం వేసే తంతులకు తెరలేపుతున్నారు. ఐదేళ్ళు గుర్తుకు రాని నిరుపేదలు ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో హడావుడిగా ఇళ్ళ స్థలాల కోసం అంటూ అద్దంకి కొండపై హడావుడి చేస్తున్నారు. మండలంలోని శింగరకొండపాలెంకు చెందిన ఎస్టీ, ఇతర సామాజికవర్గాల ప్రజలు అద్దంకి కొండను ఆక్రమించుకొని నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే, 220 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు సమయంలో కొంతమంది ఎస్టీలకు చెందిన స్థలాలు, నివాస గృహాలని బలవంతంగా ఖాళీ చేయించి పక్కనే ఉన్న ఖాళీ స్థలం చూపించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత శింగరకొండపాలెంలో జగనన్న కాలనీ లేఅవుట్, సచివాలయం, రైతు భరోసా కేంద్రాల కోసం అంటూ అక్కడ ఉన్న పేదలను ఖాళీ చేయించారు. కనీసం జగనన్న కాలనీ లేఅ వుట్‌లో స్థలాలు కోల్పోయిన వాళ్లకు కేటాయిస్తారని భావించారు. అయితే, వాళ్ళకు మొండిచేయి చూపించి వేరే లబ్ధిదారులకు కేటాయించారు. వేరేప్రాంతంలో కేటాయింప చేస్తామని నమ్మబలికారు. ఇప్పటివరకు వాళ్ళ స్థలాల గురించి పట్టించుకోకుండా వదిలివేసి ఎన్నికలు సమీపిస్తుండటంతో ఓట్లకు ఎర వేసేందుకు అధికారపార్టీ నేతలు పన్నాగం పన్నినట్లు తెలుస్తుంది. ఈక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ ఏర్పాటుకోసం ప్రతిపాదనలు పంపిన స్థలాన్ని చూపించి చదును చేయించే పనిలో నిమగ్నమయ్యారు. అన్నీ విషయాలు తెలిసీ కూడా అధికార పార్టీ నేతలు ఆ స్థలాన్ని చదును చేయించటం పట్ల విమర్శలు వస్తున్నాయి. విషయం తెలుసుకున్న వీఆర్వో బాషా మంగళవారం సాయంత్రం చదును చే యించే పనులు నిలిపి వేయించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

బల్లికురవ, ఫిబ్రవరి 13: మండలంలోని సూరేపల్లికి చెందిన చంటి సాంబిరెడ్డి (42) విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. గ్రామానికి చెందిన సాంబిరెడ్డి పాలకేంద్రంలో సూపర్‌వైజర్‌గా పనిచే స్తున్నాడు. సోమవారం రాత్రి గ్రామం నుంచి కొమ్మాలపాడు వద్ద ఉన్న డెయిరి వద్దకు ఏబీసీ కాలువ కట్టపై బైకుపై వెళుతున్నాడు. ఈక్రమంలో పొలాలకు పం దులు రాకుండా వేసిన విద్యుత్ వైరు బైకుకి తగిలి మృతి చెందాడు. విద్యుత్ వైర్లు వేసిన రైతులు కొందరు ప్రమాదాన్ని గమనించి మృతి చెందిన సాంబిరెడ్డి మృతదేహాన్ని పక్కనే ఉన్న ఏబీసీ కాలువ గుంతలో పడవేశారు. రాత్రి వెళ్లిన తన భర్త ఇంటికి రాకపోవటంతో మృతుడి బంధువులు మంగళవారం వెతుకులాట ప్రారంభించారు. గ్రామానికి సమీపంలోని కాలువలో చెప్పులు ఒకచోట, మృత దేహం, బైకు మరోచోట ఉండటం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ నరసింహారావు, ఎస్‌ఐ నాగశివారెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు.

కుటీర పరిశ్రమగా కల్తీపాల తయారీ

» ప్రజారోగ్యంతో చెలగాటం » పర్యవేక్షణ కరువు


ఏల్చూరులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

అద్దంకి, ఫిబ్రవరి 13: కల్తీ పాల తయారీ కుటీర పరిశ్రమగా మారింది. బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాల పరిధిలో పాడి రైతులతో పాటు పాలసేకరణ ఏజెంట్లు కూడా కల్తీపాల తయారీ చేస్తున్నారు. బాపట్ల జిల్లా పరిధిలోని అద్దంకి, సంతమాగులూరు, బల్లికురవ మండలాలు, ప్రకాశం జిల్లా పరిధిలోని తాళ్లూరు, ముండ్లమూరు, దర్శి మండలాలు, పల్నాడు జిల్లాలోని వినుకొండ, నూజెండ్ల, శావల్యాపురం మండలాలలోని పలు గ్రామాలలో కల్తీ పాల తయారీ జరుగుతుంది. పాల ఉత్పత్తిదారులు తమ పాలకు తోడు అదనంగా మరికొంతమేర పాలు అధికం చేసేందుకు తయారీ చేస్తున్నారు. ఇది చాలదన్నట్లు పాల ఏజెంట్లు కూడా ఇదే పని చేస్తున్నారు. అదే సమయంలో ఫాట్ అధికంగా వస్తే పాల ధర ఎక్కువ ఉంటున్నందున, అందుకనుగుణంగా పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్, పౌడర్ కలిపి పాల ఉత్పత్తి చేస్తున్నారు. ఇలా ఎవరికి వారే కల్తీపాలు తయారీ చేస్తుండటంతో అసలు కంటే కల్తీ శాతమే అధికంగా ఉంటుంది. గత ఏడాది అద్దంకిలో పెద్ద ఎత్తున కల్తీ పాలు పట్టుబడగా, ఇటీవల దర్శిలో కూడా పట్టుబడ్డాయి. మంగళవారం సంతమాగులూరు మండలం ఏల్చూరులో పాలసేకరణ కేంద్రంలో అధికారులు తనిఖీలు చేయటంతో కల్తీ పాలబండారం మరో సారి వెలుగుచూసింది. అయితే, కల్తీ పాలు అని నిర్ధారణ అయినప్పటికి చర్యలు నామమాత్రంగా ఉండటంతో యథావిధిగా కల్తీపాల తయారీ జరుగుతుందన్న విమర్శలు వస్తున్నాయి. కల్తీ పాలను తాగటం ద్వారా చిన్న పిల్లలు, వృద్ధులలో అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వైద్యులు అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కల్తీపాల తయారీ అరికట్టేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విజిలెన్స్ దాడులు

సంతమాగులూరు: మండలంలోని ఏల్చూరులో కల్తీ పాలతయారీ కేంద్రంపై విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన మందా కిరణ్ గత కొంతకాలంగా పాలవ్యాపారం చేస్తున్నాడు. రైతుల నుంచి సేకరించే పాలతో పాటుగా కల్తీ పాలు తయారుచేసి డెయిరీలకు పంపి సొమ్ముచేసుకుంటున్నారు. పాల పౌడర్, పామాయిల్, సన్‌ఫ్లవర్ అయిల్, ఎస్ఎన్ఎఫ్ పౌడర్‌తో కలసి కల్తీ పాలను తయారు చేస్తున్నాడు. పక్కా సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు మంగళవారం కిరణ్ ఇంటిపై దాడిచేసి తరలించేందుకు సిద్ధంగా ఉన్న 9 కల్తీ పాల క్యాన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ క్యాన్లలో ఉన్న సుమారు 320 లీటర్ల పాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 65 పామాయిల్ ప్యాకెట్‌లు, 35 సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శాంపిల్స్‌ను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.


కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గిద్దలూరు, ఫిబ్రవరి 13 : అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను అధికారులు తనిఖీ చేశారు. పట్టణంలోని జడ్పీ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలతోపాటు శ్రీ వివేకానంద కళాశాల, పలు ప్రాథమిక పాఠశా లల్లో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ సిద్ధార్థ, ము న్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఎన్నికల అధికారులు, సిబ్బంది పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, టాయిలెట్లు ఇతర సౌకర్యాలను పరిశీలించారు. పూర్తిస్థాయిలో సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు.

ఎల్‌కోట పాఠశాల ఆకస్మిక తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న మొయినుద్దీన్

కంభం, ఫిబ్రవరి 13 : కంభం మండలంలోని ఎల్‌కోట ప్రాథమిక పాఠశాలను ఉర్దూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ షేక్ మొయినుద్దీన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల హాజరుశాతాన్ని, ఉపాధ్యాయుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్నం భోజనం పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చక్కని గ్రేడింగ్‌తో ధరలు

- నాణ్యమైన పొగాకుతో ఎగుమతులు
- సాగు, బేళ్ల నిర్వహణపై జాగ్రత్తలు
- వేలం నిర్వహణాధికారి గిరిరాజ్‌కుమార్

పొదిలి, ఫిబ్రవరి 13 : గ్రేడింగ్‌లో మంచి మెలకువలు పాటించడం వలన నాణ్యమైన పొగాకుతో మంచి ధరలు పొందవచ్చని వేలం నిర్వహణాధికారి గిరిరాజ్‌కుమార్ అన్నారు. పొగాకులో నాణ్యత ఉండటం వలన ఎగుమతులు పెరిగే అవకాశంతోపాటు మంచి ధరలు వస్తాయన్నారు. రైతులు కొట్టు అయిపోయి దించిన తరువాత గ్రేడింగ్ చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకొని గ్రేడింగ్ చేయాలన్నారు. నాణ్యత కలిగిన పొగాకు ఉత్పత్తి చేయడం ఎంత ముఖ్యమో దానిని వ్యాపారులు మెచ్చేలా గ్రేడింగ్ చేయడం, బేళ్లు కట్టడం అంతే ముఖ్యమన్నారు. గ్రేడింగ్ మూలంగానే పొగాకులో నాణ్యత ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. గ్రేడింగ్, బేళ్లు కట్టే విధానాలు, జాగ్రత్తలపై రైతులు, కూలీలకు పలు సూచనలు చేశారు. పొగాకు రైతులు హడావుడి లేకుండా నిదానంగా గ్రేడింగ్ చేసి బేళ్లు కట్టాలన్నారు. ముఖ్యంగా మండె వేసే సమయంలో నేలకు తగలకుండా ఎత్తైన ప్రదేశాలను ఎంచుకొని చెక్కలు పేర్చి వాటిపై మండెలు వేయాలన్నారు. అనువైన పదును లేనప్పుడు మండె వేస్తే ఆకు వృథా అవుతుందన్నారు. తగినంత తేమలేకపోతే ఆకులో జరగాల్సిన రసాయనికి మార్పులు జరగక నాణ్యత లోపించే ప్రమాదం ఉందన్నారు. వివిధ రేలుపుల ఆకులు విడివిడిగా మండెలు వేసుకోవాలని ఒకే మండె వేసేటప్పుడు రెండిటికీ మధ్య ఏదైనా గుర్తు పెట్టుకోవాలని సూచించారు. గోడలకు మండెలకు మధ్య గాలి ప్రసరణ కోసం సుమారు రెండడుగులు దూరం ఉండేలా చూడాలన్నారు. మండె నుంచి తేమపోకుండా బైటతేమ ఆకును పీల్చకుండా టార్పాలిన్ పట్టను కప్పాలన్నారు. మండెలకు పురుగు ఆశించకుండా వేపాకు దిండ్లను ఏర్పాటు చేయాలన్నారు. 15, 20 రోజులకోసారి మండెను తిరగేయడం వలన బూజు, తేమను నివారించవచ్చన్నారు. పెద్ద మండెలు వేస్తే వేడి అధికంగా ఉత్పత్తి అయి కాలడం, కుళ్లిపోవడం జరిగే అవకాశం ఉందన్నారు. శుభ్రమైన ప్రదేశాల్లో మాత్రమే మండెలను నిల్వ చేయాలన్నారు.


బ్యారన్ నుంచి కొట్టు దించిన పొగాకు


గిరిరరాజ్‌కుమార్, వేలం నిర్వహణాధికారి

గ్రేడంగ్‌లో..

గ్రేడింగ్ చేసేటప్పుడు రేల్పులను వేర్వేరుగా నిల్వ చేసి గ్రేడ్ చేయాలని గిరిరాజ్ కుమార్ సూచించారు. ఒకే రంగు కలిగిన పొగాకును మాత్రమే కలపాలని, నాణ్యతలో తేడాలు ఉన్న సెలైన్, బూజు ఆకులను కలపకూడదన్నారు. కురచ ఆకులు, పచ్చగ్రేడ్, ఇతర ముక్కలు, చూర వంటివి మామూలు ఆకులతో కలపరాదన్నారు. గ్రేడింగ్ పరిసరాల్లో గడ్డిపరకలు, ప్లాస్టిక్ కవర్లు లేకుండా శుభ్రంగా ఉండేలా చేడాలని, పశువుల పాకలు, ధాన్యం నిల్వ చేసే ప్రదేశాలు, పెంపుడు జంతువులు లేకుండా చూడాలన్నారు. అన్య పదార్థాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. పచ్చలు సీజన్ చివరి వరకు నిల్వ చేస్తే కొంతవరకు పచ్చదనంగా మారేందుకు అవకాశం ఉంటుందన్నారు. అంతే కాకుండా కాంతి వచ్చేలా చూడాలన్నారు.

బేళ్లు కట్టే పద్ధతులు

పొగాకు బేళ్లు కట్టేటప్పుడు బోర్డువారు సరఫరా చేసిన పట్టలు మాత్రమే వాడాలని, చిరిగినవి వాడకూడదని గిరిరాజ్‌కుమార్ తెలిపారు. బేళ్లు కట్టే సమయంలో సరైన తేమ శాతం ఉండేలా చూడాలని లేకపోతే రంగు మారే ప్రమాదముందన్నారు. ఎరువుల బస్తాలు, పాతన్యూస్ పేపర్లు వాడకూడదన్నారు. బేళ్లు అమ్మకానికి తీసుకెళ్లేటప్పుడు తప్పని సరిగా తేమశాతం సరిచూసుకోవడం వలన తిరస్కరణకు గురికావన్నారు. కనుక పొగాకు రైతులు ఈ జాగ్రత్తలు పాటిస్తే ఆశించిన ధరలు వస్తాయని తెలిపారు.


మాట్లాడుతున్న ఆలయ పాలక మండలి చైర్మన్ సుబ్బారావు

సమన్వయంతో పనిచేద్దాం

మహాశివరాత్రి ఉత్సవాల సమీక్షలో ఇమ్మిడిశెట్టి

త్రిపురాంతకం, ఫిబ్రవరి 13: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో మార్చి 8 నుంచి 10 వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేద్దామని ఆలయ పాలక మండలి చైర్మన్ ఇమ్మడిశెట్టి వెంకట సుబ్బారావు కోరారు. మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై సమీక్షను అమ్మవారి ఆలయంలో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది కన్నా భక్తులు పెరిగే అవకాశం ఉన్నందున మెరుగైన ఏర్పాటు చేస్తామన్నారు. దేవస్థాన అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. ఈవో చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్లు, బారికేడ్లను ఏర్పాటుచేసి దర్శనాలను కల్పిస్తామన్నారు. వైద్యాధికారి లక్ష్మీదేవి మాట్లాడుతూ భక్తుకు అవసరమైన అన్ని రకాల మందులను, 104, 108 వాహనాలను అందుబాటులో ఉంచుతామని, మూడు చోట్ల శిబిరాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ వారు భక్తుల కోసం ఏడు చోట్ల మంచినీటి సరఫరాను ఏర్పాటు చేస్తామని ఏఈఈ హనుమాన్ బాబు తెలిపారు. అవసరమైన మేర బస్సులను ఏర్పాటు చేస్తామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. భక్తులకు ఇబ్బంది లేకుండా 300 మంది సిబ్బందితో పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని ఎన్నెస్పీ కాలువ వంతెన దగ్గర, మిగిలిన ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని సీఐ ఎస్.సుబ్బారావు తెలిపారు. అన్ని శాఖల అధికారులూ ఉత్సవాల విజయవంతానికి కృషి చేయాలని డిప్యూటీ తహసీల్దారు భ్రమరాంబ కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.సాంబశివరావు, ఈవోఆర్డీ మురళీమోహన్, సర్పంచ్ పి.వెంకటలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

గిద్దలూరు, ఫిబ్రవరి 13 : గిద్దలూరులోని టెన్నిస్ స్టేడియంలో ఈనెల 14వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు మేమున్నాం సేవా సమితి అధ్యక్షుడు చల్లా అశోక్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రేమికుల దినోత్సవం వద్దు - సైనికుల ఆత్మశాంతి ముద్దు అనే నినాదంతో పుల్వామా దాడిలో వీరమరణం పొందిన జవాన్లను స్మరించుకుంటూ నిర్వహిస్తున్న దృష్ట్యా దాతలు సహకరించాలని పేర్కొన్నారు.

ఆటోలకు జరిమానా

గిద్దలూరు, ఫిబ్రవరి 13 : రవాణాశాఖ అధికారులు గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాలలో ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. గిద్దలూరు నుంచి రాజుపాలెం మీదుగా కొమరోలు, గిద్దలూరు నుంచి రాచర్ల రూట్ల ఆటోలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న ఆటోలను గుర్తించారు. ఆటోను సీజ్ చేసి, మరో 5 ఆటోలకు రూ.86వేల జరిమానా విధించినట్లు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎ.మాధవరావు తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో కమలా విద్యార్థిని ప్రతిభ


అల్మాస్ భాను

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 13: స్థానిక కమలా జూనియర్ కళాశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థిని షేక్ అల్మాస్ భాను జేఈఈ మెయిన్స్ ఫలితాలలో ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. కళాశాలలో మంగళవారం విద్యార్థులను ఆయన అభినందించారు. అల్మాస్ భాను 90.65 పర్సంటైల్ సాధించి పట్టణంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. తమ కళాశాలలో శిక్షణ పొందుతున్న 45 మంది విద్యార్థులలో 31 మంది అర్హత సాధించారని, నలుగురు విద్యార్థులు 75 పర్సంటైల్‌కు పైగా సాధించారని తెలిపారు.

డిగ్రీలో సాయి చైతన్య సత్తా

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 13 : ఆంధ్రకేసరి వర్సిటీ విడుదల చేసిన డిగ్రీ సెమిస్టర్1 ఫలితాల్లో సాయి చైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ జి.రంగస్వామిరెడ్డి తెలిపారు. పి.షహీల 8.90 (బోటనీ), కె.నీలోఫర్ 8.86, ఇ.మౌనిక 8.73 (కెమిస్ట్రీ), షేక్ నజీహ తస్నీమ్ 8.48, పి.నవ్య 8.40 (కంప్యూటర్), షేక్ రసూల్‌బి 8.39, ఇ.సమీర 8.49, ఎం.విష్ణువర్ధన్ 8.08 (కంప్యూటర్) పాయింట్లు సాధించారు.

బ్యాంకులకు దీటుగా తపాలా సేవలు


అవార్డును అందజేస్తున్న శ్రీనివాస్

పొదిలి, ఫిబ్రవరి 13 : బ్యాంకులకు దీటుగా తపాలా సేవలు అందిస్తున్నట్లు మార్కాపురం పోస్టల్ సూపరింటెండెంట్ కె శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ బాలకల ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో పొదిలి సబ్ డివిజన్ స్థాయి బీపీఎంల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. తపాలా శాఖ ప్రవేశపెట్టిన పథకాలపై ప్రజలకు వివరించాలన్నారు. పోస్టల్ పేమెంట్ బ్యాంక్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల ను ఖాతాదారులకు నేరుగా అందజేస్తున్నట్లు చెప్పారు. తపాలా జీవిత బీమా పథకం వరంలాంటిదన్నారు. సుకన్య సమృద్ధి యోజన బాలికలు భరోసా ఇ స్తుందన్నారు. లక్ష్యాలను సిబ్బంది చిత్తశుద్ధితో పూర్తి చేయాలని ఆయన కోరారు. గత ఏడాది ప్రతిభ కనబర్చిన సిబ్బందికి అవార్డులను శ్రీనివాస్ అం దజేశారు. సమావేశంలో ఐపీపీబీ మేనేజర్ సాయిరాం, పొదిలి సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ పీ వెంకటేశ్వర్లు, హెడ్ పోస్ట్‌మాస్టర్ కే నాగేశ్వరరావు, ఎస్‌పీఎంలు సాయిరాం, స్వరూపా, శింగరకొండ, మేల్‌ఓవర్‌సీల్‌లు ఎం.శ్రీనివాసరావు, కే శ్రీనివాసరావు, బీపీఎంలు, ఏబీపీఎంలు పాల్గొన్నారు.

టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించాలి

రాచర్ల, ఫిబ్రవరి 13 : పదవ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని మార్కాపురం ఉప విద్యాశాఖాధికారి చంద్రమౌళీశ్వర్ అన్నారు. మండలంలోని జేపుల్లలచెరువు ఉన్నత పాఠశాలలో, చోళ్లవీడు ఉన్నత పాఠశాలను మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఇఓ గిరిధరశర్మ, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యపై స్పెషల్ డ్రైవ్

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 13 : పట్టణంలో పలుచోట్ల మంగళవారం గిద్దలూరు పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. అర్బన్ సీఐ సోమయ్య ఆధ్వర్యంలో కుమ్మరాంకట్ట, వైఎస్ఆర్ సర్కిల్, రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ వద్ద స్పెషల్ డ్రైవర్ నిర్వహించారు. రోడ్లపై, వ్యాపార సంస్థల ఎదుట వాహనాలు నిలపరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు.

16న గ్రామీణ భారత్ బంద్


మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 13: బీజేపీ ప్రభుత్వం దుర్మార్గ విధానాలను అనుసరిస్తుందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సీపీఐ కార్యాలయంలో రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల సమావేశం అందె నారసరయ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడానికి ఈనెల 16న దేశవ్యాప్తంగా గ్రామీణ భారత్ బంద్, పారిశ్రామిక స మ్మెను జయప్రదం చేయాలన్నారు. రైతులకు 59 శాతం రుణాలు, పంటలకు మద్దతు ధర ఇవ్వాలన్నారు. స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు, వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం రూ.600, 200 రోజుల పని కల్పించాలన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు చుండూరు రంగారావు మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలన్నారు. రైతు సంఘం నాయకులు వెంకటరావు మాట్లాడుతూ వైసీపీ పాలకులవి మోసపూరిత మాటలు తప్ప రైతులకు, ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలనాగయ్య, తిరుపతి రెడ్డి, రాజశేఖరరెడ్డి, కొండయ్య, రఫి, సోమయ్య, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఆలయాల వద్ద శాసనాల పరిశీలన


పరిశీలిస్తున్న ఆర్కియాలజీ సిబ్బంది

త్రిపురాంతకం, ఫిబ్రవరి 13: పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయం వద్ద కొత్తగా గుర్తించిన పలు శాసనాలను ఆర్కియాలజీ సిబ్బంది మంగళవారం పరిశీలించారు. భారత పురావస్తు శాఖ శాసన విభాగం అధ్యక్షుడు కె. మునిరత్నంరెడ్డి ఆదేశాల మేరకు ఈ శాసనాలను పరిశీలించిన సహాయ శాసనాధికారి ఆదిత్య సింగిరెడ్డి, సహాయకుడు నాగేంద్ర స్థానిక చారిత్రక పరిశోధకుడు తురిమెళ్ల శ్రీనివాసప్రసాద్ సహకారంతో శాసనాల ఇస్టాంపేజ్ (అచ్చుస్వీకరణ) చేశారు. వీటిని మైసూరులోని పురాతత్వశాఖ శాసన విభాగంలో అధ్యయనం చేసి నిక్షిప్త పరుస్తారు. అనంతరం శాసనాలలోని సారాంశాని తెలియజేస్తామని సిబ్బంది తెలిపారు.

జనసేన పార్టీలోకి 20 కుటుంబాల చేరిక


పార్టీలో చేరినవారితో మల్లికార్జున

త్రిపురాంతకం, ఫిబ్రవరి 13: మండలంలోని మిట్టపాలెం బైనీడి కాలనీకి చెందిన 20 కుటుంబాలు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల మల్లికార్జున ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. ఈసందర్భంగా పార్టీలో చేరినవారికి మల్లికార్జున కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం పార్టీలో చేరినవారు మాట్లాడుతూ పవణ్ కల్యాణ్ సిద్ధాంతాలు నచ్చి, యువత రాజకీయాల్లోకి రావాలనే పిలుపుతో జనసేన పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కటికి శ్రీనివాసు లు, గల్లా అజయ్, పొలపొల సుబ్బారావు, మహేష్, రాంబాబు, సాయి పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులు సరిచేయండి

బీఎల్వోలకు ఆర్వో ఆదేశం


మాట్లాడుతున్న ఆర్వో సుగుణమ్మ

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 13 : ఓటర్ల జాబితాలో తప్పులను సరిదిద్దాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్వో) జీ సుగుణమ్మ బీఎల్వోలను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజకీయపార్టీల నాయకులు, అధికారులతో ఓటర్ల జాబితాపై సమావేశం నిర్వహించారు. మృతుల ఓట్లు తొలగించలేదని ఫిర్యాదులు వస్తున్నాయని, బిఎల్వోలు నిశితంగా తనిఖీ చేయాలని ఆర్వో సూచించారు. తొలగింపు ఫారం 7, ఓటు ట్రాన్స్‌ఫర్, సవరణ, అడ్రస్ మార్పు, పేరు తప్పునకు ఫారం 8ని వినియోగించుకోవాలన్నారు.

65 పోలింగ్ బూత్‌ను సుద్దకురవ తాండాకు మార్చాలి

పుల్లలచెరువు మండలం సుద్దరకురవతాండాకు చెందిన 65వ పోలింగ్ బూత్ 6 కిమీ దూరంలో ఉన్న వెంకటరెడ్డిపల్లి గ్రామంలో ఉందని, అక్కడ నుంచి సుద్దకురవ తాండాకు మార్చాలని సర్పంచి వెంకటేశ్వరనాయక్, టీడీపీ ప్రతినిధి హనుమంతారావు నాయక్ ఆర్వోకు వినతిపత్రం అందజేశారు. 65వ పోలింగ్ బూత్‌లో ఉన్న 551 మంది ఓటర్లు ఎస్టీ ఓటర్లేనని చెప్పారు. బూత్ మార్పునకు ప్రతిపాదనలు పంపించాలని తహసీల్దారును ఆర్వో ఆదేశించారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి

పొదిలి : ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ కోటయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని ఈగలపాడు, గొల్లపల్లి, పాములపాడు, కుంచేపల్లి, ఉన్నగురవాయపాలెం, మల్లవరం గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో గొడవలకు పాల్పడవద్దని హెచ్చరించారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్నికల సమయంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

మహిళా సాధికారతే ధ్యేయం

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 13 : మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయమని వైసీపీ వైపాలెం ఇన్‌చార్జి తాడిపత్రి చంద్రశేఖర్ అన్నారు. పెద్దారవీడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం డ్వాక్రా మహిళలకు నాలుగో విడత ఆసరా చెక్కులను ఆయన పంపిణీ చేశారు. 551 గ్రూపులకు 5557 లబ్ధిదారులకి రూ.3.18కోట్ల చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో రా ఇరిగేషన్ డైరెక్టర్ దుగ్గెంపూడి వెంకటరెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య, జెడ్పీటీసీ ఏరువ చలమారెడ్డి, మండల పార్టీ కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, డీఆర్డీఏ వైకేపీ ఏపీఎం పి.శ్రీనివాసులు, అధికారులు, వీవోఏలు, నాయకులు పాల్గొన్నారు.

15న శిఖర కలశ ప్రతిష్ఠ

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 13: మండలంలోని బోడేనాయక్ తాండా వద్ద ఈనెల 15వ తేదీన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో నూతన శిఖర్రగొండపాలెం తహసీల్దారు ధ్వజ,పంచలోహ విగ్రహ ప్రతిష్ఠోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ మంగళవారం ప్రకటనలో తెలిపింది. మొదటి రోజు వేద పండితుల ఆధ్వర్యంలో గణపతి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అప్రంటీస్ విధానాన్ని రద్దుచేయాలి


ప్రతులను తగులబెడుతున్న నాయకులు

పొదిలి, ఫిబ్రవరి 13 : ఉపాధ్యాయ నియామకాల్లో అప్రంటీస్ విధానాన్ని రద్దు చేయాలని యూటీఎఫ్ డివిజన్ కా ర్యదర్శి బాలవెంకటేశ్వర్లు డిమాండ్ చే శారు. మంగళవారం యూటీఎఫ్ కార్యాలయం ముందు జీవో ప్రతులను తగులబెట్టి నిరసన తెలిపారు. ఉపాధ్యాయ నియామకాల్లో వైసీపీ ప్రభుత్వం మరో దుర్మార్గానికి పూనుకుంటుందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులను వైసీపీ అణగదొక్కేందుకు కుట్ర చే స్తుందన్నారు. ఇది దగా డీఎస్సీ అంటూ నినదిస్తూ ప్రతులను తగులబెట్టారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు అబ్దుల్‌హై, అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, కామేశ్వరరావు, యుద్ధం శ్రీనివాసులు, చవళం వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ఇంటింటి ప్రచారంలో కందుల తనయుడు విఘ్నేష్‌రెడ్డి


సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేస్తున్న విఘ్నేష్ రెడ్డి

పొదిలి, వరి 13 : చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తనయుడు తనయు డు కందుల విఘ్నేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థా నిక పట్టణంలోని 2వ వార్డుల్లో జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్.. గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తా మన్నారు. చంద్రబాబు ఆరు గ్యారెంటీ ద్వారా మహిళలు ధైర్యంగా బతికేలా తల్లికివందన, ఏడాదికిమూడు గ్యాస్ సిలిండర్లు, ఆడ బిడ్డ నిధి, బీసీ రక్షణచట్టం, ఇంటింటికీ రక్షిత తాగునీరు, పేదలను సంపన్నులను చేయడమే లక్ష్యంగా ప్రణాళికలను రూపొందించిందని విఘ్నేష్‌రెడ్డి తెలిపారు. అన్ని వర్గాల ప్రజల కష్టాలు తీరాలన్నా, యువతకు ఉద్యోగాలు కావాలన్నా చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలంతా విజ్ఞతతో ఆలోచించి టీడీపీ అభ్యర్థులను ఎన్నుకోవాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలని, ఐదేళ్లుగా జగన్‌రెడ్డి పాలనలో ఏవిధంగా నష్టపోయామో తెలియజేయాలని కార్యకర్తలకు సూచించారు. ప్రతి రోజూ ఓటర్ల జాబితాను పరిశీలించి అప్రమత్తంగా ఉండాలన్నారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యతతో టీడీపీ విజయానికి శ్రమించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొదిలి ఆర్యవైశ్యులతో కందుల నారాయణ రెడ్డి తనయుడు విఘ్నేష్‌రెడ్డి సమావేశమయ్యారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ నివాసంలో మంగళవారం సమావేశమై రానున్న ఎన్నికల గురించి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరా రు.


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎరిక్షన్‌బాబు

తోకపల్లిలో ఎరిక్షన్‌బాబు ప్రచారం

మార్కాపురం రూరల్ : పెద్దారవీడు మండలం తోకపల్లి గ్రామంలో బాబు షూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని మంగళవారం నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. వైపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఇంటింటికీ తిరిగి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం నాశనమైందని, అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని గద్దెదింపాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, గొట్టం శ్రీనివాస్ రెడ్డి, గుమ్మా గంగరాజు, జడ్డ రవి, లింగాల అబ్రహం, శ్రీనివాసులు, వెంకట నారాయణ, మేకల శ్రీనివాసులు, గోసు నాగరాజు, మేకల వెంకటనారాయణ, మేకల తిరుమలయ్య, నక్క శీను, తోకల ఎల్లయ్య, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణారావు

వెలిగొండపై వైసీపీ మోసం

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 13 : వెలిగొండ ప్రాజెక్టుపై వైసీపీ ప్రభుత్వం పశ్చిమ ప్రాంత ప్రజలను మోసం చేస్తున్నదని బీజేపీ మార్కాపురం అసెంబ్లీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు విమర్శించారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కృష్ణారావు మాట్లాడుతూ వెనుకబడిన పశ్చిమ ప్రకాశానికి వెలిగొండ కొండంత అండ అన్నారు. ఐదేళ్లుగా ప్రాజెక్టు పనులు పూర్తి చేయడంలో జగన్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రాజెక్టును పూర్తి చేయకుండా జాతికి అంకితం చేస్తామని వైసీపీ పాలకులు ప్రకటించడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. బడ్జెట్‌లో పెట్టకుండా ప్రాజెక్టు ఎలా పూర్తి అవుతుందని, ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకే వైసీపీ నేతలు అబద్ధపు ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారికి ఆర్ ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని, మార్కాపురాన్ని జిల్లా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్రశేఖర్, లక్ష్మీ, జీవీ రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.


గ్రీన్ కలర్‌లో విద్యార్థుల ప్రదర్శన

విద్యార్థులలో ప్రేరణ కలిగించాలి

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 13 : విద్యార్థులలో వివిధ అంశాలపై ప్రేరణ కలిగించాలని శ్రీశైల దేవస్థాన ట్రస్ట్ బోర్డు సభ్యురాలు డా. చెప్పల్లి కనకదుర్గ అన్నారు. వాసవీ విద్యానికేతన్‌లో విద్యార్థులకు కలర్స్, ఫ్రూట్స్, వెజిటబుల్స్ డే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు ఆకుపచ్చ, ఎరుపు, పసుపు తదితర రంగుల దుస్తులతో పండ్లు, కూరగాయాల ఆకృతులతో ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తయారు చేసిన ఆకృతులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.రంగయ్య, ఏవో రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 13: మండలంలో నీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి విశ్వరూపాచారి, నాయకులు పీ తిరుమలయ్య మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

తాగునీటి సమస్యకు తాత్కాలిక పరిష్కారం


మిట్టపాలెంలో నీటిని పట్టుకుంటున్న మహిళలు

త్రిపురాంతకం, ఫిబ్రవరి 13 : మండలంలోని నాలుగు గ్రామాల్లో ప్రభుత్వం గతంలో సరఫరా చేస్తున్న మంచి నీటి సరఫరా ట్రాక్టర్లను ఇటీవల నిలిపి వేసింది. దీంతో ఆయా గ్రామాల్లోని పరిస్థితిలను బట్టి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాత్కాలిక ప్రత్యామ్నాయ ఏర్పాటు చేశారు. దీనికి తోడు రామసముద్రంలో పంచాయతీ ఆధ్వర్యంలో ఒకచోట వి ద్యుత్ మోటార్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటే పరిస్థితుల్లో ప్ర జలు ఆయా బోర్ల వద్ద నీటిని నింపుకుంటున్నారు. కాగా మిట్టపాలెం, రామసముద్రం గ్రా మాలకు ఇటీవల గొల్లపల్లి ఎస్ఎస్ ట్యాంకు నుంచి సాగర్ జలాలను అందించే ఉద్దేశంతో పైపు లైన్లను ఏర్పాటు చేశారు. దాని ద్వారా మంచి నీటిని ట్యాంకులకు ఎక్కించేందుకు రెండు రోజుల క్రితం ట్రయల్స్ నిర్వహించారు. విజయవంతం కావడంతో బుధవారం నుంచి రెండు గ్రామాలకు పూర్తి స్థాయిలో నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నారు. లేళ్లపల్లి, దువ్వలి గ్రామాల్లో మాత్రం విద్యుత్ మోటార్ల ద్వారా నీటిని పట్టుకుంటున్నారు. భూగర్భజలాలు అడుగంటడంతో గంటసేపు నీరు వస్తే మరో గంటసేపు నీరు రావడం లేదు. అవి కూడా మరో పది రోజుల్లో పూర్తిగా నిలిచిపోతాయని, సమస్య తీవ్రమవుతుందని గ్రామస్థులు తెలిపారు. ఈలోగా ప్రభుత్వం మళ్లీ మంచి నీటి సరఫరాకు ట్యాంక్‌లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రిజర్వాయర్ నీళ్లు పక్కదారి


కాలువ నీటిని ఇంజన్ ద్వారా ట్యాంకును నింపుతున్న దృశ్యం

పామూరు, ఫిబ్రవరి 13 : మెయిన్ కాలువల ద్వారా పారుతున్న మోపాడు రిజర్వాయర్ నీటిని ఆయిల్ ఇంజన్ల సహాయంతో కొందరు నీళ్ల ట్యాంకులను నింపుకొని రోడ్ల నిర్మాణానికి తరలించుకొని వెళుతున్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 12 అడుగుల మేర నీటిమట్టం ఉంది. ఆయకట్టు భూముల్లో వరి, జొన్న పైర్లు సాగులో ఉన్నాయి. పంటల సాగుకు ఉపయోగించాల్సిన రిజర్వాయర్ నీటిని, జాతీయ రహదారి నిర్మాణ పనులకు, సాగులో ఉన్న పొగాకు పంటల అవసరాలకు ఉపయోగించడం తగదని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. రానున్న వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని రిజర్వాయర్ నీటిని వృథా కానివ్వకుండా ఇరిగేషన్ అధికారులు అరికట్టాలని, పంటల అవసరాల కోసం వారబందీ పద్ధతి పాటించి నీటి నిల్వలను వృథా కాకుండా కాపాడాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

45 నిమిషాల్లో ముగించిన మండల సమావేశం

పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు గైర్హాజరు


మాట్లాడుతున్న ఎంపీపీ మహాలక్ష్మి

వెలిగండ్ల, ఫిబ్రవరి 13 : ప్రతి మూడునెలలకొకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాన్ని పాలకులు 45 నిమిషాల్లోనే ముగించి మ.మ అనిపించారు. ప్రజల సమస్యలపై లోతుగా చర్చించి వాటి పరిష్కారానికి చొరవ చూపాల్సిన సమావేశం ఇలా నిమిషాల్లోనే ముగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం వెలిగండ్ల మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రామణ మహాలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా 45 నిమిషాలు ఆలస్యంగా మొదలైంది. ఆ తర్వాత కేవలం 45 నిమిషాల సమయంలోనే సమావేశాన్ని మమ అనిపించారు. సమావేశానికి 19 శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా కేవలం 6 శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. మిగతా శాఖల అధికారులు రాకపోవడంతో మండల అభివృద్ధి, ప్రజా సమస్యలు సమావేశంలో చర్చించే అవకాశం లేకుండా పోయింది. ఎంపీటీసీ సభ్యులు 10 మందికి గాను ఆరుగురు హాజరయ్యారు. 21 మంది సర్పంచులకు గాను ఐదుగురులోపు మాత్రమే వచ్చారు. దీంతో కుర్చీలు ఖాళీగా కనిపించాయి.

వేసవికి ముందే ఎక్కిళ్లు

దొనకొండ మండలంలో తీవ్రమైన మంచినీటి కష్టాలు

ట్యాంకర్లు నిలిపివేసినా ప్రత్యామ్నాయం చూపని వైసీపీ ప్రభుత్వం


ఇండ్లచెరువు గ్రామంలో నీళ్ల కోసం ఎదురుచూస్తున్న గ్రామస్థులు

దొనకొండ, ఫిబ్రవరి 13 : మండలంలోని అనేక గ్రామాల్లో ప్రజలు గుక్కెడు నీరు దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫిబ్రవరిలోనే తాగునీటి కష్టాలు ప్రారంభం కావడంతో లబోదిబోమంటున్నారు. ట్యాంకర్లను నిలిపివేసినా వైసీపీ ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపకపోవటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురవకపోవటంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి చేతిపంపులు, డీప్‌బోర్లకు నీరు అందటంలేదు. చందవరం-1 మంచినీటి స్టోరేజీ నుంచి 10 రోజులుగా సాగర్‌జలాలు సరఫరా కావడంలేదు. అలాగే కొచ్చెర్లకోట శివారులోని పల్లెలకు టీడీపీ, వైసీపీకి చెందిన నాయకులు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో ప్రజలు సామూహికంగా ట్యాంకర్ల నీటిని కొనుగోలు చేసి తెప్పించుకుంటున్నారు. ఇంకొందరు పొలాల్లోని బోర్ల నుంచి ద్విచక్ర వాహనాలతో తెచ్చుకొని ఉపయోగించుకుంటున్నారు. నీటి ఎద్దడిని పాలకులు గుర్తించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

వైసీపీకి మద్దతు అందించాలి

దర్శి, ఫిబ్రవరి : వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గుర్తించి సంపూర్ణ మద్దతు అందించాలని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మన ఊరికి మన శివన్న కార్యక్రమంలో భాగంగా మంగళవారం దర్శి నగర పంచాయతీలోని పుట్టబజారు, శివరాజ్‌నగర్ గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకటరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నాయకునికి జనసేన నేత వెంకట్ పరామర్శ


మల్లికార్జునరావును పరామర్శిస్తున్న వెంకట్

దర్శి, ఫిబ్రవరి : మండలంలోని తూర్పువీరాయపాలెం టీడీపీ అధ్యక్షుడు మందాడి మల్లికార్జునరావును నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్ మంగళవారం పరామర్శించారు. ఒంగోలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మల్లికార్జునరావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వెంకట్ ఒంగోలు వెళ్లి పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

వైభవంగా జంట నాగుల విగ్రహాల ప్రతిష్ఠ


శివ కల్యాణం

కురిచేడు, ఫిబ్రవరి 13 : మండలంలోని దేకనకొండ గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం 108 జంట నాగుల విగ్రహాలతోపాటు శివుని విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. తిరుపతి నుంచి వచ్చిన రుత్విక్కులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రతిష్ఠ అనంతరం శివకల్యాణం నిర్వహించారు. అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాలను కురంగి నాగేశ్వరరావు, వెలగపూడి సుబ్బారావులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

అమీర్‌బాబు ఆర్థిక సహకారంతో ట్రైసైకిల్ అందజేత

పామూరు, ఫిబ్రవరి 13 : మండలంలోని కోడిగుంపల గ్రామానికి చెందిన దివ్యాంగురాలు పడుచూరి సుధారాణికి మానవత సేవా సంస్థ సభ్యుల కోరిక మేరకు టీడీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ అమీర్‌బాబు మంగళవారం ట్రైసైకిల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మానవత సేవా సంస్థ కన్వీనర్ వెండిదండి వెంకటేశ్వరరెడ్డి, అధ్యక్షుడు పీ తిరుపతిరెడ్డి, కే రమణయ్య, ఏ మాల్యాద్రి, పీఎం చలం, పీ మాల్యాద్రి పాల్గొన్నారు.

కూలీల ఆటో బోల్తా.. ఒకరు మృతి

ఎనిమిది మందికి గాయాలు


మృతుడు ఏసురాజు

ముండ్లమూరు, ఫిబ్రవరి 13 : మండలంలోని పూరిమెట్ల సమీపంలో మిరపకాయల కూలీల ఆటో బోల్తా పడటంతో ఉయ్యాల ఏసురాజు(22) తీవ్ర గాయాలై ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మిగతా ఎనిమిది మంది కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... మండలంలోని సింగనపాలెం ఎస్టీకాలనీకి చెందిన ఉయ్యాల ఏసురాజు, వెంకటేశ్వరమ్మ, కొండమ్మ, బుల్లెమ్మ, రామకృష్ణ, దుర్గ మరి కొందరు కూలీలను సింగనపాలెం నుంచి పూరిమెట్లకు చెందిన చొప్పవరపు గోపీ తన ఆటోలో ఎక్కించుకొని స్వగ్రామానికి తీసుకెళ్లాడు. రైతులకు చెందిన మిరపకాయలు కోసేందుకు కూలీలు రోజూ వెళ్తుంటారు. ఆ క్రమంలో మంగళవారం కూడా వెళ్లారు. ఆటో బోల్తా పడడంతో కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. వినుకొండ మండలం నడిగడ్డ గ్రామానికి చెందిన ఉయ్యాల ఏసురాజు కొంతకాలం నుంచి సింగనపాలెం ఎస్టీ కాలనీలో ఉంటూ మిరప కాయల కోతకు వెళుతున్నాడు. తీవ్రంగా గాయపడిన ఏసురాజుతోపాటు బాధితులను అద్దంకి, ఒంగోలు ఆస్పత్రులకు తరలించారు. ఈ విషయం తెలియడంతో సింగనపాలెంలోని వారి బంధువులు ఒక్కసారిగా ఆందోళన చెందారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మహిళలు స్వయంశక్తితో ఎదగాలి

మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి


మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, హాజరైన మహిళలు

కనిగిరి, ఫిబ్రవరి 13 : మహిళలు స్వయంశక్తితో ఆర్థికంగా ఎదగాలని మాజీ ఎమ్మెల్యే టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో మంగళవారం మహిళలకు కుట్టుమిషన్ శిక్షణా కేంద్రంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలుగుమహిళా మహాశక్తి ఆధ్వర్యంలో కుట్టు మిషన్ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. శిక్షణ పొందిన వారికి ట్రస్ట్ ద్వారా కుట్టుమిషన్లు అందజేస్తామన్నారు. రెండో విడతలో అనాథలు, ఏ ఉపాధి లేని పేద మహిళలకు శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్లు పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుమహిళలు కరణం అరుణ, మాజీ కౌన్సిలర్లు షేక్ వాజిదాబేగం, బొగ్గరపు శ్రీలత, దొరసాని, తులసి, అమ్ములమ్మ, నారాయణమ్మ, వెంకటలక్ష్మమ్మ, దుర్గ, స్వప్న, కే నీరజ, కరిమున్నీసా తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న దర్శి నియోజకవర్గ ఈఆర్ఓ లోకేశ్వరరావు

దర్శి, ఫిబ్రవరి : ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎంవీ లోకేశ్వరరావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాలో ఎక్కడైనా బోగస్ ఓట్లు నమోదైనట్లు బయటపడితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. దొంగ ఓట్లు చేర్పించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పూర్తిస్థాయిలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ఎ లాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ దేవప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ రవిశంకర్, ఎస్సై శివన్నారాయణ, నగర పంచాయతీ కమిషనర్ వై మహేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీ జీవోలు విడుదల చేయాలి

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల నిరసన



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కనిగిరి, ఫిబ్రవరి 13 : ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమ్మె సమయంలో ఇచ్చిన హామీల జీవోలను వెంటనే విడుదల చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాసర్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 డిమాండ్లను ఒప్పుకున్న ప్రభుత్వం రెండు నెలలు గడిచినా జీవోలు విడుదల చేయకపోవటం దారుణమన్నారు. గత సమ్మె సందర్భంగా కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తామని చెప్పిన మంత్రివర్గ సభ్యులు ఆ తర్వాత పట్టించుకోలేదని విమర్శించారు. కరోనా సమయంలో తీసుకున్న కార్మికలను ఆప్కాస్ నందు నమోదు చేసి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కార్మికులకు వేసిన కమిటీ ప్రకారం స్కిల్డ్, సెమీ స్కిల్డ్, హైస్కిల్డ్‌గా విభజించి కార్మికులకు జీతాలు చెల్లించాలని, ఎల్ఈడీ విద్యుత్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ దానియల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆలూరి కోటయ్య, అశోక్, గంగవరపు కిరణ్, సుబ్రమణ్యం, సాల్మన్, రవి, మధు, ఐజాక్, శేషయ్య, సుధాకర్, సూరిబాబు, జీవన్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమ్మె బాట తప్పదు

ఎన్జీవో సంఘం నాయకులు పీవీ రమణారెడ్డి


మాట్లాడుతున్న పీవీ రమణారెడ్డి

కనిగిరి, ఫిబ్రవరి 13 : ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె బాట తప్పదని ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి చెప్పారు. స్థానిక ఎన్జీవో భవనంలో మంగళవారం జరిగిన ఉద్యోగ జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, డీఏ అరియర్స్ సెల్, పీఆర్సీ అరియర్స్ వంటి సమస్యలను పరిష్కరించటంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. అదేవిధంగా జీపీఎస్ రద్దు, 12వ పీఆర్సీ, ఐఆర్ విడుదల చేయకుండా ప్రభుత్వం ఉద్యోగులపై చిన్నచూపు చూస్తోందన్నారు. ఇంకో పక్క జీడబ్ల్యూఎస్ ఉద్యోగాలపై ఒత్తిడి పెంచటం దుర్మార్గమని చెప్పారు. కాంట్రాక్టు ఉద్యోగులకు క్రమబద్ధీకరిస్తానని 2019 ఎన్నికలకు ముందు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ నెరవేర్చకుండా తీవ్ర అన్యాయం చేశారన్నారు. ప్రభుత్వం పదేపదే చర్చలు చేసినప్పటికీ ఉద్యోగులను మోసం చేస్తూనే ఉందని చెప్పారు. దీంతో రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు నేటి నుంచి ఈనెల 27వ తేదీ వరకు వివిధ రూపాల్లో ప్రతిరోజూ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి ప్రతి ఉద్యోగి నిరసనగా విధులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా 15, 16 తేదీల్లో భోజన విరామ సమయంలో నిరసన తెలపాలన్నారు. ఈ కార్యక్రమాలలో జిల్లాలోని అన్ని శాఖల ఉద్యోగులు, సిబ్బంది, కార్మికులు, పెన్షనర్లు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఖాజారహంతుల్లా, మిగిలిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు రాము, మల్లికార్జునరెడ్డి, నరసింహారావు, సుబ్బారెడ్డి, వెంకటస్వామి, రషీద్, మల్లేశ్వరరెడ్డి, వెంకటరెడ్డి, రసూల్, వెంకటసుబ్బయ్య, మహిళా నాయకులు అరవింద, పార్వతి, హేమనీరజ, జయశ్రీ పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

పీసీపల్లి, ఫిబ్రవరి 13 : జూదం ఆడుతున్న నలుగురిని పీసీపల్లి పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఎస్సై రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు... నేలపాటిపల్లి గ్రామ సమీపంలోని పొలాల్లో కోతముక్క ఆడుతున్నారని సమాచారం అందింది. దీంతో ఎస్సై తన సిబ్బందితో ఆ ప్రాంతానికి వెళ్లగా నలుగురు జూదం ఆడుతూ కనిపించారు. వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద రూ.19,530 నగదును తీసుకుని వారిపై కేసు నమోదు చేశారు.

15 మద్యం బాటిళ్లు స్వాధీనం

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి13: చెన్నై టూ ఒంగోలు మద్యం అక్రమ రవాణా చేస్తున్న ముఠా గుట్టు చేశారు రైల్వే పోలీసులు. మంగళవారం ఒంగోలు రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు కోరమండల్ ఎక్స్‌ప్రెస్ నుంచి దిగిన ఇరువురు యువకుల వద్ద 15 ఫుల్‌బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. కారు డ్రైవర్లుగా పనిచేసే స్థానిక కొత్తపట్నం బస్టాండ్‌లో నివాసం ఉండే సాయి, అన్నవరప్పాడుకాలనీ రెండో లైన్‌లోనివాసం ఉండే హరికృష్ణ చెన్నై వెళ్ళి అక్రమంగా మద్యం తీసుకొచ్చి అధికధరలకు విక్రయిస్తుంటారని రైల్వే సీఐ ఎస్.శ్రీకాంత్ బాబు తెలిపారు. ఇరువురి వద్ద స్వాధీనం చేసుకున్న మద్యం సుమారు రూ. 1.50లక్షలు ఉంటుందని అంచనా వేశారు. నగరంలో ఒక్కో బాటిల్ రూ.15వేల చొప్పున విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు సతీష్, హుస్సేన్ పాల్గొన్నారు.

రైలు పట్టాల పక్కన మహిళ మృతదేహం

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 13: రైలు పట్టాల పక్కన మహిళ మృతదేహం వెలుగుచూసింది. ఈ సంఘటన ఒంగోలు అగ్రహారం గేటు సమీపంలో మంగళవారం జరిగింది. సుమారు 50 ఏళ్ళ వయస్సు గల మహిళ గులాబీరంగు చీర, జాకెట్ ధరించి ఉంది. ఆమె మెడలో పసుపు తాడు ఉంది. అయితే ఆమె రైలులో నుంచి జారి పడిందా లేక రైలు కింద పడి మృతి చెందిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రైల్వే పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. వివరాలు తెలిసినవారు 94409904870, 7013915467 సెల్ నంబర్లకు ఫోన్ చేయాలని సీఐ శ్రీకాంత్‌బాబు కోరారు.

16న జరిగే బంద్‌ను విజయవంతం చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 13 : కేంద్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ ఈనెల 16వతేదీన జరగనున్న దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం ఒంగోలులో రైతు కూలీసంఘం, ఏఐఎఫ్‌టీయూ(న్యూ) ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కత్తి పేరయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి స్వామి మాట్లాడుతూ దేశ సహజ సంపదలను, శ్రమశక్తిని కారుచౌకగా దోచుకోనేందుకు విదేశీ, స్వదేశీ కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం సహకరిస్తూ ఊడిగం చేస్తుందని విమర్శించారు. రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.లలితకుమారి మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న రైతుల ఆత్మహత్యలకు పూర్తిగా బాధ్యత కేంద్రం వహించాలన్నారు.

భర్త నుంచి రక్షణ కల్పించాలని మహిళల నిరసన

ఐద్వా మహిళల ఆధ్వర్యంలో పీఎస్ ఎదుట నిరసన

కనిగిరి, ఫిబ్రవరి 13 : భర్త నుంచి మహిళకు రక్షణ కల్పించాలని కోరుతూ ఐద్వా సంఘం ఆధ్వర్యంలో సోమవారం పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన ధర్నా నిర్వహించారు. వివరాలలోకి వెళితే... పట్టణ సమీపంలోని మాచవరం గ్రామంలో నివాసం ఉంటున్న దాసరి పొట్టెమ్మ అనే గిరిజన మహిళ న్యాయం చేయాలని కోరుతూ ఐద్వా మహిళలతో కలసి నిరసనకు దిగింది. మూడు రోజుల నుంచి పోలీస్‌స్టేషన్ ఎదుట న్యాయం చేయాలని కోరుతున్నా పట్టించుకోలేదని వాపోయారు. విషయం తెలుసుకున్న సీఐ దాసరి వెంకటేశ్వరరావు ఐద్వా మహిళలతో మాట్లాడి మహిళకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వటంతో నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పీసీ కేశవరావు, ఐద్వా మహిళలు ఎస్ వెంకటమ్మ, ప్రసన్న, ప్రమీల, రమీజావి, విజయలక్ష్మి, నారాయణమ్మ, తిరుపతమ్మ, రత్తమ్మ, చిన్నక్క, శాంతకుమారి, ఎలేషమ్మ పాల్గొన్నారు.

స్కిప్పింగ్ పోటీల్లో సరస్వతీ విద్యార్థుల ప్రతిభ


స్కిప్పింగ్ పోటీల విజేతలతో రమణారెడ్డి

తాళ్లూరు, ఫిబ్రవరి 13 : సౌత్ ఇండియా రోప్ స్కిప్పింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో తాళ్లూరు సరస్వతీ హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి విజేతలుగా నిలిచారు. గుంటూరులోని శ్రీమాజేటి గురవయ్య డిగ్రీ కాలేజీలో జరిగిన సౌత్‌జోన్ నేషనల్ స్కిప్పింగ్ పోటీల్లో అండర్-14 విభాగంలో స్పీడ్ హాప్ స్కిప్పింగ్ పోటీల్లో 8వతరగతి విద్యార్థిని పూర్ణిమ(ప్రథమస్థానం), అండర్ -17 విభాగంలో 9వ తరగతి విద్యార్థిని పావని(ద్వితీయస్థానం) సాధించారు. డబుల్ టచ్ గ్రూపులో స్నేహలత రెడ్డి, బ్లెస్సీ (ద్వితీయస్థానం), బాలుర విభాగంలో స్పీడ్ డబుల్ అండర్ రీలే గ్రూప్ పోటీల్లో ఈశ్వర్, సురేంద్రరెడ్డి, సాయిచరణ్, నెహేమియాలు(ద్వితీయస్థానం) సాధించారు. వీరిని విద్యాసంస్థల చైర్మన్ రమణారెడ్డి, హెచ్‌ఎం వి.శ్రీరామమూర్తి, పీఈటీ వికాస్, డీవో వెంకటరెడ్డిలు అభినందించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్

దర్శి, ఫిబ్రవరి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మూడవ సెమిస్టర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించారు. బత్తుల అంజలీ వృక్షశాస్త్రంలో అత్యధికంగా 98 మార్కులు, కె.శైలజ 599/700 మార్కులు, కె.సమత 645 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ సావిత్రి, వైస్ ప్రిన్సిపల్ రమణ, అభినందించారు.

ఘనంగా సరోజినినాయుడు జయంతి వేడుకలు


సరోజినినాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

పామూరు, ఫిబ్రవరి 13 : గాన కోకిల, తొలి మహిళా గవర్నర్ సరోజినినాయుడు, గొప్ప మేధావని హెచ్‌ఎం మహబూబ్‌బాష చెప్పారు. మండలంలోని నర్రమారెళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సరోజినినాయుడు జయంతి వేడుకల్లో ఉపాధ్యాయులు రమేష్, బీ కోటేశ్వరరావు, ఎన్ నీరజ, సుజాత, డీ నాగేశ్వరరావు, ఈ వెంకటేశ్వర్లు, ఎస్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

పీసీపల్లి, ఫిబ్రవరి 13 : ఎంపీపీ అత్యాల జఫన్య అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రమణారెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ప్రగతిపై చర్చిస్తామని, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లతో పాటు అన్ని శాఖల మండలస్థాయి అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.



బాగుపడే.. దారెక్కడ?

కొత్తగా రోడ్ల నిర్మాణానికి కాదుకదా.. అధ్వానంగా తయారై, ప్రమాదకరంగా మారిన రోడ్ల మరమ్మతులకు కూడా ప్రభుత్వం నిదులు ఒక్క రూపాయి విదిల్చిన పాపానపోలేదు. గతంలో చేసిన పనులకు సంబంధించి బిల్లులు భారీగా ప్రభుత్వం దగ్గర పెండింగ్ ఉండటంతో అప్పట్లో ఒప్పందం కుదుర్చుకున్న కాంట్రాక్టర్‌లూ పనులు చేయలేమని చేతులెత్తేశారు. దీంతో ప్రధాన రహదారులకూడా డొంక రోడ్లకంటే హీనంగా తయారయ్యాయి. వీటిపై ఇటీవల కాగ్ అనేక అభ్యంతరాలు వ్యక్తం చేసింది. పనుల విషయంలో నిర్లక్ష్యం, నిధుల మంజూరులో జాప్యం, బిల్లుల చెల్లింపుల విషయంలో పట్టనట్టు వ్యవహరించటంపై కాగ్ తలంటినా ప్రభుత్వం మాత్రం మాకేటి సిగ్గన్నట్టు నిర్మాణ పనుల పురోగతిని గాలికొదిలేసింది. దీంతో మోకాళ్లలోతు గుంటలలో ప్రయాణించలేక, తప్పనిసరి అయి ఏదైనా వాహనంలో వెళ్లినా ప్రమాదాలకుగురై ప్రాణాలు పోగొట్టుకోవలసి రావటం దారుణమే.



ధాన్యం సేకరణ మొక్కుబడి

ఏటికేడు కుచించుకుపోతున్న ధాన్యం సేకరణ

- ఇప్పటి వరకు కొన్నది 21,500 మెట్రిక్ టన్నులే
- ఇంకో 5,000 టన్నులు వస్తే గగనమే
- నిర్దేశించుకున్న లక్ష్యం 78,000 టన్నులు
- అన్నదాతలకు ఎండమావిగా మారిన మద్దతు ధర

బాపట్ల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఘనంగా లక్ష్యాలను నిర్దేశించుకోవడం.. ముగింపు కొచ్చేసరికి మొక్కుబడి సేకరణతో మమ అనిపించడం ధాన్యం సేకరణలో ప్రభుత్వానికి అలవాటుగా మా రింది. ఏటికేడు మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు పరిమాణం తగ్గుతూ వస్తుండడం మరింత ఆందో ళన కలిగిస్తోంది. రైతులకు మేలు చేయడానికి ప్రవే శపెట్టిన మద్దతు ధర వల్ల వారికి ఒనగూరుతున్న ప్రయోజనం ఎంత అనేది ఈ గణాంకాలతో తేలు తోంది. ఈ ఏడాది 78,000 మెట్రిక్ టన్నుల ధాన్యా న్ని అన్నదాతల వద్ద నుంచి మద్దతు ధరకు కొను గోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం సేకరించిన ధాన్యం కేవలం 21,500 మెట్రిక్ టన్నులే కాగా మహా అయితే సీజన్ ముగి సేసరికి ఇంకో 5,000 మెట్రిక్ టన్నులను మద్దతు ధరకు కొనుగోలు చేసే అవకాశముంది.

ఏటికేడు తగ్గుదల నమోదు...

రైతుభరోసా కేంద్రాల ద్వారా మద్దతు ధరకు ధాన్యం సేకరించే విషయంలో ప్రతి సీజన్‌కు తగ్గుదలే నమోదవడం రైతులపై ప్రభుత్వానికి ఉన్న చిన్న చూపునకు నిదర్శనంగా కనబడుతోంది. గతేడాది ఇదే సీజన్‌లో 1,40,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరిం చాలని లక్ష్యంగా పెట్టుకోగా ముగింపు కొచ్చేసరికి అది కాస్తా 78,334 మెట్రిక్ టన్నులకే పరిమితమైంది. ఈ ఏడాది నిర్దేశించుకున్న లక్ష్యమే అతి స్వల్పంగా 78,000 టన్నులు కాగా అంతా కలిపి 26,500 దగ్గరే సేకరణ ముగి సిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. వాస్తవానికి మొ త్తం దిగుబడి దాదాపు జిల్లాలో మూడున్నర లక్షల మెట్రిక్ టన్నులపైనే ఉండే అవకాశం ఉంది. అంటే దిగుబడిలో పదిశాతం కూడా మద్దతు ధరకు అన్నదాతల నుంచి ధాన్యం సేకరించలేని దురవస్థలో ప్రభుత్వం ఉంది.

బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుని..

అలవిమాలిన నిబంధనలకు తోడు డబ్బులు చెల్లింపులో ఎడతెగని జాప్యం వల్లే అన్నదాతలు ధర తక్కువైనా దళారులను ఆశ్రయించి నిలువునా వంచనకు గురవు తున్నారు. మిచౌంగ్ తుఫాన్ వల్ల భారీగా నష్టపోయిన అన్నదాతలను ఆదుకోవడానికి తేమ, రంగుమారిన ధాన్యం కొనుగోలు విషయంలో ఉదారంగా వ్యవహరి స్తామని ప్రభుత్వం చెప్పిన మాటలు ఉత్తమాటలుగానే మిగిలిపోయాయని క్షేత్రస్థాయి పరిస్థితులు చెబుతున్నా యి. సడలించిన నిబంధనల ఆధారంగా అన్నదాతల వద్ద కనీసం వెయ్యి టన్నుల ధాన్యాన్ని కూడా అధి కారులు సేకరించిన దాఖలాలు లేవు. మిచౌంగ్ తుఫాన్ వల్ల తీసి కట్టుగా వేసుకున్నా కనీసం పదివేల టన్నుల ధాన్యం డ్యామేజీ అయిందనేది అధికారుల అంచనా. అందులో కనీసం పదిశాతం ధాన్యం కూడా ఆర్‌బీకేల వద్దకు చేరలేదు.

మూడువారాల్లో నగదు జమ అనేది ప్రగల్భాలే...!

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసిన మూడు వారాల్లోపే అన్నదాతల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామనే ప్రగల్భాలుగానే మిగిలిపోతున్నాయి తప్పితే ఆచరణలో అమలు అవుతున్న దాఖలాలు మచ్చుకైనా కనబడడం లేదు. ఇంకా దాదాపు 1,200 మంది రైతులకు సంబంధించి రూ.8 కోట్లు బకాయిలు ఉన్నట్లు సమాచారం. వీరంతా ధాన్యాన్ని ఆయా రైతుభరోసా కేంద్రాలలో అమ్మి ఇప్పటికే నాలుగు వారాలు గడవగా ఇంకా వారి ఖాతాల్లో డబ్బు జమ కాలేదు.

దిగుబడులు తగ్గిపోయి..

మిచౌంగ్ తుఫాన్ ధాటికి అంచనా వేసిన దిగుబడుల్లో దాదాపు సగం తగ్గిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి విపత్తుకు తోడు ఈ ఏడాది పెట్టుబడి ఖర్చులు కూడా రెట్టింపయ్యాయని వాపోతున్నారు. ధాన్యాన్ని ఆర్‌బీకేలకు తీసుకెళ్లి మరీ నిబంధనల చిట్టా చూసి భయపడిపోయి అయిన కాడికి బయటే ధాన్యాన్ని అమ్ముకున్నామని రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. మరోవైపు తుఫాన్ పరిహారం సంక్రాంతి లోపు ఇస్తామన్నారని ఇప్ప టివరకు అతీగతి లేదని కనీసం అది అందినా ఎంతో కొంత ఉపయోగకరంగా ఉండేదని రైతులు చెబుతున్నారు.

- పాత పనులకు పాతర... కొత్త పనుల ఊసేలేదు
- నిధులివ్వని వైసీపీ ప్రభుత్వం... మధ్యలోనే ఆగిన పనులు
- అధ్వానంగా రోడ్లు, వంతెనలు
- గత టీడీపీ సర్కారు కాలంలో నిధుల మంజూరు
- వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఒక్కపైసా విదిలించింది లేదు
- బిల్లుల పెండింగ్‌తో పాత పనులు చేయలేమని చేతులెత్తేసిన కాంట్రాక్టర్‌లు
- కొత్త పనులకు నిధుల మంజూరు లేనేలేదు

తెనాలి, ఫిబ్రవరి 13, (ఆంధ్రజ్యోతి): గత దశాబ్దకాలంలో జరగనన్ని రోడ్డు ప్రమాదాలు ఈ నాలుగేళ్లలోనే జరిగాయని ఆయా శాఖలు ఇచ్చిన నివేదికలు ఇస్తున్నాయి. కొత్త రోడ్ల నిర్మాణం అటుంచితే, పాతవాటికి పాతరేయడంతో రోడ్లపై తిరుగుతున్న జనం నడ్డి విరుగుతోంది. ప్రభుత్వం అనేక రూపాల్లో ఇస్తున్న సంక్షేమం డబ్బంతా వైద్యానికే సరిపోతుందంటూ ప్రతిపక్షాలూ ఎద్దేవా చేస్తున్నాయి. కాగ్ ఇటీవల ఇచ్చిన నివేదికలో గత ప్రభుత్వ కాలంలో మంజూరు చేసిన పనుల పురోగతి, కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఇచ్చిన నిధుల పురోగతిపై నివేదిక



తెనాలి వీఎస్‌ఆర్ కళాశాల ఎదుట రహదారి దుస్థితి

ఇచ్చింది. పాత పనులు అటుంచితే, 2023లో మంజూరుచేసిన నిధులకు సంబందించిన పనులు కూడా కేవలం 5 నుంచి 15 శాతంలోపే పూర్తికావటం విశేషం.

తెనాలి -విజయవాడ రోడ్డు పనులు హుష్..

తెనాలి- మంగళగిరి ప్రధాన రహదారి వెంట గోడల నిర్మాణం, రోడ్డు మరమ్మతులకోసం 2017లో రూ.46 కోట్లు కేటాయించారు. దీనితో రోడ్డుకు ఇరువైపులా తూర్పు, నిజాంపట్నం కాల్వల వెంట గోడలు నిర్మించాల్సి ఉంది. అయితే గోడల నిర్మాణం 2022వరకు చేసిన కాంట్రాక్టర్లు అప్పటి నుంచి బిల్లులు రాకపోవటంతో పనులు చేయటానికి చేతులెత్తేశారు. మంజూరు చేసిన పనుల్లో రూ.25కోట్ల వరకు పనులు మాత్రం పూర్తయ్యాయి. మొత్తంమీద కేవలం 2.8 కి.మీటర్ల పొడవున గోడలు, రోడ్డు అభివృద్ధి చెయ్యాల్సిఉంది. కానీ తెనాలి నుంచి మంగళగిరి మధ్య 1.5 కి.మీ నుంచి 3.8 కి.మీ మధ్య కేవలం 200 మీటర్ల వరకు మాత్రమే పని పూర్తిచేశారు. అయితే గతంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులే భారీగా పెండింగ్ ఉండటంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. ఇదే రోడ్డు నందివెలుగు నుంచి రేవేంద్రపాడు వరకు గోడలు, రోడ్డు అభివృద్ధికి రూ.264 కోట్లు మంజూరు చేస్తూ సీఎం అంగీకరించారని జగన్ సర్కారు వచ్చిన రెండు నెలలకు తెనాలి, మంగళగిరి ఎమ్మెల్యేలు విలేకరుల సమావేశం పెట్టిమరీ ఆర్భాటంగా ప్రకటించారు. ఆ నిధులు ఇప్పటివరకు ఏమయ్యాయో తెలియదు. రోడ్డు అభివృద్ధి అటుంచితే, నందివెలుగు- రేవేంద్రపాడు మధ్య రోడ్డు దారుణంగా తయారైంది. గుంతలుపడి, కుంగి, వాహనాలు కాలువలలోకి దూసుకు పోతున్న పరిస్థితి. గతంలో కార్లు కాల్వలోకి బోల్తాకొట్టి పదుల సంఖ్యలో ప్రాణాలు పోయిన పరిస్థితి ఉంది. రూ.264 కోట్లతో అభివృద్ధి అటుంచితే, అసలు మరమ్మతులకు కూడా దిక్కులేకుండా పోయింది. ఇదే రహదారి వెంట ప్రజాప్రతినిధులు వెళుతూనే ఉంటారు. వి.ఎస్.ఆర్ కళాశాల దగ్గర నుంచి ఆటో నగర్ వరకు రోడ్డు తూర్పు కాల్వవైపు పూర్తిగా దెబ్బతింది. మధ్యలో డివైడర్‌లు ఉండటంతో విజయవాడ నుంచి తెనాలి వైపునకు వచ్చే ప్రజాప్రతినిధులు తమ వాహనాలను నిబంధనలకు విరుద్ధంగా కుడివైపు రోడ్డుపైకి మళ్లించటం విశేషం. దుగ్గిరాల- రేవేంద్రపాడు మధ్య ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేనంత దారుణంగా రోడ్డు తయారైందంటే దీనిపై శ్రద్ధ ఏపాటిదో అర్థమవుతుంది. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రాజీనామా చేసిన తర్వాత ఇదే రోడ్డుపై ప్రస్తావన కూడాచేశారు. కనీసం దుగ్గిరాల వరకు రోడ్డుకూడా వేయలేకపోయానని, ఇది సిగ్గుగా ఉందని చెప్పారంటే ప్రభుత్వ వైఫల్యం ఏమేర ఉందనేది అర్థమవుతుంది.

చేబ్రోలు బ్రిడ్జికి గ్రహణం వీడేనా!

కొమ్మమూరు కాల్వపై చేబ్రోలు దగ్గర హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి 2019లోనే రూ.25కోట్లు మంజూరు చేశారు. ఈ వంతెన బ్రిటిష్ కాలంనాటిది కావటం, అప్పటినుంచి తాత్కాలిక మరమ్మతులు చేసుకుంటూవచ్చినా, శిథిల స్థితికి చేరుకోవటం, హైలెవల్‌లో ఉండటంతో భారీ వాహనాలు అదుపుతప్పి కాల్వలోకి దూసుకుపోవటం వంటి ఘటనలు చాలానే జరిగాయి. అప్పట్లో ఈ పాత వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించాలి. అయితే అప్పట్లో జల రవాణా కింద ప్రధాన కాల్వ కింద ఇది ఉండటంతో నీటిపారుదల శాఖ అభ్యంతరం చెప్పింది. ఒకవేళ నిర్మిస్తే జల రవాణాకు సంబంధించి కాల్వ ఎంత వెడల్పు చేయాలనే ప్రతిపాదన ఉందో అంత వెడల్పు, కేంద్రం సూచించిన ఎత్తులో వంతెన నిర్మించుకుంటే అభ్యంతరం లేదని తేల్చి చెప్పటం, ఆ ప్రతిపాదనలు మళ్లీ రివైజ్ చెయ్యాల్సిరావటంతో అత్యవసరం కింద ప్రస్తుతం రూ.50 లక్షలతో ఇనుప గడ్డర్ల సాయంతో బయిలీ వంతెన నిర్మించాలని ఆర్‌అండ్‌బీ నిర్ణయించింది. దీనికోసం అప్పట్లో ఇనుప గడ్డర్లు తీసుకొచ్చినా వాటినీ నిర్మించకుండా వదిలేశారు. అప్పటి నుంచి దీని నిర్మాణానికి కొర్రీలు పడుతుండటం, జగన్ సర్కారు వచ్చాక కొత్త వంతెన నిర్మించటానికి 2023లో రూ.35కోట్లు మంజూరు చేయటం జరిగిపోయాయి. అయితే ఈ నిధులతో పనులు మొదలుపెడితే, మళ్లీ నీటిపారుదల శాఖ అభ్యంతరం వ్యక్తం చేసింది. అయితే ఈసారి కాంట్రాక్టర్ నీటిపారుదల శాఖ అభ్యంతరాలను తోసిపుచ్చి నిర్మాణ పనులను మొదలుపెట్టేసింది. అయితే రెండువైపులా నాలుగు పిల్లర్లు వేసి, పనులు చేస్తున్నామనిపిస్తున్నారు. దీనికోసం ఏకంగా బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని రైతుల పంటలకు నీటిని, తాగునీటిని ఆపేసి మరీ పనులు చేపట్టారు. అప్పట్లో రైతులు ఆందోళన చేయటంతో చివరకు పనులు మధ్యలోఆపి, నీటిని వదిలారు. ఇప్పుడు ఖరీఫ్ చివరి దశకుచేరి, రబీ సాగుకు నీటిని ఆపేశారు. దీనికితోడు పాత వంతెనకు అటో, ఇటో కొత్త వంతెన నిర్మించటం సహజం. అయితే అక్కడ ఇబ్బందులు, సాధ్యాసాధ్యాలను పరిశీలించాకే నిర్మాణ పనులు మొదలుపెడతారు. కానీ ఇక్కడ పొన్నూరు ఛానల్ ఉంటే, దాని కల్వర్టును మూసేసి మరీ వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. ఈ కాల్వ ద్వారా పొన్నూరు మండలంలోని 8 గ్రామాల పరిధిలోని పొలాలకు నీరు అందుతుంది. ఈ కాల్వను పూర్తిగా మూసేశారు. అయితే దీనిపై నీటిపారుదల శాఖ మాత్రం ఏ అభ్యంతరం చెప్పకుండా, రైతులు గోలపెడుతున్నా పట్టించుకోకుండా వదిలేసింది. వంతెన నిర్మాణానికి అన్ని రకాల అనుమతులు తీసుకోకపోవటం, నిర్మాణ సమయంలో ఇతర ఇబ్బందులను పట్టించుకోకపోటం విశేషం. 2023లో రూ.35 కోట్లు మంజూరుచేసినా పనులు మాత్రం భూమిలో పిల్లర్ల వరకే పరిమితమయ్యాయి. ఈ వంతెన విషయంలోనూ గందరగోళ పరిస్థితులు నెలకొన్నా అన్నీ గాలిలో పెట్టేశారు. అన్నీ లోపభూయిష్టంగా తయ్యాయి.



అంగలకుదురు-దండమూడి మధ్య సగం పనులు జరిగితే అదికూడా ప్రస్తుతం గుంతలతో మారిన చిత్రం



తెనాలి-విజయవాడ రోడ్డులో ఆటోనగర్ దగ్గర మూడేళ్ల క్రితం గోడలు నిర్మించి రోడ్డు పనులు చేయకుండా వదిలేసిన చిత్రం

గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా..

గత ప్రభుత్వ కాలంలో గుంటూరు, బాపట్ల జిల్లాల్లో పలు రోడ్లకు భారీగానే నిధులు మంజూరు చేసింది. తెనాలి మండలం అంగలకుదురు నుంచి పొన్నూరు మండలం దండమూడి మధ్య రోడ్డు 8.7 కి.మీటర్లు వేసేందుకు 2017లో రూ.10 కోట్లు మంజూరు చేశారు. అంగలకుదురు నుంచి చుండూరు మండలం వలివేరు అవతల వరకు 8.7 కి.మీటర్ల మేర రోడ్డు నిర్మించాల్సి ఉంది. అయితే దీనిలో ఇప్పటి వరకు కేవలం 51 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఐదేళ్ల క్రితం 5 కి.మీ తారురోడ్డు వేసి వదిలేశారు. ఆ తర్వాత ప్రస్తుత సీఎం జగన్ పర్యటన ఉండటంతో వలివేరు దగ్గర కొంతమేర బి.ఎం మిక్స్‌తో రోడ్డు వేసి చేతులు దులుపుకొన్నారు. అయితే ఈ పనులకు మరో బిల్లు నొక్కేశారు. ఇంకా సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణం ఉంటే వాటిని వదిలేశారు. తెనాలి నుంచి చందోలు వెళ్లే రోడ్డు వేయటానికి 2017లో రూ.8 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో అమృతలూరు మండలంలోని మండూరు వంతెన దగ్గర నుంచి పెదపూడి వంతెన వరకు నిజాంపట్నం కాల్వలోకి రోడ్డు కుంగి ఊబిలోకి దిగిపోయింది. యలవర్రు వంతెన దగ్గరా రోడ్డు దెబ్బతినిపోయింది. రోడ్డుకు ఇరువైపులా తూర్పు కాల్వ, నిజాంపట్నం కాల్వలు ఉండటంతో కాల్వల అంచుల వెంట గోడ నిర్మించాల్సిఉంది. దీనిలో ఇప్పటివరకు కేవలం రూ.3.5 కోట్ల పనులు మాత్రమే చేయగలిగారు. కొద్దిమేర గోడ నిర్మించారు. మరికొంత తారు రోడ్డు వేశారు. అయితే పూర్తిస్థాయిలో పనులు పూర్తిచేయటానికి అవసరమైన మిగిలిన నిధులను వైసీపీ సర్కారు మంజూరు చేయకపోవటంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో లారీల దగ్గర నుంచి కార్లవరకు మార్గంలో కాల్వలోకి బోల్తాపడుతున్నాయి. రెండు కి.మీ మేర రోడ్డు మధ్యకు బద్దలుగా పగిలిపోయి భూకంపం వచ్చిన ప్రాంతాల్లో ఉన్న ట్టుగా కిందికి కుంగిపోయింది. ఇంతటి ప్రమా దకరంగా ఉన్నా జగన్ సర్కారు మాత్రం వీటిగోడు పట్టించుకున్నదే లేదు. పొన్నూరు మండలం నిడమర్రు నుంచి అమృతలూరు మండలం ప్యాపర్రు వరకు రోడ్డు అభివృద్ధి కోసం రూ.2.5 కోట్లు కేటాయించారు. ఈపనులు 2023 నాటికే పూర్తి కావలసి ఉంటే ఇప్పటికి 5 శాతం పనులు కూడా పూర్తికాలేదు.దీనికీ నిధుల గ్రహణమే.



ఫుట్‌పాత్‌లు అధ్వానం

ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం అడ్మిషన్లు

- జిల్లా విద్యాశాఖాధికారి నారాయణరావు

బాపట్ల, ఫిబ్రవరి 13: జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఉన్నత పాఠశాలలో 25శాతం 1వ తరగతి విద్యార్థుల అడ్మిషన్‌ల కోసం సీట్లు కేటాయించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి నారాయణరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి జిల్లాలోని అన్ని మండల విద్యాశాఖాధికారి కార్యాలయాలలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. ఎవరికైన సందేహాలు ఉంటే హెల్ప్‌లైన్ నెంబరు 14417 నెంబర్‌లో సంప్రదించాలన్నారు. హెచ్ఐవీ ఎఫెక్టెడ్ చిల్డ్రన్స్‌కు 5శాతం, షెడ్యూల్ కులాలకు 10శాతం, షెడ్యూల్ తెగలకు 4శాతం, వీకర్ సెక్షన్, బలహీనవర్గాలు, మైనార్టీలు, అగ్రవర్ణాలవారికి 6శాతం చొప్పున మొత్తం 25శాతం సీట్లు కేటాయించటం జరిగిందన్నారు. రూరల్ పరిధిలో రూ.లక్షా20వేల ఆదాయం, పట్టణ పరిధిలో రూ.లక్షా44వేల లోపు ఆదాయం ఉన్నవారు అర్హులు అన్నారు. అడ్మిషన్ కొరకు పేరెంట్, విద్యార్థి ఆధార్‌కార్డు, ఓటరు ఐడీ కార్డు, ఎలక్ట్రిసిటీ బిల్లు, డ్రైవింగ్ లైసెన్స్, బియ్యం కార్డు, తహసీల్దార్ ధ్రువీకరణ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సర్టిఫికెట్‌తో సీఎస్ఈ పోర్టల్ దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పర్చూరు వైసీపీ ఇన్‌చార్జి బాలాజీ..!

- శుక్రవారం సీఎం జగన్‌ను కలవనున్న బాలాజీ
- ఆ రోజే అధికారికంగా ప్రకటన వెలువడే అవకాశం

చీరాల, ఫిబ్రవరి 13: వైసీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా యడం బాలాజీ పేరు ఖరారైనట్లు తెలిసింది. ప్రస్తుతం అమెరికాలో ఉన్న బాలాజీ అక్కడినుంచి వచ్చి శుక్రవారం సీఎం జగన్‌తో భేటీ కానున్నట్లు తెలిసింది. అందుకు సంబంధించి వైసీపీ ముఖ్య నాయకులు బాలాజీతో మాట్లాడినట్లు విశ్వసనీయ సమాచారం. వైసీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ప్రస్తుతం కొనసాగుతున్న చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ఆ నియోజకవర్గం నుంచి పోటీ చేయనని కాడికిందపడేసిన విషయం తెలిసిందే. అంతకంటే ముందుగానే అక్కడ కాపు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని అభ్యర్థిగా నిలపాలనేది సీఎం జగన్ నిర్ణయంగా ప్రచారం జరిగింది. ఈ క్రమంలో చీరాలకు చెందిన ఎన్‌ఆర్‌ఐ బాలాజీ పేరును అధిష్ఠానం పరిగణలోకి తీసుకున్నట్లు తెలిసింది. బాలాజీ గతంలో చీరాల నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి పోటీచేసి ఓటమి చవిచూశారు. తరువాత టీడీపీలో చేరి చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పనిచేశారు. ఆ తరువాత ఎం.ఎం కొండయ్య టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో బాలాజీ స్తబ్దుగా ఉన్నారు. అయితే పార్టీ ని వీడలేదు. తాజాగా బాలాజీకి వైసీపీ నుంచి ఆహ్వానం అందినట్లు తెలిసింది.

ఆమంచిగా.. ముంచేసి..!

- పర్చూరు వైసీపీ ఇన్‌చార్జిని తప్పించే ఆలోచనలో పాలకపార్టీ

- యడం బాలాజీని నియమించే అవకాశం!
- పార్టీని భ్రష్టుపట్టించారని వైసీపీ శ్రేణుల ఆవేదన
- ఓట్ల అక్రమాల విషయంలో బజారున పడ్డ పార్టీ పరువు
- అధికారులను బలిచేశారు.. సొంతపార్టీ శ్రేణులపైనే కక్ష
- ఎంచక్కా దుకాణం సర్దేస్తున్నారని వైసీపీ కార్యకర్తల మండిపాటు

బాపట్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గతేడాది ఫిబ్రవరిలో ఆ నేత పర్చూరు నియోజకవర్గానికి వైసీపీ ఇన్‌చార్జిగా వచ్చారు.. ఇక అంతే అప్పటినుంచి ఆయన తనదైన శైలిలో రాజకీయం చేయడం ప్రారంభించారు. ముఖ్యంగా ఓట్ల అవకతవకల విషయంలో ఇక ఆయన అడుగులకు మడుగులొత్తిన పాపానికి నలుగురు పోలీసులు సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇక ఎంతోమంది రెవెన్యూ ఉద్యోగులు ఈసీ ముందు పలు సందర్భాల్లో వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. కొంత మంది ఆ నేత ఒత్తిడి భరించలేక గుండెపోట్లు తెచ్చుకొని సెలవుమీద వెళ్లిన సందర్భాలూ ఉన్నాయి. ఇక ఓ సామాజిక వర్గాన్ని ఉద్దేశిస్తూ ఆ నేత చేసిన దుందుడుకు వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా వైసీపీకి నష్టం చేకూర్చాయి. సొంత పార్టీల నేతలను సైతం కేసుల్లో ఇరికించి వికృతానందం పొందారు. తాపీగా తాను అక్కడనుంచి పోటీ చేయడం లేదని తేల్చేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ ఏడాది కాలంలో పార్టీని నష్టపరిచి సర్దుకుని పలాయనం చిత్తగిస్తున్నారన్న మాటలు వైసీపీ శ్రేణుల నుంచే వినపడుతున్నాయి.

పార్టీని డ్యామేజీ చేశారు...

పర్చూరులో సదరు నేత చర్యల వల్ల రాష్ట్రవ్యాప్తంగా పార్టీకి డ్యామేజీ జరిగిందని వైసీపీ పెద్దలు నిర్ణయానికి రావడంతో మార్పు దిశగా చర్యలు చేపట్టారని తెలుస్తోంది. ఆ నేత తాను అక్కడ నుంచి పోటీ చేయనని, చేస్తానని పలుమార్లు తాడేపల్లి పెద్దలను సైతం గందరగోళానికి గురి చేశారన్న విమర్శ ఉంది. ఈ మొత్తం ఎపిసోడ్‌లో ఆరంభం నుంచి పర్చూ రులో అతని నియామకాన్ని వ్యతిరేకిస్తూ వచ్చిన ఉమ్మడి ప్రకాశానికి చెందిన మాజీ మంత్రి అభీష్టానికి అనుగుణంగానే ఆ నేతను తప్పించి బాలాజీకి అవకాశం ఇవ్వనున్నారని తెలుస్తోంది.

అంతా అయిపోయాక ఇప్పుడెందుకు..

పర్చూరు నియోజకవర్గంలో వైసీపీకి దింపుడు కళ్లెం ఆశలు తప్ప ఇంకేమి మిగలలేదని దీనంతటికి కారణం సద రు నేతేనన్న ఆగ్రహంతో వైసీపీ శ్రేణులు ఉన్నాయి. తొలి నుంచి ఆ నేత అరాచకాలను పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లినా వారికీ వాటాలు వెళ్లడంతో కిమ్మనకుండా ఉన్నారని, ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ మార్పు చేయడం వల్ల ఉపయోగం ఏమిటనే ప్రశ్నను వైసీపీ ద్వితీయశ్రేణి నేతాగణం పార్టీ పెద్దలకు సంధిస్తోంది.

వెళ్లిపోవచ్చు.. అభ్యంతరం ఏమీలేదు..

సదరు నేత బాపట్ల జిల్లాలోని ఇంకో నియోజకవర్గంలో తనకు పోటీకి అవకాశం కల్పించాలని తాడేపల్లి పెద్దల వద్ద గతంలోనే ప్రతిపాదనలు పెట్టారు. అప్పటికే అతని చర్యలతో విసిగిపోయి ఉన్న అధిష్ఠానం పార్టీలో మరెక్కడా సీటు కేటాయించే పరిస్థితి ప్రస్తుతం లేదని, చేసిన నష్టం చాలని అన్నట్లు సమాచారం. పార్టీలోనే ఉండి చికాకులు సృష్టించవద్దని ఇష్టముంటే ఉండొచ్చని లేకుంటే పార్టీని వీడినా ఎలాంటి అభ్యంతరం లేదని తాడేపల్లి పెద్దలు సదరు నేతకు తేల్చి చెప్పినట్లు సమాచారం.

కాలూచెయ్యి కూడదీసుకుని..

సదరు నేత అక్రమ వసూళ్లతో ఏడాది కాలం నుంచి గ్రానైట్ వ్యాపారులు బెంబేలెత్తిపోయారు. ప్రస్తుతం సదరు నేతను అక్కడ నుంచి తప్పిస్తున్నారన్న వార్తతో వారంతా ఊపిరి పీల్చుకుంటున్నారు. ఆ నేత చర్యలతో చతికలబడిపోయామని మళ్లీ ఇప్పుడు కాలూచెయ్యి కూడదీసుకుని వ్యాపారాన్ని బతికించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పడం కొసమెరుపు. వీరితో పాటు అక్కడ పనిచేస్తున్న యంత్రాంగం సైతం ఇన్ని రోజులూ తీవ్ర ఒత్తిడికి గురయ్యామని ఇకపై ఆ బాధ ఉండదని చెప్పడం సదరు నేత ఆగడాలకు అద్దం పడుతోంది.

బాబాయ్ పాలానికి..రోడ్డేశారు..

- రూ.30లక్షలు గుండ్లకమ్మ పాలు
- వైవీ సుబ్బారెడ్డి పొలానికి తారురోడ్డు వేసిన అధికారులు

మేదరమెట్ల, ఫిబ్రవరి 13: గుండ్లకమ్మ ముంపు గ్రామాల్లో పునరావాసాన్ని గాలికొదిలేసిన అధికారులు సీఎం బాబాయి ప్రాపకం కోసం ఏకంగా ముంపులోనే తారురోడ్డు వేసేశారు. మరోవైపు గత పదేళ్లుగా ఆయన తండ్రి పేరుతో చేపట్టిన యర్రం చినపోలిరెడ్డి కొరిశపాడు ఎత్తిపోతల పథకం ముంపు గ్రామమైన తూర్పుపాలెంలో కనీసం రోడ్లు కూడా నిర్మించలేదని గ్రామస్థులు ఎప్పటికప్పుడు ఆందోళన చేస్తున్నారు. ముంపు గ్రామాల్లో కనీస సౌకర్యాలైన మరుగుదొడ్లు, రోడ్లు నిర్మించడానికి మాత్రం అధికారులకు నిబంధనలు అడ్డువచ్చాయి. అయితే గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో రోడ్డు నిర్మాణానికి మాత్రం అవేమీ అడ్డురాకపోవడం గమనార్హం.

వివరాల్లోకి వెళితే.. బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం అనమనమూరు గుండ్లకమ్మ ముంపు గ్రామం. గుండ్లకమ్మ నది ఒడ్డున ఉన్న ఈ గ్రామంలో మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కుటుంబానికి సుమారు 120 ఎకరాల భూమి ఉంది. అందులో చాలావరకు ముంపు కింద పోగా సుమారు 25 ఎకరాల దాకా వైవీ కుటుంబానికి మిగిలింది. అయినా సరే ఈ 120 ఎకరాల చుట్టూ ఫెన్సింగ్ వేసి గేట్లు ఏర్పాటు చేశారు. ఫామ్ హౌస్ నిర్మించుకుని ఏదో ఒక పంట సాగు చేస్తూనే ఉన్నారు. అనమనమూరు నుంచి



సుబ్బారెడ్డి పొలానికి వేసిన తారురోడ్డు

మణికేశ్వరం గ్రామానికి గతంలోనే తారురోడ్డు ఉంది. ఇప్పుడు కొత్తగా వైవీ సుబ్బారెడ్డి పొలానికి సుమారు 1.5 కిలోమీటర్ల పొడవున తారురోడ్డు నిర్మించారు. అనమనమూరు అంకమ్మ తల్లి గుడి వద్ద నుంచి సుబ్బారెడ్డి పొలం గేటు వరకు వెళ్లి అక్కడ నుంచి అనమనమూరు రోడ్డులో కలుస్తుంది. మధ్యలో ఎటువంటి నివాసాలు లేవు. ఈ తారురోడ్డు నిర్మాణంలో సుమారు అర కిలోమీటర్ కు పైగా గుండ్లకమ్మ ముంపులోనే వేశారు. దాదాపు రెండేళ్ల పాటు ఉపాధి కూలీలు పనిచేసి రోడ్డు నిర్మించినట్లు అధికారులు బోర్డులు వేశారు.



ఇక్కడ రోడ్డు కోసం కూలీలు పనిచేసిన దాఖలాలు లేవని, యంత్రాలతోనే రోడ్డు నిర్మాణం చేశారని అనమనమూరు గ్రామస్థులు తెలుపుతున్నారు. ముంపులో తారు రోడ్డు నిర్మించాలని పంచాయతీ తీర్మానం చేయడం, ఎటువంటి పరిశీలన లేకుండానే ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు రోడ్డు నిర్మాణానికి ఉత్తర్వులు ఇవ్వడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ముంపులో రోడ్డు నిర్మించడమే కాకుండా మెటల్, తారు వేయడం ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులతోపాటు జిల్లా అధికారులకు కూడా తెలుసని గ్రామస్థులు అంటున్నారు. కాగా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు పనులు చేపట్టినట్లు తెలుస్తోంది. వైవీ సుబ్బారెడ్డి మెప్పుకోసం పంచాయతీ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు పోటీపడినట్లు కనిపిస్తోంది. ముంపులో రోడ్డు నిర్మించిన అధికారులపై ఉన్నతాధికారులు ఏమి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సి ఉంది.

మీరు సిద్ధమేనా?

అతి ధీమా వద్దు.. అప్రమత్తతతో ముందుకు సాగండి

కలిసొచ్చే వారందరినీ కలుపుకోండి

ఎవరినీ అశ్రద్ధ చేయొద్దు

మాజీ ఎమ్మెల్యేలు దామచర్ల, ఉగ్ర, కందులకు బాబు సూచన

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

రానున్న ఎన్నికల సమరానికి సిద్ధమైన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పోటీచేసే అభ్యర్థులకు దిశ, దశ నిర్దేశిస్తున్నారు. ఆ మేరకు ఆయా నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జిలను పిలిపించుకుని నియోజకవర్గాలలో జరిగే లోటుపాట్లను వారి దృష్టికి తెచ్చి సవరించుకోవాలని కూడా సెలవిస్తున్నారు. అప్రమత్తంగా ఉండండి, అందరినీ కలుపుకు పోండని సూచిస్తున్నారు. ఆ మేరకు మంగళవారం రాత్రి జిల్లాలోని ఒంగోలు, కనిగిరి, మార్కాపురం నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జిలు దామచర్ల జనార్దన్, డాక్టరు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డిలతో చంద్రబాబు భేటీ అయ్యారు. ఆయా నియోజకవర్గాల్లో ఉన్న తాజా పరిస్థితులను నాయకుల లోటుపాట్లపై తన వద్ద ఉన్న సమాచారాన్ని విప్పిచెప్పినట్లు తెలిసింది. విజయంపై అతి ధీమా కాదు ఆత్మవిశ్వాసంతో సరైన ప్రణాళికతో ముందుకుపోవాలని సూచించారు. జనసేన వారిని ఎలా కలుపుకొని పోవాలి అనే విషయాన్ని సవివరంగా చెప్పారు. ఇంకా పార్టీశ్రేణుల్లో ఏదో ఒక విషయంలో అలకతో ఉన్నవారిని పిలిచి మాట్లాడాలని సూచించినట్లు తెలిసింది. ఒంగోలు నియోజకవర్గంలో పరిస్థితులను ఆయన వివరిస్తూ పార్టీలో కొందరు నాయకులు దూరంగా ఉన్నారు, వారందరినీ పిలిచి మాట్లాడుకోండి ఏ ఒక్క చిన్న అవకాశాన్నీ వదల వద్దని సూచించినట్లు తెలిసింది. కనిగిరి విషయంపై మాట్లాడుతూ ఎదుటి అభ్యర్థి బలహీనుడనే నమ్మకంతో ముందుకు సాగకుండా పోటీలో ఎవరు ఉన్నా మన గెలుపే ముఖ్యం అన్నట్లుగా ముందుకు సాగాలని సూచించారు. మార్కాపురం నియోజకవర్గంలో మారుతున్న రాజకీయ పరిస్థితులను వివరిస్తూ తదనుగుణంగా ఆయా ప్రాంతాల వారీ తీసుకోవాల్సిన చర్యలను వివరించినట్లు తెలిసింది. ఈ ముగ్గురు నాయకులతో విడివిడిగా తొలుత భేటీ అయిన ఆయన ఎన్నికల సన్నాహం గురించి ముందుగా తెలుసుకున్నట్లు సమాచారం. పార్టీకి అనుకూలమైన వాతావరణం ఉంది, దానిని సద్వినియోగం చేసుకుని ముందుకు సాగితేనే ఆశించిన ఆధిక్యత లభిస్తుందని చెప్పారు. ఆయా నియోజకవర్గాలలో ఇంకా చురుకుగా పనిచేయని టీడీపీ నాయకుల గురించి ప్రస్తావిస్తూ వారితో పాటు ఆయా సామాజికవర్గాలకు సంబంధించి తటస్థంగా ఉన్న నాయకులను కలుపుకొని పోవాల్సిన అవసరాన్ని కూడా తెలియజేసినట్లు తెలుస్తోంది.

లోక్‌సభకు దీటైన అభ్యర్థి

ప్రధానంగా లోక్‌సభ అభ్యర్థి విషయాన్ని కూడా ప్రస్తావిస్తూ 'దీటైన అభ్యర్థినే రంగంలోకి పంపుతాం. ఆ అభ్యర్థి ద్వారా మీమీ ప్రాంతాల్లో ఎలాంటి అవకాశాలు కలిసొస్తాయో తెలుసుకుని తదనుగుణంగా ముందడుగు వేయాలి. అధికారపార్టీ నేతల ఆగడాలను, వారి వ్యవహారశైలిని ఎన్నికల ఎత్తుగడలను ఎప్పటికప్పుడు గుర్తించి గట్టి సమాధానం ఇస్తూ ముందుకు సాగాలి. అన్ని వనరులు వినియోగించండి, రాష్ట్ర పార్టీ నుంచి ఇవ్వాల్సిన చేయూతనిస్తాం. ఎన్నికలు మార్చిలో అనుకున్నాం, ఏప్రిల్‌కు పోయే అవకాశం ఉంది. ఈ సమయంలో మరికొన్ని మార్పులూ జరగవచ్చు. భవిష్యత్తులో మీతోపాటు కిందిస్థాయి వరకు పార్టీకోసం పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు అండగా మనం నిలుస్తాం. పాలనాపరమైన వ్యవహారాల్లోను వారికి అవసరమైన చేదోడుగా ఉంటాం. ఆ విషయంలో ఎలాంటి అనుమానాలు పెట్టుకోకుండా ద్వితీయస్థాయి నాయకులు, కార్యకర్తల్లో మనోధైర్యాన్ని కల్పించి ముందుకు తీసుకెళ్లాలి' అని చెప్పినట్లు తెలుస్తోంది. గతంలో జరిగిన తప్పొప్పులను పక్కనపెట్టి భవిష్యత్తులో మనపరంగాను, పార్టీపరంగాను నాయకులు, కార్యకర్తలకు అండగా ఎలా ముందుకు పోబోతున్నామో స్పష్టంగా వివరించి మనోధైర్యాన్ని పెంచాలని సూచించారు. ఎప్పటికప్పుడు నియోజకవర్గాల్లో పరిస్థితిని సమీక్షించి రాష్ట్ర పార్టీ నుంచి అవసరమైన సూచనలు ఇస్తామని, వాటిని పాటించాలని స్పష్టంగా చెప్పినట్లు సమాచారం. జిల్లాలో జనసేనతో ఉండే రాజకీయ సంబంధాలపై కూడా ఒక స్పష్టతనిస్తూ ధైర్యంగా ముందుకు సాగండని కూడా చెప్పినట్లు కూడా తెలుస్తోంది.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు 8 ప్రాజెక్టులు ఎంపిక



ప్రతిభచూపిన విద్యార్థులతో డీఈవో, అధికారులు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 13 : స్థానిక ఆగ్జీలియం ఇంగ్లీషు మీడియం స్కూలులో మంగళవారం నిర్వహించిన ఇన్‌స్పైర్ 2022-23 వైజ్ఞానిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ప్రదర్శనను జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర ప్రారంభించి ఎగ్జిబిట్‌లను తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్ పట్ల అభిలాషను పెంచాలన్నారు. సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి ప్రదర్శనలు దోహదపడుతాయన్నారు. మొత్తం 79 ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. వీటిలో ఎనిమిది ఉత్తమ ఎగ్జిబిట్స్‌ను చిత్తూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేశారు.

కూలీల ఆటో బోల్తా.. ఒకరు మృతి

ముండ్లమూరు, ఫిబ్రవరి 13 : మండలంలోని పూరిమెట్ల సమీపంలో మిరపకాయల కూలీల ఆటో బోల్తా పడటంతో ఉయ్యాల ఏసురాజు(22) తీవ్ర గాయాలై ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మిగతా ఎనిమిది మంది కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. మండలంలోని సింగనపాలెం ఎస్టీకాలనీకి చెందిన ఉయ్యాల ఏసురాజు, వెంకటేశ్వరమ్మ, కొండమ్మ, బుల్లెమ్మ, రామకృష్ణ, దుర్గ మరి కొందరు కూలీలను సింగనపాలెం నుంచి పూరిమెట్లకు చెందిన చొప్పవరపు గోపీ తన ఆటోలో ఎక్కించుకొని స్వగ్రామానికి తీసుకెళ్లాడు. రైతులకు చెందిన మిరపకాయలు కోసేందుకు కూలీలు రోజూ వెళ్తుంటారు. ఆ క్రమంలో మంగళవారం కూడా వెళ్లారు. ఆటో బోల్తా పడడంతో కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. వినుకొండ మండలం నడిగడ్డ గ్రామానికి చెందిన ఉయ్యాల ఏసురాజు కొంతకాలం నుంచి సింగనపాలెం ఎస్టీ కాలనీలో ఉంటూ మిరప కాయల కోతకు వెళుతున్నాడు. తీవ్రంగా గాయపడిన ఏసురాజుతోపాటు బాధితులను అద్దంకి, ఒంగోలు ఆస్పత్రులకు తరలించారు. ఈ విషయం తెలియడంతో సింగనపాలెంలోని వారి బంధువులు ఒక్కసారిగా ఆందోళన చెందారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేశారు.

కట్టడికి కుట్ర

ఇంకొల్లులో బాబు సభకు ఏర్పాట్లలో ఉన్న రోజే ఏలూరికి పోలీసు నోటీసులు

రా కదలిరా కార్యక్రమానికి భూమి పూజ నేడు

కార్యక్రమ నిర్వహణకు భూములిచ్చేందుకు పోటీపడిన ప్రజలు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

పర్చూరు నియోజకవర్గంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఎన్నికల శంఖారావం పూరించేందుకు సిద్ధమైన దశలో అధికార వైసీపీ నేతలు.. ఎలాగైనా ఆ పార్టీ నేతలను కట్టడి చేసే కుట్రకు తెరలేపారు. నియోజకవర్గంలో జరిగే బాబు సభ ఏర్పాట్లు కోసం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రంగంలోకి దిగిన తొలిరోజే పోలీసులు ఆయనకు 41ఏ నోటీసులు అందజేశారు. తద్వారా తస్మాత్ జాగ్రత్త అంటూ అధికారపార్టీ పరోక్షంగా హెచ్చరిక జారీ చేసినట్లైంది. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి బలమైన లోక్‌సభ స్థానాలలో బాపట్ల ఒకటి. అందులోనూ పర్చూరు అసెంబ్లీ స్థానం ఇటీవల మరింతగా టీడీపీకి అనుకూలంగా మారిపోయింది. గత ఎన్నికల్లోనూ లోక్‌సభ స్థానం పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాలలో నాలుగింట టీడీపీ అభ్యర్థులు గెలుపొందారు. అలాంటి బాపట్ల లోక్‌సభ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడిగా పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్రియాశీలకపాత్ర పోషిస్తున్నారు. ఆయనతో పాటు అద్దంకి, రేపల్లె ఎమ్మెల్యేలు రవికుమార్, సత్యప్రసాద్, వేమూరు నియోజకవర్గానికి చెందిన మాజీమంత్రి నక్కా ఆనంద్‌బాబు తదితరులు టీడీపీ కార్యక్రమాల నిర్వహణలో ఉద్ధండులుగా ఉండటమే గాక చంద్రబాబుకు అంతరంగికులుగా మారారు. మిగిలిన సంతనూతలపాడు, బాపట్ల, చీరాల పార్టీ ఇన్‌చార్జిలు విజయ్‌కుమార్, వర్మ, కొండయ్యలు ఆయా నియోజకవర్గాలలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. దీంతో శనివారం పర్చూరు నియోజకవర్గంలో రా.. కదలిరా పేరుతో ఎన్నికల శంఖారావం పూరించే సభ నిర్వహణకు టీడీపీ సిద్ధమైంది. తొలుత చీరాలలో జరపాలనుకున్నప్పటికీ ఇటీవలికాలంలో పర్చూరు నియోజకవర్గంలో జరిగిన కొన్ని పరిణామాలను దృష్టిలో ఉంచుకుని సభను ఇంకొల్లుకు మార్చుచేశారు. నియోజకవర్గంలోని ఇంకొల్లులో సభ నిర్వహణకు రంగం సిద్ధం చేస్తున్నారు. మంగళవారం ఉదయానికి మార్టూరు కార్యాలయానికి వచ్చి అక్కడి నుంచి ఇంకొల్లు వచ్చి బహిరంగ సభా ప్రాంగణాన్ని ఖరారు చేసుకుని మార్టూరులోని క్యాంపు ఆఫీసుకు వెళ్లిన ఏలూరి వద్ద క్షణంలో పోలీసులు ప్రత్యక్షమయ్యారు. సోమవారం రాత్రికే ఏలూరి వస్తారని తెలిసి ఉదయాన్నే పోలీసులు క్యాంపు ఆఫీసుకు వెళ్లగా ఏలూరి రాలేదని వెల్లడైంది. హైదరాబాద్ నుంచి నేరుగా ఏలూరి ఇంకొల్లు వచ్చారని తెలుసుకుని పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆయన ఇంకొల్లు నుంచి మార్టూరులోని తన క్యాంపు ఆఫీసుకు వచ్చే వరకు వేచి ఉండి వెంటనే అప్రమత్తమయ్యారు.



ఆయనకు 41ఏ నోటీసులు జారీచేశారు. ఈనెల 22న సీఐ ఎదుట విచారణకు హాజరుకావాలని అందులో పేర్కొన్నారు.

ఇటీవల మార్టూరు ప్రాంతంలో టీడీపీకి చెందిన గ్రానైట్ వ్యాపారులపై మైనింగ్ అధికారులు ప్రైవేటు వ్యక్తులతో వచ్చి దాడులు చేయటం, ఆ సందర్భంగా వ్యాపారులకు మద్దతుగా ఏలూరి వెళ్లి మాట్లాడటం తెలిసిందే. ఆ సంఘటనకు సంబంధించి విధి నిర్వహణకు వచ్చిన అధికారులను ఏలూరి, మరికొందరు అడ్డుకున్నారని పోలీసులు కేసు నమోదుచేశారు. మారణాయుధాలతో వచ్చిన ప్రైవేటు వ్యక్తులపై వ్యాపారులు ఇచ్చిన ఫిర్యాదును మాత్రం పక్కనపడేశారు. ఆ కేసులో ఆరోజుకారోజు ఆరుగురిని అరెస్టు చేయటం, తర్వాత వారు బెయిల్‌పై బయటకు రావటం జరిగింది. ఏలూరి హైకోర్టుకు వెళ్లటంతో పోలీసులకు చీవాట్లు పెట్టిన న్యాయస్థానం అరెస్టు చేయకుండా 41ఏ నోటీసులు ఇవ్వాలని ఆదేశించింది. ఈ ఆదేశాలు వచ్చి ఐదారు రోజులు అవుతున్నప్పటికీ పట్టీపట్టనట్లు ఉన్న పోలీసులు చంద్రబాబు సభ ఖరారుకావటం, ఆ ఏర్పాట్లలో ఏలూరి నిమగ్నమైన రోజే పోలీసులు నోటీసులివ్వడం గమనార్హం. స్థానిక పోలీసులు సంయమనంతో ఉన్నప్పటికీ ఉన్నతస్థాయి నుంచి వచ్చిన ఒత్తిడితో ఆగమేఘాలపై రంగంలోకి వచ్చారని చెబుతున్నారు. అంతేగాక ఆ కేసులో మరో 20 మంది అని పేర్కొన్న అంశం ఆధారంగా ఈ సభకు గ్రానైట్ వ్యాపారులు సహకరించకుండా మరికొందరిపై ఒత్తిడిపెంచే అవకాశం ఉన్నట్లు సమాచారం. దీంతో సభను జయప్రదం కాకుండా చేసేందుకు ప్రభుత్వం మరెన్ని అడ్డంకులు కల్పిస్తుందోనన్న ఆందోళన టీడీపీ శ్రేణుల్లో కనిపిస్తోంది.

నేడు సమీక్షా సమావేశం

రా..కదలిరా సభను జయప్రదం చేసేందుకు బుధవారం మార్టూరులోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు ఆఫీసులో సమీక్షా సమావేశం ఏర్పాటుచేశారు. ఉదయం తొమ్మిదిన్నరకు సభానిర్వహణ ప్రాంగణంలో ఎమ్మెల్యే ఏలూరి ఏర్పాట్లు కోసం భూమి పూజ చేస్తారు. పదకొండున్నరకు పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు పార్టీ పరిశీలకులుగా పర్చూరుకు డాక్టరు ఉగ్రనరసింహారెడ్డిని అలాగే ఇతర నియోజకవర్గాలకు మరికొందరు నాయకులను రాష్ట్ర పార్టీ పరిశీలకులుగా నియమించింది. వారితో పాటు ఎమ్మెల్యేలు రవికుమార్, సత్యప్రసాద్, మాజీమంత్రి ఆనంద్‌బాబు, ఇతర ఇన్‌చార్జులు వర్మ, విజయ్‌కుమార్, కొండయ్య, ఇతర టీడీపీ దాని అనుబంధ సంఘాల ముఖ్య నాయకులు సమీక్షా సమావేశంలో పాల్గొననున్నారు.

మేమున్నామంటూ ముందుకు..

అనువైన స్థలం దొరికితే ఇంకొల్లులో సభ పెట్టేందుకు వచ్చిన ఏలూరికి ఇంకొల్లు, సమీప గ్రామాల రైతులు ఇతరత్రా స్థలాల యజమానులు ముందుకొచ్చి మేమున్నామంటూ మద్దతివ్వటం విశేషం. ఎవరికి వారు మా భూములున్న ప్రాంతంలో సభ పెట్టుకోండి, మాకు అభ్యంతరం లేదని ముందుకొచ్చారు. పలు స్థలాలు, పొలాల పరిశీలన అనంతరం ఇంకొల్లుతో కలిసిఉండేలా ఓ కాలనీ పక్కన 20 ఎకరాల వ్యవసాయ భూమిలో సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఆ విస్తీర్ణంలోని రైతులు, ఇతర స్థలాల యజమానులు పార్టీ, కులమతాలకు అతీతంగా సభ ఏర్పాటుకు అంగీకారపత్రాలు రాసివ్వటం విశేషం.

గంజాయి చాక్‌లెట్!

రూటుమార్చిన స్మగ్లర్లు

గెలాక్సీపురిలో విక్రయాలు

రాష్ట్రంలో రెండో కేసు నమోదు

గ్రానైట్ కార్మికులకు విక్రయాలు

కళాశాలలకు చేరువయ్యే అవకాశం

ఒడిశా, బిహార్ నుంచి దిగుమతి

అప్రమత్తం అయిన ఎస్ఈబీ

గంజాయి ముఠాలు రూటుమార్చాయి. మత్తులో చిత్తవుతున్న యువతకు మరింత చేరువయ్యేందుకు కొత్త ఎత్తుగడ వేశాయి. చాక్‌లెట్ రూపంలో విద్యార్థులు, యువతకు వల విసురుతున్నాయి. తెలంగాణలో హైదరాబాద్‌లో ఈ వ్యవహారం బయటకు రాగా తాజాగా జిల్లాలో కూడా వెలుగుచూశాయి. ఉత్తరాది ప్రాంత కార్మికులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో గంజాయి చాక్‌లెట్లు విక్రయాలు జోరందుకున్నాయి. ఉమాంగ్, చార్మినార్, శ్రీమహకాల్ అనే పేర్లతో గంజాయి చాక్‌లెట్లు మార్కెట్లో దొరుకుతున్నాయి. ఈ చాక్‌లెట్లు బడ్డీకొట్లలో యథేచ్ఛగా విక్రయాలు చేయడం భయోత్పాతం కలిగే అంశం. ఇవేకనుక విద్యార్థులకు చేరువైతే పరిస్థితి చేయిదాటి పోయే ప్రమాదం ఉంది.

ఒంగోలు (క్రైం) ఫిబ్రవరి 13 : గంజాయి విక్రయ ముఠాలు రెచ్చిపోతున్నాయి. విద్యార్థులు, యువతే లక్ష్యంగా చేసుకుని వారికి అందుబాటులో సరుకు ఉండేలా ఎత్తులు వేస్తున్నాయి. ఎస్ఈబీ, పోలీసులకు అనుమానం రాకుండా రకరకాల మార్గాల్లో విక్రయాలు చేపడుతూ భారీగా దండుకుంటున్నాయి. కొందరైతే ఏకంగా బడ్డీకొట్లు, టీస్టాళ్లు అడ్డాలుగా చేసుకుంటున్నారు. తాజాగా చాక్లెట్ల రూపంలో అమ్మడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇటీవల మెడికల్ కళాశాల విద్యార్థులు, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు గంజాయికి బానిసలైనట్లు బయటపడింది. ఆ విషయమై దాడులకు పాల్పడి రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. ఇలా కళాశాలల విద్యార్థులు ఆ మత్తుకు బానిసలుగా మారుతున్నారని తెలిసి జిల్లా పోలీసు యంత్రాంగం అప్పట్లో గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపింది. బాధిత విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పోలీసు, ఎస్ఈబీ అధికారులు సంయుక్తంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అయినప్పటికి పరిస్థితి అదుపులోకి రాలేదు. మూలాలు ఎక్కువగా కళాశాలల్లోనే ఉండటమే అందుకు కారణం. అదే విధంగా గంజాయి విక్రయదారులపై కేసులు నమోదు చేసి కట్టడి చేసే క్రమంలో గంజాయి చాక్‌లెట్లు విక్రయాలు విషయం తెలిసింది. చీమకుర్తి మండలం బూదవాడలో గల యల్లయనగర్‌లో బడ్డీకొట్లో జరుగుతున్నట్లు గుర్తించిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు మంగళవారం వలపన్ని పట్టుకున్నారు. గతంలో ఇదేవిధంగా పర్చూరులో గంజాయి చాక్‌లెట్లు విక్రయిస్తున్న వారిని ఎస్ఈబీ అధికారులు పట్టుకున్నారు. చాక్‌లెట్ల రూపంలో జిల్లాలోకి గంజాయి రావడం ప్రమాదకర పరిస్థితికి అద్దం పడుతుంది.





బూదవాడలో పోలీసులకు దొరికిన గంజాయి చాక్లెట్లు

ఒడిశా, బిహార్ నుంచి దిగుమతి

గంజాయి చాక్‌లెట్లు బీహర్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, మధ్యప్రదేశ్‌లలో తయారు అవుతున్నట్లు ఎస్ఈబీ అధికారుల విచారణలో వెల్లడైంది. రెండు నెలల క్రితం పర్చూరులో గంజాయి చాక్‌లెట్లు విక్రయిస్తున్న ఒడిశా యువకుడని అధికారులు పట్టుకున్నారు. చీమకుర్తి మండలం బూదవాడలోని యల్లయనగర్‌లో బీహర్‌కు చెందిన నరేష్ సహనీ 2013 నుంచి నివాసముంటూ గ్రానైట్ పరిశ్రమలలో పనిచేస్తున్నాడు. అతను అక్కడే ఓ బడ్డీకొట్టు నిర్వహిస్తున్నాడు. పక్కా సమాచారం మేరకు కొట్టులో సుమారు 3.5 కిలోల గంజాయి చాక్‌లెట్లను ఎస్ఈబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఉమాంగ్, శ్రీమహకాల్, చార్మినార్ బ్రాండ్‌లతో చాక్లెట్లు ఉన్నాయి. ఒక్కో చాక్‌లెట్ పది నుంచి ఇరవై రూపాయిల వరకు అమ్ముతున్నారు. బీహార్‌లోని సమస్తపూర్ నుంచి గంజాయి చాక్‌లెట్లు తెచ్చి విక్రయిస్తున్నారు.

గంజాయి చాక్‌లెట్లు విక్రయాలు ఆందోళనకరం

గంజాయి మిశ్రమంతో తయారు చేసే చాక్‌లెట్లు చాలా ప్రమాదకరమని నిపుణులు చెబుతున్నారు. వాటిని నమలడం వలన నేరుగా శరీరంలోని అనేక అవయవాలు త్వరగా దెబ్బతినే ప్రమాదం ఉంది. ఐదు గ్రాములు ఉన్న ఆ చాక్‌లెట్‌లో 15శాతం గంజాయి ఉన్నట్లు గుర్తించారు. గంజాయి కారకాలు నేరుగా అవయవాలపై పడుతుంది. ఎక్కువగా ఇలాంటివి తిన్నవారికి కేన్సర్ వచ్చే అవకాశం ఉంది. చాక్‌లెట్లు కొంతమంది నమిలి మిగడం చేస్తారు. మరికొందరు బుగ్గన పెట్టుకునేందుకు వినియోగిస్తారు. ఒక్కటి రెండు గంటల పాటు మత్తుని ఇస్తుందని వినియోగించిన వారు చెబుతున్నారు. ఇవి విద్యార్థులకు చేరువైతే పరిస్థితి ఆందోళనకరంగా మారే అవకాశం ఉంది. ఇప్పటికే గంజాయి మత్తుకు బానిసలైన యువత వారి బంగారు భవిష్యత్‌ను కాజేసుకుంటున్నారు.

అప్రమత్తమైన ఎస్ఈబీ

గంజాయి చాక్‌లెట్ల విక్రయాలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అప్రమత్తమయ్యారు. చీమకుర్తి మండలం బూదవాడ యల్లయ్యనగర్‌లో గంజాయి చాక్‌లెట్లు విక్రయిస్తున్న నరేష్ సహనీపై కేసు నమోదు చేసిన అధికారులు జిల్లాలో ఇంకా ఎక్కడైనా విక్రయిస్తున్నారా? అని దృష్టిసారించారు. బడ్డీకొట్లలో గంజాయి విక్రయాలు ఆందోళన కలిగించే అంశం కావడంతో పోలీసు యంత్రాంగం జిల్లా అంతా అప్రమత్తమై నిఘా పెంచింది.

మెప్మా స్కాంపై కదలిక

అక్రమాలపై విచారణ

ముగ్గురు జిల్లా అధికారులను నియమిస్తూ కలెక్టర్ ఆదేశాలు

ఇప్పటికే పలువురిపై చర్యలకు సిద్ధమైనట్లు సమాచారం

ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 13 : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో కోట్లు రూపాయల కుంభకోణంపై అధికారులు అప్రమత్తం అయ్యారు. సమగ్రస్థాయిలో విచారణ జరిపించి, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునే విధంగా కలెక్టర్ దృష్టిసారించారు. అవినీతిలో వైసీపీకి చెందిన పలువురు ద్వితీయశ్రేణి నాయకులతోపాటు, మెప్మా ఉద్యోగుల పాత్ర ఇందులో ఉందని అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు తెలిసింది. బోగస్ గ్రూపులను సృష్టించి, పలు ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల్లో కోట్ల రూపాయల రుణ దోపిడీకి పాల్పడిన వ్యవహారాన్ని ఆంధ్రజ్యోతి వరుస కథనాలతో వెలుగులోకి తీసుకొచ్చింది. ఇదే విషయమై తెలుగుదేశం పార్టీ నాయకులు కుంభకోణంపై అధికారులకు ఫిర్యాదుచేయడంతోపాటు, అక్రమాలు నిగ్గుతేల్చాలని డిమాండ్ చేశారు. రుణదోపిడీకి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఎమ్మెల్యే బాలినేని కూడా ఇదే విషయమై సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి మండిపడినట్లు సమాచారం. మెప్మాలో జరిగిన స్కాంపై విచారణ చేసి, భాగస్వాములైన వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ ఆ దిశగా విచారణ వేగవంతం చేశారు. అందులోభాగంగా డీఆర్‌డీఏ పీడీ, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజరు, సివిల్ సప్లయిస్ అధికారులను విచారణకు ఆదేశించారు. వారు మంగళవారం ఒంగోలులోని మెప్మా కార్యాలయంలో సీఎంఎం, సీఓలు, ఐబీ స్పెషలిస్ట్, ఇతర ఉద్యోగులను నాలుగు గంటలపాటు విచారించారు. అయితే పొదుపు గ్రూపుల ఏర్పాటు ఎలా? గ్రూపు సభ్యులు ఎన్ని బ్యాంకుల్లో రుణాలు తీసుకోవచ్చు. ఏ విధమైన రుణాలు మంజూరయ్యే అవకాశం ఉంది. అవినీతి జరిగేందుకు ఏ విధమైన అడ్డదారులు తొక్కారు అనే అంశాలపై అంతర్గతంగా విచారణ చేపట్టారు. అందిన సమాచారం మేరకు మొదటి రోజు విచారణలో ఐదుగురు సీఓలు, ముగ్గురు ఆర్పీలను గుర్తించగా వారికి చార్జ్ మెమోలు జారీచేసినట్లుగా తెలిసింది. వీరితోపాటు ఆర్పీలు, మెప్మా అధికారులు, పలువురు ఉద్యోగుల పాత్ర ఉన్నట్లు సమాచారం. అయితే విచారణ ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో పూర్తి వివరాలు వెల్లడించడానికి అధికారులు అంగీకరించలేదు. పూర్తి నివేదికను కలెక్టర్ అందజేయనున్నట్లు తెలిసింది.



నగర కార్పొరేషన్ కార్యాలయంలో విచారణ చేస్తున్న అధికారులు

భర్త నుంచి రక్షణ కల్పించాలని మహిళల నిరసన

కనిగిరి, ఫిబ్రవరి 13 : భర్త నుంచి మహిళకు రక్షణ కల్పించాలని కోరుతూ ఐద్వా సంఘం ఆధ్వర్యంలో సోమవారం పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన ధర్నా నిర్వహించారు. వివరాలలోకి వెళితే... పట్టణ సమీపంలోని మాచవరం గ్రామంలో నివాసం ఉంటున్న దాసరి పొట్టమ్మ అనే గిరిజన మహిళ న్యాయం చేయాలని కోరుతూ ఐద్వా మహిళలతో కలసి నిరసనకు దిగింది. మూడు రోజుల నుంచి పోలీస్‌స్టేషన్ ఎదుట న్యాయం చేయాలని కోరుతున్నా పట్టించుకోలేదని వాపోయారు. విషయం తెలుసుకున్న సీఐ దాసరి వెంకటేశ్వరరావు ఐద్వా మహిళలతో మాట్లాడి మహిళకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వటంతో నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పీసీ కేశవరావు, ఐద్వా మహిళలు ఎస్ వెంకటమ్మ, ప్రసన్న, ప్రమీల, రమీజాబి, విజయలక్ష్మీ, నారాయణమ్మ, తిరుపతమ్మ, రత్తమ్మ, చిన్నక్క, శాంతకుమారి, ఎలేషమ్మ పాల్గొన్నారు.

అధికార అండతో అక్రమ లేఅవుట్లు

ఒడా నుంచి నేరుగా అనుమతులు

పంచాయతీకి ఇవ్వాల్సిన పదిశాతం భూమిని కూడా ఇవ్వని పరిస్థితి

ఎన్‌ఓసీ లేకుండానే నేరుగా ఒడాకు దరఖాస్తు

జిల్లావ్యాప్తంగా 922 లేఅవుట్లలో 670 అనధికారికమే

నిబంధనలకు విరుద్ధంగా 252 లేఅవుట్లకు అప్రూవల్

కలెక్టర్ సీరియస్‌తో ఒక్కొక్కటిగా బయటపడుతున్న విషయాలు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 13 : జిల్లాలో అధికారపార్టీ నాయకుల అండదండలతో విచ్చలవిడిగా అనధికారికంగా లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఒక ప్రాంతంలో లేఅవుట్ వేయాలంటే ముందుగా పంచాయతీ లేదా మునిసిపాలిటీల నుంచి ఎన్‌ఓసీ తీసుకోవాలి. కానీ జిల్లాలో అందుకు భిన్నంగా లేఅవుట్లకు అప్రూవల్ ఇస్తున్నారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఒడా)ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రభుత్వం దానికి కొన్ని నిబంధనలను విధించింది. అయితే అవేమీ ప్రస్తుతం అమలు కావడం లేదు. పంచాయతీల ప్రమేయం లేకుండా నేరుగా అక్కడి నుంచే అనుమతులు ఇస్తున్నారు. జిల్లాలో 38 మండలాల పరిధిలో 922 లేఅవుట్లు ఉండగా అందులో 252 లేఅవుట్లకు ఒడా నుంచి అనుమతులు తీసుకోగా 670 లేఅవుట్లు అనధికారికంగానే ప్లాట్ల విక్రయాలు జరుగుతున్నాయి. సుమారు 2,824 ఎకరాల్లో 56,740 ప్లాట్లు అమ్మకాలుకు పెట్టినట్లు పంచాయతీ కార్యదర్శులు గుర్తించారు. అయితే ఒడా నుంచి అనుమతులు తీసుకున్న లేఅవుట్లకు కూడా గ్రామ పంచాయతీకి చెల్లించాల్సిన సెస్‌కానీ, 10శాతం ల్యాండ్‌ను కానీ కేటాయించిన పరిస్థితి లేకుండా పోయింది. ఆ భూమి వద్దకు పంచాయతీ కార్యదర్శి వెళిన కొద్ది నిమిషాల్లోనే అధికార పార్టీ లేదా ఒడాలో కీలకంగా ఉండే ఒక అధికారి నుంచి ఫోన్ చేసి వెనక్కు రమ్మని చెప్తున్నారు. సాధారణంగా మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో లేఅవుట్లు వేస్తున్నట్లు రియల్ ఎస్టేట్ వ్యాపారి దరఖాస్తు చేసుకోవాలి. ఆ దరఖాస్తు పరిశీలించిన అనంతరం పంచాయతీ నుంచి ఎన్‌ఓసీ తీసుకున్న తర్వాత అనుమతుల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంది. కానీ అందుకుభిన్నంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు(అధికారపార్టీ నేతలు) నేరుగా ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి లేఅవుట్ అప్రూవల్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుంటున్నారు. అయితే ఈ దరఖాస్తు నిబంధనలకు అనుగుణంగా ఉందా లేదా? అని పరిశీలించిన తర్వాత అప్రూవల్ ఇవ్వాల్సి ఉంది. కానీ అవేమీ పరిశీలించకుండానే ఒడా కార్యాలయంలో పనిచేసే ఒక మహిళా అధికారి అన్ని తానై చకచకా అనుమతులు ఇస్తూ వెళ్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే అప్రూవల్ అయిన లేఅవుట్లలో పంచాయతీకి కేటాయించాల్సినవి పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో జిల్లాలో అక్రమ లేఅవుట్ల వ్యవహారం కలెక్టర్ దినేష్‌కుమార్ దృష్టికి రావడంతో ఇటీవల నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మండల విస్తరణాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంతనూతలపాడు, సింగరాయకొండ, పామూరులలో అనధికార లేఅవుట్లపై సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ప్రధానమైన మండలాలు, పట్టణాల్లో అనధికారిక లేఅవుట్లు ఉండటంతో వాటిపై దృష్టిసారించారు. అందిన సమాచారం ఒక్క సంతనూతలపాడు మండలంలోనే 25 లేఅవుట్లు ఉండగా అందులో మంగమూరు గ్రామసమీపాల్లోనే పది లేఅవుట్లు ఉన్నట్లు తెలిసింది. ఆయా లేఅవుట్లకు ఆయా పంచాయతీల నుంచి అనుమతులు కూడా లేనట్లు సమాచారం.



సంతనూతలపాడు సమీపంలో అనధికారికంగా వేసిన లే అవుట్



మాట్లాడుతున్న డ్వామా పీడీ అర్జునరావు

ఉపాధి పనులపై ప్రణాళికలు రూపొందించాలి

మేదరమెట్ల, ఫిబ్రవరి 13: గ్రామాలల్లో ఉపాధి హామీ పనులపై ప్రణాళికలు రూపొందించాలని డ్వామా పీడీ అర్జునరావు పేర్కొన్నారు. కొరిశపాడులోని ఉపాధి హామీ కార్యాలయం ఆవరణంలో మంగళవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజా వేదికలో ఆయన మాట్లాడారు. గ్రామాలలో కూలీల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. 2023 ఏడాదిలో 828 పనులకు రూ.5.96 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. సామాజిక తనిఖీలలో భాగంగా కొన్ని పొరపాట్లను గుర్తించామన్నారు. అందుకు రూ.20 వేల వరకు రికవరీ చేస్తునట్లు చెప్పారు. ఉపాధి హామీ పనులకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఏపీవోకు సూచించారు. సామాజిక తనిఖీకి సంబంధించి రికార్డులు అందజేయని పంచాయతీ రాజ్, ఆర్డబ్ల్యూఎస్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీవీవో శోభన్, ఎస్ఆర్పీ విజయభాస్కర్, ఏపీఎం టి.రాజారావు, ఏపీవో కోటేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ కౌన్సిలర్‌లు

అద్దంకి, ఫిబ్రవరి 13: అద్దంకి మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అబ్దుల్ రషీద్‌ను మంగళవారం టీడీపీ కౌన్సిలర్‌లు కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్‌ను కలిసినవారిలో కౌన్సిలర్‌లు అత్తులూరి రమేష్, రంగిశెట్టి సుభాషిణి, మాగులూరి తిరుపతమ్మ, కంపా రజని, జహీరా, మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాసరావు, లహరి తదితరులు ఉన్నారు.

పంగులూరు తహసీల్దార్‌గా కృష్ణప్రసాద్

పంగులూరు, ఫిబ్రవరి 13: పంగులూరు మండల తహసీల్దార్‌గా జీఎస్ కృష్ణప్రసాద్ నియమితులయ్యారు. విజిలెన్స్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనను పంగులూరు తహసీల్దార్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఖోఖో విజేత జిల్లా జట్టు



ఖోఖో పోటీలలో విజేతగా నిలిచిన బాపట్ల జిల్లా పురుషుల జట్టు

పంగులూరు, ఫిబ్రవరి 13: ఆడుదాం ఆంధ్ర రాష్ట్రస్థాయి పురుషుల ఖోఖో పోటీలలో బాపట్ల జిల్లా జట్టు విజేతగా నిలిచింది. 26 జిల్లాల పరిధిలో విశాఖ కేంద్రంగా జరిగిన ఈ పోటీలలో రాష్ట్రస్థాయి విజేతగా నిలిచిన బాపట్ల జిల్లా జట్టులో పంగులూరు సచివాలయం- 1 పురుషుల క్రీడాజట్టుకు పాల్గొనే అవకాశం దక్కింది. సోమవారం సాయంత్రం జరిగిన ఫైనల్ పోటీలో అనకాపల్లిపై తలపడిన బాపట్ల జట్టు విజేతగా నిలిచిందని స్థానిక కళాశాల పీడీ ఎం. సీతారామిరెడ్డి తెలిపారు.

ఉన్నత శిఖరాలకు విద్యార్థులు చేరుకోవాలి

చినగంజాం, ఫిబ్రవరి 13: మండలంలోని కడవకుదురు గ్రామంలోని జడ్పీ పాఠశాల, గ్రామ పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రాలు, సబ్ సెంటర్, జగనన్న హౌసింగ్ కాలనీలను గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా ప్రకాశం జిల్లా జడ్పీ సీఈవో బి.జాలిరెడ్డి మంగళవారం పరిశీలించారు. కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అసెంబ్లీకి ఆయన హాజరై విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని పెట్టుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని అన్నారు. ప్రభుత్వం అందజేసిన బూట్లు ఎందుకు వేసుకు రాలేదని విద్యార్థులను ప్రశ్నించారు. పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లమూరి శివకుమారి, ఎంపీడీవో వర్రప్రసాద్, ఎంఈవో అజయ్‌బాబు, హెచ్ఎం కె.రామారావు, ఈవోపీఆర్డీ గోపాలకృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

మేదరమెట్ల , ఫిబ్రవరి 13: స్వయం సహాయక సంఘాల మహిళలకు వైఎస్ఆర్ ఆసరా నాల్గో విడత చెక్కును వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం చిన హనిమిరెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు. మంగళవారం మేదరమెట్ల మార్కెట్ యార్డులో జరిగిన ఆసరా చెక్కుల సంబరాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కొరిశపాడు మండలంలో మొత్తం 1071 సంఘాలలో 10,557 మంది సభ్యులు ఉన్నారు. వీరందరికి కలిపి రూ.8.48 కోట్ల చెక్కును హనిమిరెడ్డి చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తుళ్ళూరి వెంకటరమణ, మేదరమెట్ల సర్పంచ్ బొనిగల ఎలిశమ్మ, ఏఎంసీ ఛైర్మన్ జజ్జర ఈశ్వరమ్మ ఆనందరావు, ఎంపీడీవో సమతావాది, ఏపీఎం అనూరాధ, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జంపు హరిబాబు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ నరసింహారావు

బల్లికురవ, ఫిబ్రవరి 13: మండలంలోని సూరేపల్లికి చెందిన చంటి సాంబిరెడ్డి (42) అనే వ్యక్తి విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. గ్రామానికి చెందిన సాంబిరెడ్డి పాల కేంద్రంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి గ్రామం నుంచి కొమ్మాలపాడు వద్ద ఉన్న డెయిరి వద్దకు ఏబీసీ కాలువ కట్టపై బైకుపై వెళుతున్నాడు. ఈక్రమంలో పొలాలకు పందులు రాకుండా వేసిన విద్యుత్ వైరు బైకుకి తగిలి మృతి చెందాడు. విద్యుత్ వైర్లు వేసిన రైతులు కొందరు ప్రమాదాన్ని గమనించి మృతి చెందిన సాంబిరెడ్డి మృతదేహాన్ని ప్రక్కనే ఉన్న ఏబీసీ కాలువ గుంతలో పడవేశారు. రాత్రి వెళ్లిన తన భర్త ఇంటికి రాకపోవటంతో మృతుడి భార్య సంధ్య బంధువులు మంగళవారం వెతుకులాట ప్రారంభించారు. గ్రామానికి సమీపంలోని కాలువలో చెప్పులు ఒకచోట , మృతదేహం, బైకు మరోచోట పడి ఉండటం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సంతమాగులూరు సీఐ నరసింహారావు. ఎస్ఐ నాగశివారెడ్డి సంఘనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి బంధువులు ఇది ప్రమాదం కాదని, విద్యుత్‌షాక్‌తో చనిపోయాడని అనుమానం వ్యక్తంచేసి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాలువ కట్టపై విద్యుత్ వైర్లు ఉన్నాయని, పొలాలకు పందులు రాకుండా రాత్రుళ్లు విద్యుత్ వచ్చేలా ఏర్పాటు చేయటం వలనే ఈ ప్రమాదం జరిగిందని మృతుడి కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి ఒక కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఇళ్ల స్థలాల పేరుతో వైసీపీ నేతల ఆటలు

- పేదలకు పట్టాలు ఇచ్చిన చోట ఖాళీ చేయించి జగనన్న కాలనీ లేఅవుట్
- అక్కడ ఇవ్వకుండా.. స్కూల్ కోసం ప్రతిపాదనలు పంపిన చోట చదును
- ఓట్లకు గాలం వేసేందుకు తంటాలు



అద్దంకి కొండపై ఇళ్ళ స్థలాల కోసం చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్

అద్దంకి, ఫిబ్రవరి13: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికారపార్టీ నేతలు ఓట్లకు గాలం వేసే తంతులకు తెరలేపుతున్నారు. ఐదేళ్ళ గుర్తుకు రాని నిరుపేదలు ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో హడావుడిగా ఇళ్ళ స్థలాల కోసం అంటూ అద్దంకి కొండపై హడావుడి చేస్తున్నారు. మండలంలోని శింగరకొండపాలెంకు చెందిన ఎస్సీ, ఇతర సామాజికవర్గాల ప్రజలు అద్దంకి కొండను ఆక్రమించుకొని నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే, 220 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు సమయంలో కొంతమంది ఎస్సీలకు చెందిన స్థలాలు, నివాస గృహాలని బలవంతంగా ఖాళీ చేయించి పక్కనే ఉన్న ఖాళీ స్థలం చూపించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత శింగరకొండపాలెంలో జగనన్న కాలనీ లేఅవుట్, సచివాలయం, రైతు భరోసా కేంద్రాల కోసం అంటూ అక్కడ ఉన్న పేదలను ఖాళీ చేయించారు. కనీసం జగనన్న కాలనీ లేఅ వుట్‌లో స్థలాలు కోల్పోయిన వాళ్లకు కేటాయిస్తారని భావించారు. అయితే, వాళ్ళకు మొండిచేయి చూపించి వేరే లబ్ధిదారులకు కేటాయించారు. వేరేప్రాంతంలో కేటాయింప చేస్తామని నమ్మబలికారు. ఇప్పటివరకు వాళ్ళ స్థలాల గురించి పట్టించుకోకుండా వదిలివేసి ఎన్నికలు సమీపిస్తుండటంతో ఓట్లకు ఎర వేసేందుకు అధికారపార్టీ నేతలు పన్నాగం పన్నినట్లు తెలుస్తుంది. ఈక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ ఏర్పాటుకోసం ప్రతిపాదనలు పంపిన స్థలాన్ని చూపించి చదును చేయించే పనిలో నిమగ్నమయ్యారు. అన్నీ విషయాలు తెలిసీ కూడా అధికార పార్టీ నేతలు ఆ స్థలాన్ని చదును చేయించటం పట్ల విమర్శలు వస్తున్నాయి. విషయం తెలుసుకున్న వీఆర్వో బాషా మంగళవారం సాయంత్రం చదును చే యించే పనులు నిలిపి వేయించారు.

అరాచక పాలన అంతం కోసమే 'రా..కదిలిరా'

- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు
- 17న ఇంకొల్లులో చంద్రబాబు సభ
- లక్షమంది లక్ష్యంగా ఏర్పాట్లు



పావులూరు రోడ్డులో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

ఇంకొల్లు, ఫిబ్రవరి 13: అరాచక పాలనను సాగనంపేందుకే తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు రా కదిలిరా సభతో శంఖారావం పూరించనున్నట్లు ఆపార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. ఈ నెల 17న బాపట్ల పార్లమెంట్ పరిధిలో రా కదిలిరా బహిరంగ సభ ఇంకొల్లులో నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్‌తో కలిసి బహిరంగ సభ స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఏలూరి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం సాగిస్తున్న అరాచకాన్ని వివరించి ప్రజలను చైతన్యం చేసేందుకు రా కదిలిరా పేరుతో చంద్రబాబు ఈనెల 17న ఇంకొల్లులో తారకరామ విజయభేరి ప్రాంగణంలో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సుమారు లక్ష మంది లక్ష్యంగా భారీ ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు సభా ప్రాంగణంలో భూమిపూజ చేయనున్నారు. 11.30కు పార్లమెంట్ కమిటీ సమావేశం జరుగుతుందన్నారు. హెలిప్యాడ్ కోసం భూమిని చదును చేస్తున్నారు. బాపట్ల పార్లమెంట్‌లోని ఏడు నియోజకవర్గాలు, ఒంగోలు నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభి మానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఏలూరి కోరారు. మంగళవారం సాంబశివరావు, నాయకులు పావులూరు రోడ్డులోని టీడీడీ కల్యాణ మండపం ఎదురుగా విద్యుత్ సబ్‌స్టేషన్‌కు మధ్యలో సుమారు 30 ఎకరాల పొలాన్ని పరిశీలించారు. సభ నిర్వహించే ప్రాంతం, పార్కింగ్, భోజనవసతికి అనువైన ప్రాంతాన్ని పరిశీలించారు. ఇంకొల్లు ప్రాంతంలో రైతువారీ కుటుంబాలు అధికంగా ఉండటంతో పాటు బాపట్ల పార్లమెంట్‌లోని నియోజకవర్గాలకు ఇంకొల్లు ప్రాంతం అందుబాటులో ఉంటుంది. ఇంతవరకు ఇంకొల్లులో చంద్రబాబునాయుడు భారీ కార్యక్రమం ఏమీ జరగకపోవడంతో రా కదిలిరా సభను నిర్వహించాలని నిర్ణయించినట్లు ఏలూరి తెలిపారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్



ఎస్ఎల్ గుడిపాడు నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

బల్లికురవ, ఫిబ్రవరి 13: ఇంకొల్లులో ఈనెల 17న టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు పాల్గొంటున్న రా కదిలిరా కార్యక్రమానికి నేతలు భారీగా తరలి రావాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెం అడ్డరోడ్డు వద్ద గల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బల్లికురవ మండలం ఎస్ఎల్ గుడిపాడు గ్రామ టీడీపీ నేతలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పర్యటనకు వస్తున్న చంద్రబాబు బహిరంగ సభకు కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. అలాగే, వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అన్నివర్గాలకు లబ్ధి చేకూరేలా చేపట్టిన పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగిన టీడీపీ, జనసేన పార్టీల కూటమి విజయం తథ్యమని చెప్పారు. ప్రభుత్వ వ్యతిరేకత రోజురోజుకు పెరుగుతుందన్నారు. ఓటమి తప్పదని భావించిన జగన్‌రెడ్డి ఉద్యోగులను మార్చిన విధంగా, అభ్యర్థులను అంతర్ జిల్లాల బదిలీలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. పార్టీ నేతలంతా సమిష్టిగా ఉండి పార్టీ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే రవికుమార్ పిలుపు నిచ్చారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు కొండేటి ఇజ్రాయల్, రావులపల్లి గోవిందు, సంపతి శౌరి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన వివరాలు

అద్దంకి, ఫిబ్రవరి 13: ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ బుధవారం పలు కార్య క్రమాలకు హాజరుకానున్నారు. ఉదయం 9.30 గంటలకు ఇంకొల్లులో రా...కదిలి రా సభా ప్రాంగణం పరిశీలన, 11.30 గంటలకు అద్దంకి పట్టణంలోని 7వ వార్డు, 11.45కి 14వ వార్డు, మధ్యాహ్నం 12 గంటలకు ఉప్పలపాడులో జరిగే కార్యక్రమాలకు హాజరుకానున్నారు.

కుటీర పరిశ్రమగా కల్తీపాల తయారీ

- విచ్చలవిడిగా సరఫరా
- ప్రజారోగ్యంతో చెలగాటం
- పర్యవేక్షణ కరువు



ఏల్చూరులో పట్టుబడ్డ కల్తీ పాలతో ఉన్న క్యాన్‌లు

అద్దంకి, ఫిబ్రవరి 13: కల్తీ పాల తయారీ కుటీర పరిశ్రమగా మారింది. బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాల పరిధిలో పలు గ్రామాలలో కల్తీ పాల తయారీ జరుగుతుంది. పాడి రైతులతో పాటు పాలసేకరణ ఏజెంట్లు కూడా కల్తీపాల తయారీ చేస్తున్నారు. దీంతో రాజుగారి పాల చందంగా మారిందన్న విమర్శలు వస్తున్నాయి. బాపట్ల జిల్లా పరిధిలోని అద్దంకి, సంతమాగులూరు, బల్లికురవ మండలాలు, ప్రకాశం జిల్లా పరిధిలోని తాళ్లూరు, ముండ్లమూరు, దర్శి మండలాలు, పల్నాడు జిల్లాలోని వినుకొండ, నూజెండ్ల, శావల్యాపురం మండలాలలోని పలు గ్రామాలలో కల్తీ పాల తయారీ జరుగుతుంది. పాల ఉత్పత్తిదారులు తమ పాలకు తోడు అదనంగా మరికొంతమేర పాలు అధికం చేసేందుకు కల్తీ పాల తయారీ చేస్తున్నారు. ఇది చాలదన్నట్లు పాల సేకరణ ఏజెంట్లు కూడా తాము సేకరించిన పాలకు తోడు అదనంగా పాల కోసం కల్తీ పాలు తయారీ చేస్తున్నారు. అదే సమయంలో ఫాట్ అధికంగా వస్తే పాల ధర ఎక్కువ ఉంటున్నందున, అందుకనుగుణంగా పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్, పౌడర్ కలిపి పాల ఉత్పత్తి చేస్తున్నారు. ఇలా ఎవరికి వారే కల్తీ పాలు తయారీ చేస్తుండటంతో అసలు కంటే కల్తీ శాతమే అధికంగా ఉంటుంది. కల్తీ పాల గురించి పాల డెయిరీల నిర్వహకులకు పూర్తి అవగాహన ఉన్నప్పటికి పాలకొరత నేపథ్యంలో కల్తీ పాలను సైతం తీసుకుంటున్నారు. కొన్ని కార్పొరేట్ పాల డెయిరీలు మాత్రం కల్తీ పాలను నిరాకరిస్తుండగా, చిన్న, మధ్య తరహా డెయిరీల నిర్వహలు పోటీని తట్టుకోలేక కల్తీ పాలను సైతం ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తుంది. గత ఏడాది అద్దంకిలో పెద్ద ఎత్తున కల్తీ పాలు పట్టుబడగా, ఇటీవల దర్శి లో కూడా పట్టుబడ్డాయి.

మంగళవారం సంతమాగులూరు మండలం ఏల్చూరులో పాలసేకరణ కేంద్రంలో అధికారులు తనిఖీలు చేయటంతో కల్తీ పాలబండారం మరోసారి వెలుగుచూసింది. అయితే, కల్తీ పాలు అని నిర్ధారణ అయినప్పటికి చర్యలు నామమాత్రంగా ఉండటంతో యథావిధిగా కల్తీపాల తయారీ జరుగుతుందన్న విమర్శలు వస్తున్నాయి. కల్తీ పాలను తాగటం ద్వారా చిన్న పిల్లలు, వృద్ధులలో అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కల్తీపాల తయారీ అరికట్టేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కల్తీపాల తయారీ కేంద్రంపై విజిలెన్స్ దాడులు



ఏల్చూరులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

సంత మాగులూరు, ఫిబ్రవరి 13: మండలంలోని ఏల్చూరు గ్రామంలో కల్తీ పాలతయారీ కేంద్రంపై విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఏల్చూరుకు చెందిన మందా కిరణ్ గత కొంతకాలంగా పాలవ్యాపారం చేస్తున్నాడు. రైతుల నుంచి సేకరించే పాలతో పాటుగా కల్తీ పాలు తయారుచేసి డెయిరీలకు పంపి సొమ్ముచేసుకుంటున్నారు. పాల పౌడర్, పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్, ఎస్ఎన్ఎఫ్ ఫౌడర్‌తో కలసి కల్తీ పాలను తయారుచేసి డైరీలకు పంపిస్తున్నాడు. పక్కా సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు మంగళవారం కిరణ్ ఇంటిపై దాడిచేసి తరలించేందుకు సిద్ధంగా ఉన్న 9 కల్తీ పాల క్యాన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ క్యాన్లలో ఉన్న సుమారు 320 లీటర్ల పాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 65 పామాయిల్ ప్యాకెట్‌లు, 35 సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శాంపిల్స్‌ను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.

ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి



ట్రాఫిక్ సమస్యపై దుకాణదారులకు సూచనలు ఇస్తున్న ఎస్సై రమేష్

పర్చూరు, ఫిబ్రవరి 13: పర్చూరులో చక్రబంధంగా మారిన ట్రాఫిక్ సమస్యపై పోలీసులు దృష్టి సారించారు. పర్చూరు పట్టణం ఆయా జిల్లా కేంద్రాలకు ప్రధాన కూడలి కావటం నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. దీంతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారింది. ఈనేపథ్యంలో పర్చూరు నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఎస్.రమేష్ సమస్యపై ప్రత్యేక దృష్టిసారించారు. మంగళవారం స్థానిక బొమ్మల సెంటర్ కూడలిలో ఉన్న రహదారుల వెంబడి వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణదారులకు తగు సూచనలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సురేష్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



కొలలపూడి లో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసే పంటలను పరిశీలిస్తున్న జపాన్ అధికారుల బృందం

ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలన

మార్టూరు, ఫిబ్రవరి 13: మండలంలోని కోలలపూడి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటల సాగును మంగళవారం జపాన్ నుంచి వచ్చిన అధికారుల బృందం పరిశీలించారు. రాష్ట్ర అధికారి విజయ్ కుమార్ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను వివరించారు. వాటి వినియోగం ద్వారా ప్రజల ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో అమృతాలు, కాషాయాలు తయారీ, జీవా మృతం తయారీకి అవ సరమయ్యే పదార్థాలు, వాటివల్ల ఉపయోగాలను బృందానికి ప్రత్యక్షంగా చూపించారు. అనంతరం పంటల దిగుబడి, మార్కెట్ రవాణా, గిట్టుబాటు ధర తదితర వివరాలను జపాన్ అధికారుల బృందం రైతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని రైతు బలగాని వెంకటస్వామి, మహిళా రైతు కోటేశ్వరమ్మ పండించిన పంటల ఉత్పత్తులను వారు పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో జపాన్ దేశానికి చెందిన స్టీఫెన్ కూచో, మద్యూస్ బస్తల్షియం, జకో నదల్, స్మిలా జాకబ్ లతో పాటు జిల్లా అధికారి వాణిశ్రీ, సర్పంచ్ ఎం.సతీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద మందులతో రోగనిరోధక శక్తి

బల్లికురవ, ఫిబ్రవరి 13: ఆయుర్వేద మందులతో విద్యార్థుల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని అంబడిపూడి ఆయుర్వేద వైద్యశాల ఫార్మసిస్టు శేషసాయి తెలిపారు. మంగళవారం మండలంలోని కొండాయపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక క్యాంప్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ఎండలలో విద్యార్థులకు వడదెబ్బ తగలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శరీరం చల్లదనంగా ఉండేలా ఆయుర్వేద వైద్యశాల ద్వారా 40 మంది విద్యార్థులకు ఛ్యావన్ ప్రాశ, ఆయుష్ 64 మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు తన్నీరు బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతాక్రమంలో సమస్యల పరిష్కారం



ఈపురుపాలెంలో రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలరాం

చీరాల, ఫిబ్రవరి 13: మండల పరిధిలోని ఈపురుపాలెంలో ప్రధాన రహదారిని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి మంగళవారం అధికారుల తో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. పలు సూచనలు చేశారు. స్థానికులతో మాట్లాడి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. వారు చెప్పిన సమస్యలను ప్రాధాన్యతాక్రమం లో పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బీరా శ్రీనివాసరావు, నాదెండ్ల కోటేశ్వరరావు, షేక్ మస్తాన్, మున్సిపల్ డీఈ ఏసయ్య, ఆర్ అండ్‌బీ డీఈ నర్సింహులు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారంలో కేంద్రం వైఫల్యం

చీరాలటౌన్, ఫిబ్రవరి 13: రైతుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పలువురు నాయకులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అధికారంలోకి వచ్చాక కేంద్రం నియంత పాలనకు పరాకాష్టగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఈక్రమంలో ఈనెల 16న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల శామ్యేల్, బాసి పైదయ్య, చిరుమల ప్రకాష్, అచ్యుతుని బాబురావు, దుడ్డు జోసఫ్, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

419 మందికి వైద్య పరీక్షలు

చినగంజాం, ఫిబ్రవరి 13: మండలంలోని కొత్తపాలెం గ్రామ సచివాలయం ఆవరణలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు ఎస్.విజయభాస్కరరావు, పి.సాయిశ్రీ చరణ్, ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.నాగసుబ్రమణ్యం, కె.లక్ష్మీతిరుపతిమ్మలు 419 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మొదటి విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటి పరీక్షలు నిర్వహించిన 70 మందికి సర్పంచ్ ఆసోది బ్రహ్మారెడ్డి కళ్ళజోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఎంవోవో ఎస్.సుధాకర్, తహసీల్దార్ ఫణీంద్రబాబు, ఎంపీడీవో వర్రప్రసాద్, ఈవోపీఆర్డీ ఎస్వీ గోపాలకృష్ణమూర్తి, కార్యదర్శి బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన డ్రీమ్స్ కళాశాల విద్యార్థులు

ఇంకొల్లు, ఫిబ్రవరి 13: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో పూసపాడు అడ్డరోడ్డు డ్రీమ్స్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ పేర్ని సతీష్‌చంద్ర తెలిపారు. బద్దిగం విద్యాధర్‌రెడ్డి 98.49 పర్సంటైల్ సాధించారు. పది మంది విద్యార్థులు 90 పర్సంటైల్‌కు పైగా సాధించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆ విద్యార్థులను సతీష్‌చంద్ర అభినందించారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

చినగంజాం, ఫిబ్రవరి 13: గెలుపోటములను క్రీడాకారులు సమానంగా తీసుకోవాలని ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు, హెచ్ఎం కుర్రా రామారావు అన్నారు. కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు క్రీడాదుస్తుల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈసందర్భంగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బోగిరెడ్డి స్వామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఎస్ఐ మాట్లాడుతూ క్రీడాకారులు ప్రతిభచూపి క్రీడల్లో రాణించాలన్నారు. కబడ్డీ క్రీడాకారుడు దాసరి రామకృష్ణ జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు, జె.పంగులూరుకు చెందిన తిరుమలపురపు రవీంద్రలు అందజేసిన స్పోర్ట్స్ కిట్‌లను ఎస్ఐ, హెచ్ఎంలు క్రీడాకారులకు పంపిణీ చేశారు. ఎస్ఐ శ్రీనివాసరావు పోటీలకు వెళ్తున్న క్రీడాకారుల ప్రయాణం ఖర్చుల నిమిత్తం పదివేల రూపాయలు అందజేశారు. అండర్-14, అండర్-16 విభాగాలలో 2023 డిసెంబరు 17న కడవకుదురులో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 16 నుంచి 18 వరకు గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో నిడ్జామ్ 19వ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్-2024లో పాల్గొంటున్నట్టు స్వామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి మారుబోయిన వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, కోచ్‌లు, పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.


టీడీపీ బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి

మార్టూరు, ఫిబ్రవరి 13: టీడీపీ బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షుడిగా పిట్టు శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ సిఫార్సు మేరకు టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మంగళవారం ఈమేరకు ఆదేశాలు జారీ చేశారు. పార్టీ అభివృద్ధి కోసం కష్ట పడుతున్న చెరుకుపల్లి మండలానికి చెందిన శ్రీనివాసరెడ్డికి పార్టీలో సముచిత స్థానం లభించిందని పార్టీ శ్రేణులు భావిస్తున్నారు.

చంద్రబాబు మరలా సీఎం కావటం అనివార్యం

చీరాల, ఫిబ్రవరి 13: చంద్రబాబు మరలా ముఖ్యమంత్రి కావటం టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని కావూరివారిపాలెంలో మంగళవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య తనయుడు గౌరీఅమర్‌నాథ్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారంటీ ప్రచారం నిర్వహించారు. వైసీపీ పాలనలో నెలకొన్న సంక్షోభాన్ని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రేమకు వేళాయె!



ప్రేమికులు ఎదురు చూస్తున్న రోజు రానే వచ్చింది. తమ మనసులో మాట చెప్పేందుకు ప్రేమికులు ఎదురు చూస్తున్నారు. ప్రేమను వ్యక్తం చేసేవారు. ప్రేమలో ఉన్నవారు ఈ రోజు ఎప్పటికీ గుర్తుండిపోయేలా ప్లాన్ చేసుకుంటున్నారు. రోజా పువ్విచ్చి ప్రియురాలిని మురిపించే కాలం ఎప్పుడో చెల్లిపోయింది. ఒక్క నవ్వుతో ప్రియుడిని గాలిలో తేలిపోయేలా చేసే పవర్ తప్పిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రేమికులు ఒకరికొకరు ప్రత్యేకంగా కనిపించేందుకు విభిన్నంగా ఆలోచిస్తున్నారు. అయితే ఈ విషయంలో విచ్చలవిడితనం కనిపిస్తే దాడులు తప్పవంటున్నారు కొందరు వ్యతిరేకవాదులు. నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం..

● నేడు ప్రేమికుల దినోత్సవం

ప్రేమికులు ఖరీదైన కానుకలతో సర్‌ప్రైజ్ చేసుకునేందుకు సన్నద్ధమయ్యారు. మదిలో ఉన్న ప్రేమ సందేశాలను ఇచ్చి పుచ్చుకునేందుకు మార్కెట్లో ఎన్నో వస్తువులు అందుబాటులోకి వచ్చేశాయి. స్టేషనరీ దుకాణాలు యువతీ, యువకులతో కళకళలాడుతున్నాయి. తమ ప్రేమ చిరకాలం ఉండాలన్నా, తీపి గుర్తుగా మిగిలిపోవాలన్నా, మధుర జ్ఞాపకాలను ఫ్రేమ్‌లో బంధించాలన్నా ఎన్నో గిఫ్ట్‌లు అందుబాటులో ఉన్నాయంటున్నారు ప్రేమికులు. అలాగే ప్రేమికుల కోసం ఎన్నో రకాల విదేశీ చాక్లెట్లు నోరూరిస్తున్నాయి. హార్ట్ షేప్‌లో ఉండే ఈ తీపిగుర్తులు ప్రత్యేక ప్యాక్‌లతో సిద్ధంగా ఉన్నాయి. గతంలో కంటే ఈసారి వాలెంటైన్స్ డేకి ప్రత్యేక గిఫ్ట్‌లు అందుబాటులో ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

● ఆన్‌లైన్‌లో ప్రేమజోరు..

పెరిగిన టెక్నాలజీకి అనుగుణంగా ఆన్‌లైన్‌లో కూడా ప్రేమ జోరందుకుంది. ప్రేమికుల రోజు సందర్భంగా ఆన్‌లైన్ షాపింగ్ సంస్థలు కూడా హంగామా సృష్టిస్తున్నాయి. ప్రత్యేక బొకేలతోపాటు చాక్లెట్స్, కేక్స్, విభిన్నమైన బహుమతులను రరకరాల ఆఫర్లతో అందుబాటులో ఉంచుతున్నాయి. అలాగే సోషల్ నెట్‌వర్క్‌లలో కూడా ప్రేమ సందేశాలు పంపించుకునేందుకు యువత సిద్ధమైంది. ప్రేమికుల కోసం పలు రెస్టారెంట్‌లు, హోటళ్లు కూడా బుధవారం ప్రత్యేక ఆఫర్లను ప్రకటించాయి. ఇదిలా ఉంటే ప్రేమికుల రోజును బహిష్కరిస్తామని, విచ్చలవిడిగా కనిపిస్తే ప్రేమికులను అడ్డుకుంటామని కొంతమంది వ్యతిరేకవాదులు హెచ్చరిస్తున్నారు.



- నెల్లూరు (విద్య)

జడ్పీ బడ్జెట్
రూ.374 కోట్లు

● రూ.297 కోట్ల ఖర్చుతో రూపకల్పన ● సభ్యుల ఏకగ్రీవ ఆమోదం

నెల్లూరు (జడ్పీ), ఫిబ్రవరి 13 : జిల్లా పరిషత్ 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను జడ్పీ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. బడ్జెట్ అంచనాలకు సంబంధించి నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన మంగళవారం అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బడ్జెట్‌పై జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డిప్యూటీ సీఈవో చిరంజీవులు సభ్యులకు వివరించారు. 2022-23 ఏడాది ఆదాయం రూ.157.89 కోట్లు రాగా రూ.161.05 కోట్లు ఖర్చయినట్లు చూపారు. 2023-24 బడ్జెట్ అంచనాలు రూ.366.89 కోట్లు కాగా ఖర్చు రూ.326.37 కోట్లు అయ్యిందని చూపారు. 2023-24 సవరణ అంచనాలు రూ.348.20 కోట్లు కాగా ఖర్చు రూ.281.26 కోట్లు అయినట్లు చూపారు. 2024-25 బడ్జెట్ అంచనాలు రూ.374.43 కోట్లు అని, రూ.297.42 కోట్లు ఖర్చవుతుందని, రూ.77 కోట్లు మిగులు ఉంటుందని అంచనాలు రూపొందించగా దీనికి సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

● ఆ బిల్లులు ఇప్పించడమ్మా..!

'రాష్ట్ర ప్రభుత్వ ఐదేళ్ల పాలన త్వరలో ముగుస్తుంది. ఈ నెల లేదా వచ్చే నెలలో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుంది. ఇప్పటికైనా చేసిన పనులకు బకాయిలు ఇప్పించడమ్మా.. మా పరువు కాపాడండమ్మా!' అంటూ పలువురు జడ్పీటీసీ సభ్యులు జడ్పీ చైర్‌పర్సన్‌కు మొరపెట్టుకున్నారు. సమావేశం అనంతరం మర్రిపాడు, కావలి జడ్పీటీసీ సభ్యులు మల్లు సుధాకర్‌రెడ్డి, రాఘవులు మాట్లాడుతూ సచివాలయాలు, నాడు-నేడు పనులు తదితర భవనాల నిర్మాణాలకు కాంట్రాక్టర్లు ఎవరూ రాలేదనానరు. దీంతో కార్యకర్తలను బతిమలాడి ఎమ్మెల్యేలు, మీపై ఉన్న నమ్మకంతో పనులు చేయించి ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు బిల్లులు మంజూరు చేయలేదని, దీంతో కార్యకర్తలు అప్పులపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రేపో, మాపో ఎన్నికల నోటిఫికేషన్ వస్తున్నందున ఇప్పటికైనా బిల్లులు ఇప్పించాలని కోరారు. నాడు-నేడు పనుల కింద దాదాపు రూ.7 కోట్ల బకాయిలు ఉన్నాయని, సచివాలయాలు, ఇతర భవనాలకు సంబంధించిన పనులు పూర్తయినా ఇంతవరకు ఎంబుక్‌లు సిద్ధం చేయలేదని, వాటన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కార్యకర్తలకు న్యాయం చేయాలని కోరారు. ఇసుక రవాణాకు సంబంధించి జరిమానాలు భారీగా విధిస్తున్నా జడ్పీకి రూపాయి కూడా మైనింగ్ శాఖ ఇవ్వడం లేదని, వాటిని రాబట్టాలని కోరారు. దీనిపై చైర్‌పర్సన్ స్పందిస్తూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లి బిల్లులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. జడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్ మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉన్నందున నిధులు అధికంగా కేటాయించాలని కోరారు.



జడ్పీ సమావేశ మందిరంలో ఖాళీగా ఉన్న కుర్చీలు



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

● ఎంపీలు, ఎమ్మెల్యేల డుమ్మా

ఈ బడ్జెట్ సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులు గైర్హాజరు అయ్యారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఇద్దరు రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బీద మస్తాన్‌రావు, ఎంపీలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, గురుమూర్తితోపాటు రాష్ట్ర మంత్రి సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు ప్రసన్నకుమార్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వరప్రసాద్, సంజీవయ్య, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు గైర్హాజరయ్యారు. సార్వత్రిక హడావుడి మొదలుకావడంతో ప్రచారాలపై దృష్టి సారించిన నేతలు జడ్పీ సమావేశంపై ఆసక్తి చూపలేదు. జిల్లాలోనే మంత్రి కాకాణితోపాటు ఎక్కువమంది ఎమ్మెల్యేలు ఉన్నా ఈ సమావేశానికి డుమ్మాకొట్టడం చర్చనీయాంశమైంది.

కావలి నుంచే పోటీ చేస్తా!

● నేటి మధ్యాహ్నం బహిరంగ సభ

● పీఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత సుధాకర్

కావలి (టౌన్): పార్టీ ఏదైనా తాను కావలి అసెంబ్లీ స్థానం నుంచే తాను పోటీ చేస్తానని పీఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ స్పష్టం చేసారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు కావలిలోని మినీ స్టేడియంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మంగళవారం కావలిలోని తన కార్యాలయంలో అయన మాట్లాడుతూ తాను ఏదైనా పార్టీ నుంచి పోటీ చేస్తానా లేదా స్వతంత్రంగా పోటీ చేస్తానా అనే ఊహాగానాలకు ఈ సభలో స్పష్టత ఇస్తానని పేర్కొన్నారు. ప్రజలు గెలిపిస్తారన్న నమ్మకంతోనే పోటీ చేస్తున్నానని, పార్టీ టికెట్లపై బరిలో నిలిచే వారంతా గెలవరని గెలిచేది ఒక్కరే అని, ఆ ఒక్కరు తానెందుకు కాకూదన్న విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. కాగా, కావలిలో జరుగుతున్న సభ ఏర్పాట్లను సుధాకర్ పరిశీలించారు.

నేటి నుంచి ఉద్యోగుల ఉద్యమబాట

● 27న చలో విజయవాడ

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 13 : తమ డిమాండ్ల సాధన కోసం బుధవారం నుంచి ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యమబాట పడుతున్నారు. ఉద్యోగ సంఘ నాయకులతో సోమవారం ప్రభుత్వ పెద్దలు జరిపిన చర్చలు ఫలించలేదు. దీంతో ఏపీజేఏసీ నాయకులు ఉద్యమ కార్యాచరణ ప్రకటించారు. తమ సత్తా ఏమిటో ఈ ఉద్యమం ద్వారా నిరూపిస్తామని నేతలు తేల్చి చెబుతున్నారు. బుధవారం ఉద్యోగులంతా నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతారు. తహసీల్దారు, సబ్ కలెక్టర్, కలెక్టర్‌లకు వినతిపత్రాలు అందచేస్తారు. 15, 16 తేదలలో నల్లబ్యాడ్జీలు ధరించి మధ్యాహ్న భోజన విరామ సమయంలో తాలూకా కేంద్రాలు, పాఠశాలల్లో నిరసన పాటిస్తారు. 17న తాలూకా కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలు, 20న జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తారు. అప్పటికీ ప్రభుత్వం దిగిరాకుంటే 27న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించి ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు ఏపీజేఏసీ రాష్ట్ర నాయకులు అన్నీ జిల్లాలో పర్యటించి చలో విజయవాడ విజయవంతానికి ఉద్యోగులను సన్నద్ధం చేయనున్నారు.

● ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొనాలి

డిమాండ్ల సాధన కోసం బుధవారం నుంచి ఉద్యోగులు ఉద్యమబాట పడుతున్నారని ఏపీజేఏసీ జిల్లా చైర్మన్ మన్నేపల్లి పెంచలరావు చెప్పారు. మంగళవారం ఎన్జీఓ హోంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీజేఏసీ ఆధ్వర్యంలో జరుగు తున్న ఈ ఉద్యమంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు భారీగా పాల్గొనా లని పిలుపునిచ్చారు. ఈ సమా వేశంలో జేఏసీ కన్వీనర్ నాయు డు వెంకటస్వామి, ఆర్టీసీ ఎన్ఎం యూ నాయకుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న పెంచలరావు

మెయిన్స్‌లో మెరుపులు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 13 : దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీలలో ఇంజనీరింగ్, బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వ హించే జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపారు. జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1వతేదీ వరకు రెండు విడతలుగా జరిగిన ఈ పరీక్షలకు జిల్లాలో 16వేల మందికి పైగా విద్యార్థులు హాజర య్యారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేయగా, కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రి త్వశాఖ ఆధ్వ ర్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పర్యవేక్షణలో ఈ పరీక్ష లను నిర్వహించారు. మంగళవారం విడు దలైన ఫలితాల్లో జిల్లా విద్యార్థులు పలు విభాగాల్లో ర్యాంకులను సొంతం చేసుకున్నారు. నారాయణ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థి షేక్ సూరజ్ 100 పర్సంటైల్‌తో జిల్లాలోనే అగ్రస్థానంలో నిలవగా, కృష్ణచైతన్య కళా శాలకు చెందిన జే హర్ష వర్ధన్ 99.82 పర్సంటైల్, ఓవెల్ విద్యా సంస్థలకు చెందిన ఎస్‌వీ సంతోష్‌కుమార్ యాదవ్ 99.838, శ్రీచైతన్య కళాశాలకు చెందిన డీ ధనుశ్రీ 97.08 పర్సం టైల్, విశ్వ సాయి విద్యాసంస్థలకు చెం దిన ఎం దివ్యశ్రీ 97.82, సీహెచ్ యశ్వంత్ 97.52 పర్సంటైల్‌ను సాధించారు.

జేఈఈ ఫలితాల విడుదల
ర్యాంకులు సాధించిన జిల్లా విద్యార్థులు



ఐఐటీలో సీటు సాధిస్తా

చదువుపై ఉన్న మక్కువతో విద్యలో రాణిస్తు న్నాను. నగరంలోని ధనలక్ష్మీపురంలో నివాసం ఉంటున్నాము. తల్లిదండ్రులు మల్లీశ్వరి, ధరియా సాహెబ్ ప్రోత్సాహం, నారాయణ విద్యా సంస్థలో అత్యుత్తమ విద్యా బోధనతో మెయిన్స్‌లో 100 పర్సంటైల్ సొంతం చేసుకున్నాను. ఇదే స్ఫూర్తితో రానున్న మెయిన్స్-1 అడ్వాన్స్‌డ్‌లో కూడా అత్యు త్తమ ర్యాంకు సొంతం చేసుకుని భవిష్యత్‌లో ఐఐటీలో సీటు సాధించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నాను.

- షేక్.సూరజ్, 100 పర్సంటైల్



సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా రాణిస్తా

కావలికి చెందిన తాను చిన్నతనం నుంచి తల్లిదండ్రులు వెంకారెడ్డి, అపర్ణ అందించిన ప్రోత్సాహంతో విద్యలో ఉత్తమంగా రాణిస్తున్నాను. ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన నేను జేఈఈపై దృష్టి సారించాను. జేఈఈ మెయిన్స్‌లో 99.92 పర్సంటైల్‌ను సాధించిన నేను రానున్న అడ్వాన్స్‌డ్‌లో కూడా ఉత్తమ ర్యాంకు సాధించేందుకు కృషి చేస్తాను. అధ్యాపకుల కృషి, తల్లిండ్రుల ప్రోత్సాహంతో మున్ముందు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా రాణించేలా విద్యనభ్యసిస్తాను.

- బీ రితేష్ రెడ్డి, 99.92 పర్సంటైల్



ఎగ్జిబిట్‌ను పరిశీలిస్తున్న మంత్రి కాకాణి

సైన్స్ పరిశోధనలు విస్తృతంగా జరగాలి

● వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి

నెల్లూరు (విద్య) : మానవాళికి ఉపయోగ పడేలా సైన్స్ పరిశోధనలు విస్తృతంగా జరగాలని, దీనికి పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో పునాదులు వేసి వారిని ఉత్తమ వైజ్ఞానికులుగా తీర్చిదిద్దాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. నగరంలోని దర్గామిట్ట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లాస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన (ఇన్‌స్పైర్ మనక్)ను మంత్రి కాకాణి, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ పి.స్రవంతిలు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంలో వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో దోహదపడతాయన్నారు. సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టేలా విద్యార్థి దశ నుంచే సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకోవాలన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఇతర దేశాల కంటే భారత్ ఏమాత్రం తీసిపోకుండా అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నామన్నారు. డీఈఓ రామారావు మాట్లాడుతూ విద్యార్థుల జీవితాల్లో సైన్స్ కీలకపాత్ర పోషిస్తుందన్న విషయాన్ని గుర్తించి శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఖగోళ దర్పణాన్ని, విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనలను మంత్రి సందర్శించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, విజయా డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఇన్‌స్పైర్ మనక్ పర్యవేక్షకులు గుజరాత్‌కు చెందిన నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ మహ్మద్ రయాష్ షేక్, నెల్లూరు, కావలి డిప్యూటీ ఈఓలు ప్రసన్నలక్ష్మి, రఘురామయ్య, నెల్లూరు ఎంఈఓలు మురళీధర్, బిక్షాలు, అబ్దుల్ హమీద్, ఉత్తమ ఉపాధ్యాయులు నెల్లూరు ఫణికుమార్, పాఠశాల హెచ్ఎం కృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన విజేతలతో అధికారులు

రాష్ట్ర పోటీలకు 13 ప్రాజెక్టులు

జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో 13 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. కాగా ఓవెల్ పాఠశాలకు చెందిన కె.ఆమోగ్ వర్ష (మల్టీఫంక్షనల్ రోడ్ రిపేరింగ్ రోబోట్) ప్రథమ, సౌత్‌మోపూరు జడ్పీహెచ్ఎస్‌కు చెందిన టి.ప్రణ్విక(మూవబుల్ అండ్ అడ్జెస్టబుల్ వాటర్‌టాప్) ద్వితీయ, ఈదూరు జడ్పీహెచ్ఎస్‌కు చెందిన డి.వెంకట. దరణ్ (ఫార్మర్స్ లైఫ్ సేవింగ్ స్టిక్) తృతీయ స్థానాలు సాధించారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యాక్రమంలో విజేతలకు డీఈవో రామారావు, ఇతర అధికారులు బహుమతులు అందజేశారు.

ఆలోచించారు..
ఆవిష్కరించారు!

ఆటోమేటిక్ ఇరిగేషన్.. ఫార్మర్ లైఫ్ సేవింగ్ స్టిక్స్.. అండర్ గ్రౌండ్ ఎలక్ట్రిసిటీ ఫాల్ట్.. జంక్ ఫుడ్ ప్రాబ్లమ్స్ ... స్మార్ట్ డస్ట్‌బిన్ ఫర్ స్టార్ట్ సిటీస్.. ఇంటెలిజెంట్ హెల్మెట్.. ఇలా బాలశాస్త్రవేత్తలు రూపొందించిన ఎగ్జిబిట్స్ పెద్దలను సైతం ఆలోచింపజేశాయి. విద్యార్థులు భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలంటే శాస్త్రీయ ఆలోచనలకు పదును పెట్టాలి. ఆ దిశగా వారిని ప్రోత్సహించేందుకు జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో వివిధ పాఠశాలల విద్యార్థులు తయారు చేసిన 154 ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శనకు ఉంచారు. ఈ పోటీల్లో విద్యార్థులకు ఒకరినొకరు పోటీపడుతూ ఎగ్జిబిట్‌లను ప్రదర్శనలో ఉంచి వాటి అవసరాలు, ఉపయోగాలను తెలియచేశారు. పలువురు ప్రముఖులు, అధికారులతో పాటు వివిధ పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తరలివచ్చి ప్రదర్శనను తిలకించారు.

- నెల్లూరు (విద్య)

పంటలకు సకాలంలో నీటి సరఫరా

- విద్యార్థి : ఆర్.గీతాలక్ష్మి (10వతరగతి)
- గైడ్ టీచర్ : పి.వెంకటరమణమ్మ
- పాఠశాల : ఏపీటీడబ్ల్యుఆర్‌జి స్కూల్(రాపూరు)



ఆటోమేటిక్ ఇరిగేషన్ సాయిల్ మాయిశ్చర్ కంటెంట్ కంట్రోల్ ప్రాజెక్ట్ వ్యవసాయ భూముల్లో నీటి సాంద్రత తగ్గిన సమయంలో పంటకు సరైన సమయంలో నీటిని అందించేందుకు ఈ ప్రాజెక్ట్ ఎంతగానో ఉపయోగపడుతుంది. భూమి సాంద్రతను బట్టి నీరు ఎంత అవసరం, ఏ సమయంలో అందించాలన్న విషయాలను సెన్సార్ ద్వారా తెలియచేస్తుంది. ఇది రైతులకు ఎంతో ఉపయుక్తమైన ప్రాజెక్ట్. అతితక్కువ ఖర్చుతో దీన్ని సిద్ధం చేసుకుంటే నీటి సమస్యను కొంత వరకు తగ్గించుకోవచ్చు.

సకాలంలో చెత్తను తొలగించడం

- విద్యార్థి : బి.మనోజ్ (7వతరగతి)
- గైడ్ టీచర్ : రత్నారెడ్డి
- పాఠశాల : జడ్పీహెచ్ఎస్, అనంతసాగరం



స్మార్ట్ డస్ట్‌బిన్ ఫర్ స్మార్ట్ సిటీస్ ప్రాజెక్ట్‌తో చెత్తను సకాలంలో తొలగించవచ్చు. అన్ని కాలనీల్లో చెత్త కుండీలు, చెత్త డంపింగ్ ప్రదేశాల్లో దీన్ని ఏర్పాటు చేస్తే చెత్త పూర్తిగా నిండి, అపరిశుభ్రంగా ఉన్న వెంటనే సెన్సార్ ద్వారా సంబం ధిత మునిసిపల్ అధికారుల మొబైల్‌కు సమాచారం అందజేస్తుంది. వెంటనే సంబం ధిత సిబ్బంది ఏ ప్రాంతంలో చెత్త పేరుకుపోయిందో ఆ ప్రాంతానికి చేరుకుని వెంటనే శుభ్రం చేసేలా దీన్ని రూపొందించారు.



రైతుల ప్రాణాలకు రక్షణ

- విద్యార్థులు : జలీల్, శ్రీతేజ (10వ తరగతి)
- గైడ్ టీచర్ : ఎన్‌పీసీ ఉదయ్‌భాస్కర్
- పాఠశాల : జడ్పీహెచ్ఎస్, ఈదూరు, టీపీగూడూరు

రైతులు పొలాల్లో తిరిగే సమయంలో పాముకాటుకు గురై మృతి చెందిన సందర్భాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించారు. ప్రమాదాల నుంచి రైతులు తమను తాము కాపాడుకునేందుకు ఈ స్టిక్ ఉపయోగపడుతుంది. ఈ సేవింగ్ స్టిక్స్‌లో వైబ్రేషన్ వచ్చి అవి పాములను దూరంగా వెళ్లిపోయాలా చేస్తాయి. దీనికి టార్చ్‌లైటు కూడా ఉండటం వల్ల చీకట్లో కూడా రైతులు ధైర్యంగా పొలంలోకి వెళ్లి పనులు చేసుకోవచ్చు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



- విద్యార్థి : కె.పావని (10వతరగతి)
- గైడ్ టీచర్ : ఎం.ఛాయాకుమారి
- పాఠశాల : జడ్పీహెచ్ఎస్ బాలికలు, కావలి

జంక్ ఫుడ్ తినడం వల్ల వచ్చే వ్యాధులు- చిరు ధాన్యాలతోనే ఎముకల ధృడత్వం పేరుతో తయారు చేసినదే ఈ ప్రాజెక్ట్. నేటి ఆధునిక సమాజంలో జంక్ ఫుడ్ తింటూ ప్రతి ఒక్కరూ అనారోగ్యానికి గురవుతున్నారు. వీటి నుంచి తప్పించుకునేందుకు ఆరోగ్యాన్ని పరిరక్షించు కునేందుకు చిరుధాన్యాలు ఎంతో ఉపయోగపడతాయి. వీటిలో పీచు పదార్థాలు అధికంగా ఉండడంతో మలబద్ధకం, కాల్షియం, ఫాస్పరస్ ఉండడంతో ఎముకల ధృడత్వం కలిగి ఉండటం, రక్తహీనత నుంచి కాపాడడం, గుండె జబ్బుల నుంచి నివారణ పొందవచ్చు.



భూగర్భ విద్యుత్ పునరుద్ధరణ

- విద్యార్థి : లక్ష్మీసోనియా (10వతరగతి)
- గైడ్ టీచర్ : మల్లిఖార్జునరావు
- పాఠశాల : వాత్సల్య, నెల్లూరు

అండర్ గ్రౌండ్ ఎలక్ట్రిసిటీ ఫాల్ట్ ద్వారా భూగర్భం నుంచి సరఫరా అయ్యే విద్యుత్ సమస్యలను కనుగొని పరిష్కరించేందుకు ఈ ప్రాజెక్ట్ ఎంతగానో ఉపయోగపడుతుంది. అండర్ గ్రౌండ్‌లో వేసే విద్యుత్ సరఫరా, ఇతర కేబుల్స్ నుంచి వచ్చే విద్యుత్ సరఫరా కొన్ని సందర్భాల్లో ఇబ్బందులు కలిగించిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఈ ప్రాజెక్ట్ ద్వారా సెన్సార్‌ను ఉపయోగించి ఏ ప్రాంతంలో సమస్య ఉందో ముందే పసిగట్టి అలర్ట్ చేస్తుంది. వెంటనే సంబంధిత సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్లి సమస్యను పరిష్కరించేలా దీన్ని సిద్ధం చేశారు.

రైల్వేలో విద్యుత్ ఆదా కోసం..

- విద్యార్థి :ఎం.ప్రతాప్ (10వతరగతి)
- గైడ్ టీచర్ : శ్రీహరి
- పాఠశాల : జడ్పీహెచ్ఎస్-ఇస్కపల్లి, అల్లూరు

ఎనర్జీ సేవింగ్ సిస్టమ్ ఫర్ రైల్వే ప్లాట్‌ఫారం ప్రాజెక్ట్ ద్వారా ఇంధనం, విద్యుత్‌ను ఆదా చేయడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. రైలు ప్లాట్‌ఫారం మీదకు వచ్చే సమయం, వెళ్లే సమయంలో మాత్రమే విద్యుత్ వెలిగేలా దీన్ని రూపొందించారు. దీనివల్ల ఇంధన వినియోగంతోపాటు విద్యుత్ కూడా ఆదా అవుతుంది. రైలు మొదటి కోచ్ నుంచి చివరి కోచ్ వరకు ఈ పద్ధతి ద్వారా విద్యుత్‌ను అందిం చేలా సెన్సార్‌లు పనిచేస్తాయి. అవసరం లేని సమయంలో లైట్లన్నీ ఆరిపోయేలా దీన్ని సిద్ధం చేశారు.



ఈ హెల్మెట్ పెట్టుకుంటేనే రైడ్!

- విద్యార్థులు : కె.మల్లిక, ఎం.సిరి (10వతరగతి)
- గైడ్ టీచర్ : యూ.సుధాకర్‌రావు
- పాఠశాల : జడ్పీహెచ్ఎస్, చిన్నచెరుకూరు, టీపీ గూడూరు



ఇంటెలిజెంట్ హెల్మెట్ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పని చేస్తుంది. ప్రధానంగా ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదంలో అనేకమంది మృతి చెందుతున్నారు. వీరిని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్ట్‌ను తయారైంది. హెల్మెట్ ధరిస్తేనే వాహనం స్టార్ట్ అయ్యేలా లేనిపక్షంలో అలర్ట్ మెసేజ్ వస్తుంది. దీనివల్ల ఖచ్చితంగా వాహనాదారులు హెల్మెట్ ధరించి వాహనాన్ని నడుపుతారు. ప్రమాదాలను కూడా నివారించవచ్చు.

ప్రజావేదిక నిర్వహణపై అసహనం

● అధికారుల తీరుపై వైసీపీ నేతల మండిపాటు

వరికుంటపాడు, ఫిబ్రవరి 13: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం డ్వామా పీడీ వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ ప్రజావేదిక నిర్వహణ తీరుపై వైసీపీ నాయకులు అసహనం వ్యక్తం చేశారు. అధికారుల తీరుపై మండిపడ్డారు. దీంతో కొంతసేపు ఉత్కంఠ నెలకొంది. మండలంలో ఉపాధి పనులపై ఇటీవల సామాజిక తనిఖీ బృందాలు తనిఖీలు చేపట్టాయి. ఈ క్రమంలో ఈనెల9న ప్రజావేదిక నిర్వహించాల్సి ఉండగా వాయిదా వేశారు. మంగళవారం నిర్వహించగా పీఏసీఎస్ చైర్మన్ గుంటుపల్లి రామాంజనేయులు వేదిక వద్దకు చేరుకొని అధికారులను నిలదీశారు. సమాచారం తెలపకుండానే మొక్కుబడిగా నిర్వహించడం ఎంతవరకు సమంజసమని అసహనం వ్యక్తం చేశారు. సర్పంచి, పంచాయతీ కార్యదర్శుల సంతకాలను ఫోర్జరీ చేసి, పనులు చేపట్టారని కాంచెరువు సర్పంచి భర్త మందలపు తిరుపతినాయుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. అలాగే గణేశ్వరాపురంలోనూ ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు 1100 సిమెంటు బస్తాలు ఇచ్చి ఎంబుక్కులో మాత్రం 2వేలు మంజూరు చేసినట్లు నమోదు చేశారంటూ వైసీపీ నాయకులు బాదం వెంకటనారాయణరెడ్డి ఫిర్యాదు చేశారు.

● రికవరీకి ఆదేశం

కాగా మండలంలో పలు పంచాయతీల్లో చోటు చేసుకున్న అవినీతికి సంబంధించి రూ. 47,675 రికవరీకి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఏపీడీ గాయత్రీదేవి, ఎంపీడీవో శ్రీదేవి, ఏపీఎం ఆజమ్‌ఖాన్, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అసహనం వ్యక్తం చేస్తున్న రామాంజనేయులు

300 పుస్తకాల బహూకరణ


మాట్లాడుతున్న హెచ్ఎం అనంతలక్ష్మి

ఆత్మకూరు, ఫిబ్రవరి 13 : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి ఆమంచర్ల నటరాజన్ జ్ఞాపకార్థం ఆయన కుమార్తె సరళాదేవి 300 పుస్తకాలను మంగళవారం బహూకరించారు. అనంతరం నటరాజన్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం అనంతలక్ష్మి మాట్లాడుతూ పుస్తక పఠనంతో విద్యార్థులు తమ వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవడం సులభమని తెలిపారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ వంటేరు మల్లికార్జున, ఉపాధ్యాయులు డాక్టర్ ప్రసాద్, మధుసూదన శాస్త్రి, బీసీ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం


నగదు అందుకుంటున్న క్రీడాకారుడు

ఆత్మకూరు, ఫిబ్రవరి 13 : పట్టణానికి చెందిన జాతీయ క్రీడాకారుడు పీ సాయికిరణ్‌కి డాక్టర్ బీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొమ్మిరెడ్డి తారక్‌నాథ్‌రెడ్డి అందజేసిన రూ. 10వేల నగదును మంగళవారం రిటైర్డ్ హెచ్ఎం ఎండీ సాధిక్‌హుస్సేన్ అందజేశారు. సాయికిరణ్ నాలుగేళ్లుగా మాస్టర్‌లార్ట్స్‌లో భాగమైన పెన్‌కాక్ శిలాత్ క్రీడలో జాతీయ స్థాయిలో కాంస్య పతకం, సౌత్ ఇండియా స్థాయిలో నాలుగు బంగారు పతకాలు సాధించాడు. ఈ క్రమంలో మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు ఈ ఆర్థిక సాయం అందచేశారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభం

అనంతసాగరం, ఫిబ్రవరి 13: మండలంలో పలు అభివృద్ధి పనులను బుధవారం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రారంభిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతసాగరం బస్టాండ్ సెంటర్‌లో దివంగత మాజీ జడ్పీటీసీ బుట్టి కృష్ణారెడ్డి పేరిట ఆయన కుంటుంబ సభ్యులు నిర్మించిన బస్టాండ్ ప్రాంగణాన్ని ప్రారంభిస్తారు. అలాగే పశువైద్యశాల భవనం, ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్మించిన అతిథి గృహం, సచివాలయం-2 భవనాలను ఆయన ప్రారంభిస్తారని తెలిపారు.

సచివాలయాల తనిఖీ

అనంతసాగరం, ఫిబ్రవరి 13: మండలంలోని అనంతసాగరం, లింగంగుంట గ్రామ సచివాలయాలను ఎంపీడీవో తాజ్‌మస్తూర్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని కోరారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

సచివాలయ సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

సీతారామపురం, ఫిబ్రవరి 13 : సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలని ఎంపీడీవో ఎస్‌కే అబ్దుల్ కలాం ఆజాద్ కోరారు.ఆయన మంగళవారం పబ్బులేటిపల్లి సచివాలయాలన్ని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రోజు మూడు నుంచి ఐదు గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహి ంచాలన్నారు.అనంతరం పలు రిజిష్టర్ల పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ భార్గవి,పంచాయతీ కార్యదర్శి పిడుగు రవీంద్ర,డీఏ జెలిల్ తదితరులు పాల్గొన్నారు.

గానుగపెంటపెల్లిలో ఆరోగ్య సురక్ష

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 13: మండలంలోని గానుగపెంటపల్లిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఈశ్వరమ్మ, వైసీపీ కన్వీనర్ ఓబులరెడ్డిలు మాట్లాడుతూ ఆయుష్మాన్‌భారత్, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని వెంటనే పూర్తి చేయాలన్నారు. అనంతరం రోగులకు వైద్యులు పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి ఎస్ వరలక్ష్మి, వైద్యులు శివకల్పన, షంషుద్దీన్, అనుసిక్తా, నాయకులు జీ.శ్రీనివాసులురెడ్డి, శ్రీరాములు, వెంకటమ్మ, హెచ్ఈ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతం


సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు

సంగం, ఫిబ్రవరి 13: స్థానిక తూర్పుదళితవాడలోని మాతాపరమేశ్వరి ఆలయంలో మాఘ మాసం సందర్భంగా మంగళవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితులు ఆధ్వర్యంలో వ్రతం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాలకు శుభ్రమైన తాగునీరు


వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజుల్లాలా తదితరులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 13 : మున్సిపాలిటీలోని అన్ని ప్రాంతాల ప్రజలకు శుభ్రమైన తాగునీటిని అందించే దిశగా ప్రత్యేక దృష్టి సారించామని మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజుల్లాలా తెలిపారు. మంగళవారం ఆయన పట్టణ ప్రజలకు శుద్ధిచేసిన తాగునీటిని సరఫరా చేస్తున్న వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఆ ప్రాంతంలో అపరిశుభ్రంగా ఉండడంతో యుద్ధప్రాతిపదికన శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో అలసత్వం తగదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్, ఏఈ జూపల్లి ప్రసాద్, ఆర్ఐ షేక్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

జీవోల విడుదలకు మున్సిపల్ కార్మికుల ధర్నా


ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 13 : మున్సిపల్ కార్మిక సంఘాలతో చేసుకున్న ఒప్పందం మేరకు జీవోలను విడుదల చేయాలని కోరుతూ మున్సిపల్ కార్మిక సంఘం(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆ జీవోలను ప్రభుత్వం విడుదల చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం కమిషనర్ ఫజుల్లాలాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జే నాగరాజు, బీ హజరత్తయ్య, ఎం చెంచయ్య, టీ నాగార్జునరావు తది తరులు పాల్గొన్నారు.

మర్రిపాడులో విజయీభవ యాత్ర


మంచినీటి ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు, ఫిబ్రవరి 13: మండల కేంద్రంలో మంగళవారం జరిగిన విజయీభవ యాత్రలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా బస్టాండ్ సెంటర్‌లో నిర్మించిన బస్‌షెల్టరును ప్రారంభించారు. అనంతరం బైక్ ర్యాలీగా వెళ్లి ఎస్సీ కాలనీలో మంచినీటి ప్లాంట్‌ను, బాలుపల్లిలో ఆర్‌బీకేను, పాలకేంద్రాన్ని ప్రారంభించి, సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నేతలు శ్రీనివాసులు నాయుడు, సోమల మాదవ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం : ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మంగళవారం మండలంలోని అయ్యవారిపల్లి, సింగరెడ్డిపల్లి గ్రామాల్లో విజయ సంకల్ప యాత్ర పేరుతో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రమణరెడ్డి,ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి,వైసీపీ నాయకులు సుబ్బారెడ్డి, బాలినేని మాబయ్య, అయ్యవారిపల్లి సర్పంచి దుగ్గయ్య, ఎంపీటీసీ పాలగిరి అల్లూరురాజు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్వోల వద్ద ఓటర్ల జాబితా

చేజర్ల, ఫిబ్రవరి13 : మండలంలోని అన్ని గ్రామాల ఓటర్ల జాబితా ఆయా బీఎల్‌వోల వద్ద అందుబాటులో ఉందని తహసీల్దార్ కే.గోపిక్రిష్ణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వాటిని ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద కూడా డిస్‌ప్లే చేశామన్నారు. ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న వారు గ్రామాల్లో బీఎల్‌వోలు విచారణ అనంతరం స్వీకరిస్తామన్నారు. కొత్తగా చేరేవారు ఫారం-6ను పూర్తి చేయాలని తెలిపారు.

డీటీ బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 13: డిప్యూటీ తహసీల్దారు(డీటీ)గా పీ.కృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న డీటీ ఫజిహను సీతారామపురానికి బదిలీ చేశారు. చేజర్ల డీటీగా పనిచేస్తున్న పీ.కృష్ణను ఇక్కడికి బదిలీ చేశారు.

నాడు-నేడు పనుల పరిశీలన

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 13: మండలంలోని దుర్గంపల్లి పాఠశాలలో మంగళవారం ఎంఈవో షేక్ మస్తాన్‌వలి మనబడి నాడు-నేడు రెండో విడత పనులను పరిశీలించారు. మరుగుదొడ్ల పనులను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు. అనంతరం విద్యార్థుల అభ్యసన, పఠనా సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జాఫర్‌అహ్మద్, వెంకటరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మరుగుదొడ్లు పరిశీలిస్తున్న ఎంఈవో మస్తాన్‌వలి

పేదలకు భారంగా జగనన్న ఇళ్ల నిర్మాణాలు!

● నిర్మించుకోకుంటే పట్టాలు రద్దు చేస్తామని బెదిరింపు ● అధికారుల ఒత్తిడితో శంకుస్థాపన ● పిల్లర్ల దశ దాటని వైనం

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 13 : మండలంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పేదలకు భారంగా మారాయి. సొంతిల్లు వస్తుందన్న ఆశకు ఐదేళ్లు పూర్తవుతున్నా కలమాత్రం నెరవేరలేదు. ముందుగా తామే ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు అప్పగిస్తామని చెప్పిన ప్రభుత్వ పెద్దలు, అధికారులు అంతలోనే లబ్ధిదారుడే నిర్మించుకోవాలని చెప్పారు. ఎవరికి ఎలా ఇష్టమైతే అలా నిర్మించుకుంటానంటే దానికి అవకాశం ఇస్తాం అని గొప్పగా చెప్పారు. దీంతో పెరిగిన ధరలు, సౌకర్యాలు లేని ప్రాంతాల్లో ఇల్లు కట్టుకోవాలంటే కష్టమేనని లబ్ధిదారులు వెనకంజ వేశారు. దీంతో లబ్ధిదారులపై దండోపాయాలు మొదలుపెట్టారు. ఇంటి పనులు మొదలు పెట్టకపోతే ఇచ్చిన స్థలాన్ని రద్దు చేస్తామంటూ అధికారులు ఒత్తిడి చేయడంతో పాటు బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ క్రమంలో లబ్ధిదారులు అక్కడక్కడ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టి పునాదుల వేసి వదిలేశారు. ఈ విధంగా మండలంలోని 21 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో పోలినేనిపాలెం, జమీన్‌ఉప్పలపాడు, చుండి పంచాయతీలలో లేఅవుట్‌లు వివిధ కారణాలతో కోర్టులో ఉన్నాయి. మిగిలిన పంచాయతీలలో 33 లేఅవుట్‌లు వేసి 841 మందికి పట్టాలు ఇచ్చారు. అయితే అంకభూపాలపురంలో 35 ఇళ్లు, కాకర్లవారిపాలెంలో 8, నలదలపూరులో 3, శామీరపాలెం ఎస్టీ కాలనీలో 2, వలేటివారిపాలెంలో 4, అమ్మపాలెంలో 4 ఇళ్లు మాత్రమే పనులు ప్రారంభించారు. జగనన్న కాలనీల్లో ఇల్లు నిర్మించుకోడానికి ప్రభుత్వం 4 విడతల్లో రూ.1.80 లక్షలు చెల్లిస్తుంది. నిర్మాణానికి అవసరమైన 90 కట్టలు సిమెంటు, 482 కిలోల ఇనుము, అందిస్తారు. వీటికి సంబంధించిన మొత్తాన్ని రూ.1.80 లక్షల్లో మినహాయించుకుంటారు. ఈ క్రమంలో పెట్టుబడులు పెట్టలేక ఇళ్ల నిర్మాణాలకు మంగళం పాడారు. దీంతో అధికారులు, వలంటీర్లు ఫోన్లు చేసి ఒత్తిడి తెస్తున్నారు. ఈ క్రమంలో ఏమి చేయాలో అర్థంకాని అయోమయస్థితిలో ఉన్నారు. ఇంటి నిర్మాణం చేపడితే అప్పుల పాలవడం ఖాయమని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.


వలేటివారిపాలెంలో పిల్లర్ల దశ దాటని ఇల్లు

సీఎం జగన్ గిరిజనులను ఉద్ధరించిందేమీ లేదు


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

కావలి, ఫిబ్రవరి 13: వైసీపీ పాలనలో సీఎం జగన్ గిరిజనులను ఉద్ధరించింది ఏమీ లేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, గిరిజన నేత మొగిలి కల్లయ్య తెలిపారు. ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో కల్లయ్య మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా ఈ ప్రభుత్వం దుర్మార్గ పాలన చేసిందన్నారు. అందరూ ఏకమై తిరుగుబాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. 16 గిరిజన సంక్షేమ పథకాలు తొలగించి, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు నిర్వీర్యం చేస్తూ గిరిజనులకు సీఎం జగన్ తీరనిద్రోహం చేశారన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులనే గిరిజనులు అడుగుతున్నారు తప్ప వైసీపీ నేతల అక్రమాలలో వాటాలు అడగటంలేదన్నారు. గిరిజనుల హక్కులను కాలరాసిన జగన్మోహన్ రెడ్డి రాజ్యాంగబద్ధమైన పదవికి ఎలా అర్హుడవుతాడన్నారు. రాష్ట్రంలోని గిరిజనులంతా ఏకమై ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, నాయకులు గుండ్లపల్లి మురళి, శివ, అంబటి కిషోర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు : ఏపీజీబీ ఆర్ఎం


ఖాతాదారులతో మాట్లాడుతున్న ఏపీజీబీ ఆర్ఎం

కావలిరూరల్, ఫిబ్రవరి 13: ఖాతాదారులకు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో అందిస్తున్న మెరుగైన సేవలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు ఆ బ్యాంక్ రీజినల్ మేనేజరు మోహన్‌రెడ్డి తెలిపారు. కావలిరూరల్ మండలం రుద్రకోట ఆంధ్రప్రగతి బ్యాంకు పరిసర ప్రాంతాల ప్రజల వద్దకు మంగళవారం ఆయన వెళ్లి ఖాతాదారులతో నేరుగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు సేవలను పూర్తిగా వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. సమీపంలోని రామాయపట్నం పోర్టు నిర్మాణానికి ప్రభుత్వం రైతుల భూములు తీసుకుని ఇస్తున్న పరిహారంను అధిక వడ్డీ కోసం ఇతరులకు ఇచ్చి మోసపోవద్దన్నారు. బ్యాంకు సేవలను ఉపయోగించుకుని ఆర్థిక భద్రత పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రకోట బ్రాంచి మేనేజరు శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

కందుకూరు, ఫిబ్రవరి 13: కందుకూరు పట్టణంలో ఇటీవలి కాలంలో మృతి చెందిన నలుగురు గృహసారథుల కుటుంబాలకు ఎమ్మెల్యే మహీధరరెడ్డి మంగళవారం ఆర్థిక సహాయం అందించారు. శ్రీనగర్ కాలనీకి చెందిన పారాబత్తిన మాధవరావు, శ్రీరామకాలనీకి చెందిన కలిశెట్టి బాలకోటయ్య, కేసరిగుంట కాలనీకి చెందిన పొట్లూరి నాగభూషణం, సంతోష్‌నగర్‌కు చెందిన షేక్ అమీర్ బాషాల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.75వేలు వంతున మహీధరరెడ్డి వ్యక్తిగతంగా ఆర్థికసహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబాలను పరామర్శించి మనోధైర్యం కల్పించారు.

ప్రభుత్వ హామీలు అమలు చేయాలి

● మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా



కావలి : మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా



కందుకూరు : ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కావలి, ఫిబ్రవరి 13: మున్సిపల్ కార్మికులకు సమ్మె సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధసంస్థ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన ఈ ధర్నాలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ సమ్మెకాలంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు విడుదల చేసిన జీవోలను అమలు చేయాలని మిగిలిన హామీలకు సంబంధించిన జీవోలను విడుదల చేయాలని కోరారు. డ్రైవర్లుకు హెల్త్ అలవెన్స్ రూ.6,000 ఇవ్వాలని, కార్మికులకు పండుగ అడ్వాన్స్ వెయ్యి రూపాయలు ఇవ్వాలని, సమ్మెకాలపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే డైలీ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని, కార్మికులకు సబ్బులు, కొబ్బరినూనె, చెప్పులు, యూనిఫాం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మల్లె అంకయ్య, కార్యదర్శి గుంజి కిషోర్, కావలి అధ్యక్షుడు ఎండ్లూరి ఆదినారాయణ, కార్యదర్శి తన్నీరు వెంకటేష్, సహకార్యదర్శి వై.రవి, గుంజి అంకయ్య, తన్నీరు పద్మ, రాజేష్ పాల్గొన్నారు.

కందుకూరు : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ కార్మికుల వేతనాల పెంపు జీవోను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో యూనియన్ నాయకురాలు కాకుమాని రమణమ్మ మాట్లాడుతూ ఇటీవల డిమాండ్ల సాధనకై మున్సిపల్ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేసిన సందర్భంలో జీతాలు పెంచుతామని ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు సమ్మె విరమించామని, అయితే నేటికీ వేతనాల పెంపుకై జీవో విడుదల చేయకపోవడం దారుణమని విమర్శించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బూసి సురేష్‌బాబు, వై.ఆనంద్ మోహన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు నాగేశ్వరరావు, మహేంద్ర, కత్తి మహేష్, శేషమ్మ, వెంకటలక్ష్మి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం పెంపొందించడమే జేవీవీ లక్ష్యం


కళాజాత ప్రదర్శనలో జేవీవీ ప్రతినిధులు

కందుకూరు, ఫిబ్రవరి 13: విద్యార్థులలో ప్రశ్నించేతత్వం, శాస్త్రీయదృక్పథం పెంపొందించడమే జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) లక్ష్యమని రాష్ట్ర నాయకుడు మురళీధర్ పేర్కొన్నారు. జేవీవీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సైన్స్ కళాజాత ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జాత కన్వీనర్ మురళీధర్ మాట్లాడుతూ మారుతున్న సమాజంలో అశాస్త్రీయ ధోరణులు పెరిగిపోతున్నాయని, పర్యావరణ కాలుష్యం అధికమవుతున్నదని, సాంకేతిక విజ్ఞానం యువతను పెడదోవ పట్టిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులకు వ్యతిరేకంగా సమాజంలో మార్పు తేవటమే లక్ష్యంగా జేవీవీ కళాజాతలకు రూపకల్పన చేసిందని వివరించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు త్రిమూర్తులు, కే.కృష్ణారెడ్డి, జీవీ మాల్యాద్రి, విప్రనారాయణ, మహల్యరావు, శరత్, చిత్తారు వెంకటేశ్వర్లు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలాన్ని పరిశీలించిన అధికారులు


విచారిస్తున్న తహసీల్దారు దుర్గేశ్వరరావు

అల్లూరు, ఫిబ్రవరి 13 : మండలంలోని ఇందుపూరు దళితవాడలో వివాదాలకు కారణమై ఆక్రమిత స్థలాన్ని తహసీల్దారు ఎస్.దుర్గేశ్వరరావు, ఎంపీడీవో జ్యోతి మంగళవారం పరిశీలించారు. ఓ ఆలయానికి చెందిన పూజారి స్థలం ఆక్రమణతో పాటు ప్రభుత్వం ఏర్పాటు చేసిన అంతర్గత రోడ్డును సైతం ఆక్రమించాడని గ్రామస్థులు తహసీల్దారు దృష్టికి తీసుకురాగా తాము ఎటువంటి ఆక్రమణలు చేసుకోలేదని, రోడ్డు భక్తుల విరాళాలతో నిర్మించామని, దీనిని గ్రామస్థులు కొందరు అడ్డుకుంటున్నారని ఆ పూజారి తెలిపారు. గతంలో ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన నివేశన స్థలాలు కావడంతో ఆ స్థలాల లబ్ధిదారుల పేర్లు, స్థలాల వివరాలను గ్రామస్థులు, అధికారుల నుంచి సేకరించి రికార్డులు పరిశీలించారు. పూర్తిస్థాయిలో పరిశీలించి తరుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గరిమెనపెంటలో 'జగనన్న సురక్ష-2'


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

కొండాపురం, ఫిబ్రవరి 13: మండలంలోని గరిమెనపెంట సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఏ.భవ్య రోగులకు పరీక్షలు నిర్వహించారు. 66 మందికి కంటి పరీక్షలుచేసి 48 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. అవసరమైన మందులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎంవీ నారాయణరావు, మండలపరిషత్ కార్యాలయ సీనియర్ సహాయకులు పీవీ.ప్రభాకర్, సీహెచ్‌వో చెంచురామయ్య, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన కందుకూరు విద్యార్థిని


చంద్రిక

కందుకూరు, ఫిబ్రవరి 13: జేఈఈ మెయిన్స్ ఫలితాలలో పట్టణంలోని శ్రీ గాయత్రీ జూనియర్ కళాశాల విద్యార్థిని కె.చంద్రిక 96.09 పర్సంటైల్‌తో అత్యుత్తమ ర్యాంకు సాధించిందని కరస్పాండెంట్ సీహెచ్ రామకృష్ణారావు తెలిపారు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన చంద్రిక పట్టుదల, దీక్షతో చదివి ఈ ర్యాంకు సాధించి అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించటమే గాక ఎన్‌ఐటీలో మంచి బ్రాంచిలో ఇంజనీరింగ్ చేసే అవకాశం దక్కించుకుందని తెలిపారు. ఏప్రిల్‌లో మరోసారి మెయిన్స్‌కు హాజరయ్యే అవకాశం ఉన్నందున పర్సంటైల్‌ను మెరుగుపరుచుకోవటమే లక్ష్యంగా కృషి చేస్తానని చంద్రిక పేర్కొన్నారు.

సీఎం సహాయనిధి నుంచి రూ.10 లక్షల మంజూరు

కందుకూరు, ఫిబ్రవరి 13: ఉలవపాడు మండలం చాకిచర్ల గ్రామానికి చెందిన సుదర్శి వెంకటేశ్వర్లుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.10 లక్షల మంజూరు కాగా మంగళవారం బాధితుడికి చెక్కును అందజేశారు. సుదర్శి వెంకటేశ్వర్లుకు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అవసరం కాగా తిరుపతిలోని ఓ కార్పొరేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం అవసరమైన పది లక్షలను ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు సీఎం సహాయనిధి నుంచి మంజూరు చేయించారు. మాధవరావు ప్రతినిధి తిరుపతిలో బాధితుడికి ఈ చెక్కును అందజేశారు.

కందుకూరులో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి

కందుకూరు, ఫిబ్రవరి 13: కందుకూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారని బీజేపీ కందుకూరు నియోజకవర్గ కన్వీనర్ ఘట్టమనేని హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. గత, ప్రస్తుత పాలకులు ట్రాఫిక్ సమస్యను ఎన్నికల సమయంలో ప్రస్తావించడం ఆ తర్వాత విస్మరించడం పరిపాటిగా మారిందని పేర్కొన్నారు. ప్రధాన వీధులలో ట్రాఫిక్ సమస్య విపరీతంగా పెరిగిపోవడానికి పాలకుల ముందుచూపులేని పాలనా విధానమే కారణమని తెలిపారు. ఫుట్‌పాత్‌లు దెబ్బతినిపోయి ప్రజలు నడిచేందుకు వీలులేకుండా పోయినా వాటికి మరమ్మతులు చేయలేదని పేర్కొన్నారు. కనిగిరి రోడ్డులో ఎల్ఐసీ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ సెంటర్ వరకు, పోస్టాఫీసు సెంటర్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు, వెంకటనారాయణ బజారు, పెద్దబజారులలో ప్రతిరోజు ఉదయం నుంచి రాత్రివరకు ప్రజలు అవస్థలు పడుతున్నా పాలకులు పట్టించుకోవటం లేదని విమర్శించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి మాస్టర్‌ప్లాన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పోలేరమ్మకు వైభవంగా గ్రామ పొంగళ్లు


గాజుల అలంకారంలో పోలేరమ్మ

బిట్రగుంట, ఫిబ్రవరి 13: బోగోలు మండలం నాగులవరం పంచాయతీ చెన్నారెడ్డి పాలెం కొత్తూరులో వెలసిన పోలేరమ్మ ఆలయ 9వ వార్షికోత్సవ సందర్భంగా మంగళవారం గ్రామ పొంగళ్లు కార్యక్రమం వైభవంగా జరిగింది. అమ్మవారికి పసుపు కుంకుమ సమర్పించారు. గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమించారు. అనంతరం అమ్మవారికి అభిషేకం, మొక్కుబడుల కార్యక్రమాలు జరిగాయి.